www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ప్రాణాలు తోడేస్తున్న **వాయుకాలుష్యం**

రోజువారీ మరణాల్లో 7.2 శాతానికి అదే కారణం.. లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి

2

శుక్రవారం | 5-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 80 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: అమావాస్య తె. 4.28 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆర్ద్ర తె. 4.06 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ. 12.22-1.59; దుర్ముహూర్తం: ఉ. 8.25-9.17, మ. 12.45-1.37; అమృతఘడియలు: సా. 6.01-7.37; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nalagonda | Nizamabad and Bengaluru



కప్పొంగిన అభిమానం

అటు అరేబియా సముద్రం.. ఇటు అభిమాన జన సంద్రం.. బ్రహ్మరథం పట్టడం అంటే ఇదేనేమో అనిపించేలా.. జగజ్జేతలకు జేజేలు పలకడం అంటే ఇదీ అనేలా.. భారత క్రికెట్ వీరులకు అపూర్వ స్వాగతం లభించింది. టీ20 ప్రపంచ కప్‌తో వచ్చిన రోహిత్‌శర్మ బృందానికి ముంబై మహా నగరం జయహో అంటూ జై కొట్టింది.. ఢిల్లీలో విమానం దిగిన దగ్గర మొదలైన అభిమాన ప్రవాహం ముంబై మెరైన్ డ్రైవ్ వరకు కొనసాగింది. జోరున వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా వెన్నంటి సాగింది.. గంటన్నర పాటు జరిగిన విజయ యాత్ర వాంఖడే వరకు బారులు తీరింది.. దిక్కులు దద్దరిల్లే నినాదాలతో మైదానం హోరెత్తింది. ఈ దృశ్యాలను చూసినవారి మనసు భావోద్వేగంలో తడిసి ముద్దయింది.

10



- ఓపెన్‌టాప్ బస్‌లో వస్తున్న భారత టీ20 జట్టుకు గురువారం ముంబైలోని మెరైన్ డ్రైవ్‌లో జన నీరాజనం
- ప్రధాని మోదీతో జట్టు సభ్యులు

జగన్ దుష్టపాలనలో అవినీతి విచ్చలవిడిగా జరిగింది. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే ఆయన ఏలుబడి వల్లే అధిక నష్టం జరిగింది.

వ్యూహాత్మక దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలంటూ జగన్ సర్కారుకు లేవు. దుందుడుకు విధానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. ఆర్థిక అక్రమాలు, సహజ వనరుల దోపిడీ పెద్దఎత్తున జరిగాయి.

రెవెన్యూ వసూళ్లు తగ్గిపోయాయి. అప్పులు తారస్థాయికి చేరుకున్నాయి. అభివృద్ధి కుంటుపడింది.

రాష్ట్రానికి కేంద్రం ఆర్థికంగా చేయూతనిస్తేనే ఈ సవాళ్లను ఎదుర్కోగలం.

- ప్రధానితో చంద్రబాబు

7 ప్రాధాన్యాంశాల నివేదన

- ఆర్థికంగా చేయూత
- పోలవరానికి సహకారం
- అమరావతికి అండ
- పారిశ్రామిక ప్రోత్సాహాలు
- మౌలిక వసతులకు అదనపు కేటాయింపులు
- వెనుకబడిన ప్రాంతాలకు 'బుందేల్‌ఖండ్' ప్యాకేజీ
- దుగరాజపట్నం అభివృద్ధికి చేయూత



ఢిల్లీలో మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రబాబు

ఆదుకోండి..!

ఐదేళ్లలో ఏపీ అస్తవ్యస్తం.. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం

కోలుకునేదాకా సాయం చేయండి.. ప్రధానికి చంద్రబాబు వినతి

- ఢిల్లీలో మోదీతో సీఎం సమావేశం
- నవ్యాంధ్రపై ఇప్పటికీ 'విభజన' దుష్పరిణామాల ప్రభావం
- దానికంటే జగన్ చేసిన నష్టమే ఎక్కువ
- తారస్థాయికి చేరిన అప్పులు
- ఆదాయం తగ్గింది.. ఖర్చు పెరిగింది
- మానవ వనరులపై నిర్లక్ష్యం
- ఇష్టానుసారం సహజ వనరుల దోపిడీ
- మౌలిక వసతులపై పెట్టుబడులే లేవు
- ప్రధానికి ముఖ్యమంత్రి ఫిర్యాదు
- పునర్నిర్మాణానికి చేయూత.. మోదీ హామీ

గత ఐదేళ్లలో ఆర్థికంగా అస్తవ్యస్తమై, అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రం కోలుకునే వరకు కొంతకాలం పాటు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక నిధుల నిర్వహణలో గత ప్రభుత్వం తీవ్రమైన అక్రమాలకు పాల్పడినందువల్ల రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు.

న్యూఢిల్లీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారి ఢిల్లీ వచ్చిన చంద్రబాబు గురువారం ప్రధానమంత్రితో సమావేశమయ్యారు. రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. ఏడు ప్రాధాన్యాంశాలను ఆయన ముందుంచి.. సంపూర్ణ సహకారం, సహాయం అందించాలని విన్నవించారు. రాష్ట్రానికి ఆర్థికంగా చేయూత.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకారం, అమరావతిలో ప్రభుత్వ సముదాయాలు, మౌలిక సదుపాయాలకు సమగ్ర ఆర్థిక మద్దతు.. పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహకాలు.. రోడ్లు, వంతెనలు, నీటిపారుదల, తాగునీటి ప్రాజెక్టుల వంటి అత్యవసర రంగాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి వ్యయం కోసం ప్రత్యేక సాయం కింద అదనపు కేటాయింపులు.. బుందేల్‌ఖండ్ తరహాలో వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, దుగరాజపట్నం రేవు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అభ్యర్థించారు. 2014లో ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా విభజించారని.. దాని పర్యవసానాలను

మిగతా 11వ పేజీలో...

- కేంద్ర మంత్రులు అమిత్‌షా, ఖట్టర్, గడ్కరీ, గోయల్, చౌహాన్, పురీలతోనూ చంద్రబాబు భేటీ
- రాష్ట్ర కేడర్ ఐఏఎస్, ఐపీఎస్‌లకు విందు
- నేడు నిర్మల, రాజ్‌నాథ్, నడ్డాతో చర్చలు
- నీతీ ఆయోగ్ సీఈవో, జపాన్ రాయబారితో కూడా

గ్రూప్-1లో

గోల్‌మాల్?

అస్మదీయ అభ్యర్థులకు మార్కుల వరద

- 2022 గ్రూప్-1 ఇంటర్వ్యూల్లో మతలబు?
- ఒక అభ్యర్థికి 75కు గాను 74.5 మార్కులు
- ఆయన గతంలో డీజీపీ కార్యాలయ ఉద్యోగి
- ధనుంజయ్‌రెడ్డి బంధువుకు 74 మార్కులు
- చాలామంది అభ్యర్థులకు 99 శాతానికి పైగా
- అక్రమాలంటూ తొలుత ఇంటర్వ్యూలు రద్దు
- మళ్లీ కొన్నాళ్లకు ఆకస్మికంగా పునరుద్ధరణ
- మార్కుల విషయంలో ఏపీపీఎస్సీ గోప్యత



(అమరావతి-ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ పరీక్షల తుది ఫలితాల్లో టాపర్‌కు వచ్చిన మార్కులు 2,025కి గాను 1,099. అందులో 275 మార్కుల ఇంటర్వ్యూలో టాపర్ సాధించింది 200(72.72%) మార్కులు. 'ఏపీపీఎస్సీ 2022లో నిర్వహించిన గ్రూప్-1 ఇంటర్వ్యూల్లో మార్కుల వరద పారించారు. కమిషన్ చరిత్రలోనే ఎన్నడూ లేనట్లుగా 'కొందరికి' 99శాతానికి పైగా మార్కులు వేసేశారు. గతంలో జరిగిన పోస్టుల భర్తీలో ఇలా 99శాతానికి పైగా మార్కులు ఎవరూ సాధించలేదు. ఇంటర్వ్యూలు చేసే బోర్డులు అన్ని మార్కులు వేయవు. కానీ జగన్ ప్రభుత్వంలో ఇన్ని మార్కులు ఎలా వేశారు? కళ్లు తిరిగే స్థాయిలో అన్నేసి మార్కులు వేయడం వెనుక ఆంతర్యం ఏమిటి? అనే అనుమానాలు

మిగతా 12వ పేజీలో...

వీరికే ఎందుకు?.. ఎలా?

ఇంటర్వ్యూలో ఒక అభ్యర్థికి ఏకంగా 74.5 (99.33%) మార్కులు వచ్చాయి. ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ గౌతం సవాంగ్ డీజీపీగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలోని టెక్నికల్ విభాగంలో ఆ అభ్యర్థి ఎస్ఐగా పనిచేశారు.

మరో అభ్యర్థి 74 మార్కులు సాధించారు. ఆయన మాజీ సీఎం జగన్‌కు కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డి బంధువు.

వీరిద్దరే కాదు. టాపర్లలో దాదాపు తొమ్మిది మందికి 74 మార్కులు వచ్చాయని విశ్వసనీయ సమాచారం.



ఇసుక కాంట్రాక్టులు రద్దు?

12

- ప్రాథమికంగా నిర్ణయం.. త్వరలో ఉత్తర్వులు
- తక్షణమే బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు
- ఉచిత ఇసుక అమలుకు కొనసాగుతున్న ఏర్పాట్లు
- ఆ జిల్లాల్లో 8 నుంచి ఆన్‌లైన్ పర్మిట్లు
- స్టాక్ పాయింట్లలో నిల్వలను గుర్తిస్తున్న గనులశాఖ

అందలం దిగని అక్రమార్కులు

గత ప్రభుత్వంలో చేసిన పాపాలకు అగ్గి

- అవినీతి బయటపడకుండా సర్దేస్తున్నారు
- ఎక్సైజ్, గనులు, సీఐడీలో ఫైళ్ల దహనం
- తాజాగా పీసీబీ ఫైళ్లకూ అదేగతి
- ఎన్నికల ఫలితాలు వెలువడి నెలయినా ఇంకా ఎక్కడి అధికారులు అక్కడే
- ఆధారాలన్నీ చెరిపేశాక చేసేదేమిటి?
- ఇప్పటి వరకు ఒక్కదానిపైనా విచారణ లేదు
- కూటమి ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు?

ఎన్నికల ఫలితాలు వెలువడి నెల రోజులు పూర్తయింది. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి మూడు వారాలు దాటింది. అయినా గత ప్రభుత్వంలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ఇప్పటికీ అవే స్థానాల్లో కొనసాగుతున్నారు. గతంలో జరిగిన అక్రమాల ఆనవాళ్లు కనిపించకుండా అన్నీ సర్దేస్తున్నారు. ఆధారాలను మాయం చేస్తున్నారు. ఫైళ్లను తగలబెడుతున్నారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా చంద్రబాబు ప్రభుత్వం ఏం చేస్తోంది? ఆధారాలన్నీ ధ్వంసం చేశాక అక్రమాలు బయట పెట్టేదెలా? శాఖల్లో పాతుకుపోయిన అవినీతి అధికారులను కదల్చకుండా నిజాలు నిగ్గు తేల్చడం సాధ్యమా?

12



బుధవారం రాత్రి పెనమలూరులో తగలబెట్టిన ఫైళ్లు

నిజానికి నిప్పు పెట్టిందెవరు?

- పీసీబీ ఫైళ్ల దహనం కేసులో అదుపులో ముగ్గురు
- మచిలీపట్నం తరలింపు.. వాంగ్మూలాలు నమోదు
- ద్వారంపూడి ఫ్యాక్టరీపై విచారణ చేస్తామన్న పవన్
- ప్రకటన వచ్చిన గంటల్లోనే ఘటన
- దీనిపైనా దృష్టి సారించిన ప్రత్యేక బృందం

ఏం మాట్లాడుతున్నారు.. జగన్!

- పరిస్థితి బాగలేక ఈవీఎంను పిన్నెల్లే బద్దలుకొట్టారట!
- ఇన్నాళ్లూ అది మార్ఫింగ్ అంటూ వైసీపీ నేతల వాదన
- నెల్లూరు జైలు ముందు నిజం 'బద్దలు' కొట్టిన జగన్
- ఐదేళ్లు అరాచకాల్లో మునిగి...'మాజీ' కాగానే నీతులు
- పాపాలు పండుతాయని చంద్రబాబుకు హెచ్చరికలు

జైలులో పిన్నెల్లికి వైసీపీ అధినేత పరామర్శ



(అమరావతి - ఆంధ్రజ్యోతి) 'నా క్లైంట్ దొంగతనాలు చేశాడు. అయితే ఉరి శిక్ష వేస్తారా? దోపిడీలు చేశాడు... అయితే ఉరి శిక్ష వేస్తారా? బాంబులు కూడా వేశాడు. అయితే, ఉరి శిక్ష వేసేస్తారా?'... అదేదో సినిమాలో కమెడియన్ లాయర్ తన క్లైంటునే ఇలా కోర్టులో ఇరికించేస్తాడు. ఇప్పుడు తమ నేత పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి విషయంలో జగన్ కూడా అదే చేశారు. 'పిన్నెల్లి ఈవీఎం పగలగొట్టలేదు. ఆ వీడియోలో ఉన్నది ఆయన కాదు. అయినా... లోకేశ్ పోస్టు చేసిన వీడియోపై ఎలా చర్యలు

మిగతా 11వ పేజీలో...

గంజాయి ఆచూకీ చెబితే

బహుమతి

- 10 రోజుల్లో అందుబాటులోకి టోల్ ఫ్రీ
- ఐజీ నేతృత్వంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలిస్తాం
- అమాయక గిరిజనులు 80% జైల్లో
- అసలైన స్మగ్లర్లకు ఉచ్చు: హోం మంత్రి

12

రైతులకు 1000 కోట్లు

- ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లించిన సర్కారు
- రూ.1,659 కోట్లు పెండింగ్ పెట్టిన గత ప్రభుత్వం
- సివిల్ సప్లయిస్‌ను 36 వేల కోట్ల అప్పుల్లోకి నెట్టేసింది
- వైసీపీ హయాంలో బియ్యం మాఫియా వ్యవస్థీకృతం
- కాకినాడ పోర్టు అడ్డాగా ద్వారంపూడి దోపిడీ
- పేదల పొట్టగొట్టి దోచిన వారిని వదలం: మంత్రి నాదెండ్ల

11

యువతిపై లైంగిక వేధింపులు

వైసీపీ మాజీ ఎమ్మెల్యే సుధాకర్ అరెస్టు

- 14 రోజుల రిమాండ్, కర్నూలు జైలుకు తరలింపు
- పోలింగ్ రోజు సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు



3

అమరావతికి కేంద్ర సంస్థల క్యూ!

- మళ్లీ రాజధానికి విచ్చేయనున్న 45 సంస్థలు
- సీఆర్‌డీఏతో సంస్థల ప్రతినిధుల చర్చలు
- జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సూచనలు
- 8 నుంచి పనులు ప్రారంభించే ఏర్పాట్లు
- సంస్థలతో ఎంఏయూడీ అధికారుల చర్చలు

3

ఉగ్రవాదాన్ని పెంచే దేశాలను ఏకాకిని చేయాలి

» ఎస్‌సీవో సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

అస్తానా, జూలై 4: ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న, ఉగ్రవాదులకు స్వర్గ ధామంగా మారిన దేశాలను ఏకాకిని చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. కజకిస్థాన్ అధ్యక్షతన అస్తానాలో నిర్వహిస్తున్న షాంఘై కోఆప రేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సులో మోదీ సందేశాన్ని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చదివి వినిపించారు. "ఎస్‌సీవో ఒక సూత్ర ఆధారిత సంస్థ. ఇది దాని సభ్య దేశాల పరస్పర అంగీకారంతో నడుస్తుంది. ఇవి మిగిలిన దేశాల సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, ప్రాంతీయ ఐక్యతను, సమానత్వాన్ని పర స్పరం గౌరవిస్తాయి. అలాగే ఒక దేశ అంతర్గత వ్యవహారాల్లో మరొకటి జోక్యం చేసుకోదు' అని మోదీ పేర్కొన్నారు. ఎస్‌సీవో వాస్తవ లక్ష్యాల్లో ఒకటైన ఉగ్రవాద నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

భారత్, చైనా సరిహద్దు సమస్యల సత్వర పరిష్కారం

సరిహద్దు వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయ త్నాలను రెట్టింపు చేయాలని భారత్, చైనా అంగీకరించాయి. గురువారం ఎస్ సీవో సదస్సుకు హాజరయ్యేందుకు కజకిస్థాన్‌లోని అస్తానా వెళ్లిన భారత విదే శాంగ మంత్రి ఎస్. జైశంకర్ అక్కడ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సరిహద్దు వెంబడి సమస్యల పరిష్కారానికి చర్చలను వేగవంతం చేయాలని ఇద్దరు నేతల మధ్య అంగీకారం కుదిరింది.

8న రష్యాకు ప్రధాని మోదీ.. ఐదేళ్ల తర్వాత తొలిసారి

న్యూఢిల్లీ, జూలై 4: ప్రధాని నరేంద్రమోదీ జూలై 8,9,10 తేదిల్లో రష్యా, ఆస్ట్రియా దేశాల్లో పర్యటించనున్నారు. 8న రష్యాకు వెళ్లనున్న ప్రధాని.. అక్కడ రెండు రోజుల పాటు జరిగే 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం ఆస్ట్రియాకు బయలుదేరి వెళ్లనున్నట్లు విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. 22వ శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి మోదీ సమీక్షించనున్నారు. కాగా, 2019లో వ్లాదివోస్టోక్‌లో జరిగిన ఆర్థిక సదస్సులో పాల్గొన్న మోదీ దాదాపు ఐదేళ్ల తర్వాత తిరిగి రష్యాలో పర్యటించబోతున్నారు. రష్యాలో సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రియాకు బయలు దేరి వెళ్లనున్నారు. 9,10 తేదిల్లో అక్కడ పర్యటిస్తారు. భారతదేశ ప్రధాని ఆస్ట్రి యాకు వెళ్లడం 41 ఏళ్లలో ఇదే ప్రథమం కావడం గమనార్హం.

నీట్-యూజీ పరీక్షను రద్దు చేయొద్దు

» సుప్రీంకు 'నీట్'లో అర్హత సాధించిన గుజరాత్ విద్యార్థులు

న్యూఢిల్లీ, జూలై 4: వివాదాస్పదమైన నీట్-యూజీ పరీక్షను రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వంతో పాటు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ)ను ఆదేశించాలని కోరుతూ గుజరాత్‌కు చెందిన 56 మంది నీట్ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్ర యించారు. పిటిషనర్లలో నీట్‌కు అర్హత సాధించిన వారితో పాటు ఫస్ట్ ర్యాంకు పొందిన వారూ ఉన్నారు. ఈ ఏడాది మే 5న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ చేసిన వారు, దానికి సహకరించిన వారు, అలాగే అన్యాయమైన పద్ధ తులను అనుసరించి పరీక్ష రాసిన వారిని విచారణ జరిపి గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర విద్యాశాఖను ఆదేశించాలని కూడా పిటిషనర్లు కోర్టును అభ్య ర్థించారు. అవకతవకల నేపథ్యంలో నీట్‌ను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని కోరుతూ దాఖలైన 26 పిటిషన్లపై ఈనెల 8న అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో.. గుజరాత్ విద్యార్థులు కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నీట్ పరీక్షను తిరిగి నిర్వహించడం వల్ల అర్హత సాధించిన అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్రాలకు బియ్యం విక్రయాల పునరుద్ధరణ

» ప్రైవేటు వ్యాపారులకు కూడా.. కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 4: రాష్ట్రాలకు సబ్సిడీ ధరపై బియ్యం విక్రయాలను పునరుద్ధరించాలని కేంద్రం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో ప్రైవేటు వ్యాపారులకు కూడా విక్రయించనుంది. తాను భారీగా సేకరించిన బియ్యం నిల్వలను తగ్గించుకోవడం ఈ నిర్ణయం ముఖ్యోద్దేశం. సబ్సిడీపై బియ్యం విక్ర యాలను కేంద్రం గత ఏడాది జూన్‌లో నిలిపివేయడంతో కర్ణాటక, తమిళ నాడు, కేరళ సహా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు పెద్దఎత్తున నిరసన తెలిపాయి. అయితే నిరుడు వర్షాలు సమృద్ధిగా పడనందున విక్రయాలు ఆపేశామని.. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ విభాగం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పంటల దిగుబడి బాగా ఉండే అవకాశం ఉండడం.. ఇదే సమయంలో ఆహార నిల్వలు బాగా పెరిగిపోవడం.. వాటి నిర్వహణకు బాగా ఖర్చవుతుండడం.. నిల్వకు ఉన్న గోదాములు కూడా సరిపోకపోవడం తదితర కారణాలతో విక్రయాలు పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. నిర్వహణ ఖర్చుల భారం రూ.16-18 వేల కోట్లు అధికంగా ఉండబోతోందని.. ఈ నెలలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనిని ప్రస్తావిం చనున్నట్లు వెల్లడించారు. పెరిగిన బియ్యం నిల్వలు తగ్గించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సారథ్యంలోని అంతర్-మంత్రిత్వ శాఖల కమిటీకి ఆహార శాఖ సిఫారసు చేసిందని.. దీంతో అమ్మకాల పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్నారని ఆయన వెల్లడించారు.

'వారాహి కాలనీ'

- కబ్జా విముక్త స్థలానికి నామకరణం
- కడప వాసి చెర నుంచి 4.86 ఎకరాలు స్వాధీనం
- కూటమి ప్రభుత్వ రాకతో ధైర్యం చేసిన బాధితులు
- పొక్లెయిన్‌తో ప్రహరీ కూల్చివేత
- గూండాల నుంచి భద్రత కల్పించాలని విజ్ఞప్తి



స్థలం చుట్టూ అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చేసిన దృశ్యం

సర్పవరం జంక్షన్(కాకినాడ), జూలై 4: అధికారం ఉంది కదా అన్న ధైర్యంతో, వైసీపీ నాయకుల అండతో కడప వాసి సుమారు రూ.20 కోట్ల వి లువైన స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. గూండాల ఆధ్వర్యంలో 4.86 ఎకరాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేశాడు. అడ్డొచ్చిన స్థల యాజమానులను తరివి తరిమి కొట్టాడు. న్యాయం చేయండి మహాప్రభో అని స్థల యజమానులు పోలీసుస్టేషన్లు, ఎమ్మెల్యేల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరం చూపలేదు. ఏంచేయాలో పాలుపోని బాధితులు కోర్టుకెక్కారు. ఈలోగా రాష్ట్రంలో అధి కారం మారింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి అక్రమ కట్టడాలను ఒక్కొక్కటిగా తొలగిస్తుండటంతో బాధితుల్లో ధైర్యం కలిగింది. కడపవాసి చెరలో ఉన్న స్థలాన్ని 20 మంది స్థల యాజమానులు స్వాధీనం చేసుకున్నారు. పొక్లెయి న్‌తో ప్రహరీని కూల్చివేశారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో గురువారం జరిగిందీ ఘటన. ప్రజల ఆస్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భద్రత కల్పిస్తున్నారని, దీనికి 'వారాహి కాల నీ'గా నామకరణం చేసుకుంటామని ఈ సందర్భంగా బాధితులు తెలిపారు. కబ్జాదారుల నుంచి భద్రత కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీని కోరామని చెప్పారు.

125 మంది బాధితులు..

వాకపూలడి పంచాయతీలోని 192/ఏ, 154/85, 156/85, 157/85 సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 4.86 ఎకరాల భూమిని మండా పోలేరమ్మ ఎల్పీ నెంబర్ 4/85 పేరిట లే అవుట్ చేశారు. 1968, 1976, 1985 సంవత్సరాలలో ఈ లేఅవుట్‌పై క్రయవిక్రయాలు జరిగాయి. ప్లాట్లు కొనుగోలు చేసిన సుమారు 125 మంది ఆధీనంలో ఈ స్థలం ఉంది. అయితే, కడప జిల్లాకు చెందిన వర్థిరెడ్డి సుబ్బారెడ్డి 2021 సెప్టెంబరు లో తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రజాప్రతినిధి అనుచరుడు బళ్ల సూరిబాబు ఆధ్వర్యంలో స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. కూటమి ప్రభుత్వం రావడంతో న్యాయం జరుగుతుందని భావించి తమ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి కాపాడుకున్నామని స్థల యాజమానులు విశ్వనాథం, శ్రీలక్ష్మి, సుబ్బరాజు, యువరాజు, వాసు, సీహెచ్ రాజు చెప్పారు.

ప్రాణాలు తోడేస్తున్న వాయుకాలుష్యం

హైదరాబాద్‌తోపాటు దేశంలోని పది నగరాల్లో అంతర్జాతీయస్థాయి అధ్యయనం

- రోజువారీ మరణాల్లో 7.2 శాతానికి వాయుకాలుష్యమే కారణం
- వాహన, పారిశ్రామిక ఉద్గారాలతోనే ముప్పు: లాన్సెట్

న్యూఢిల్లీ, జూలై 4: వాయుకాలుష్యం పలు రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చి పెట్టటమే కాదు.. ఏకంగా ప్రాణాలనే హరిస్తోంది. మన దేశంలో ప్రధాన నగ రాల్లో రోజువారీ సంభవించే మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలు వాయుకాలుష్యం వల్లనే సంభవిస్తు న్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ నగరాల్లో హైదరాబాద్ కూడా విశేషం. 'లాన్సెట్ ప్లానె టరీ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయనం వివరాలు ప్రచు రితమయ్యాయి. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, ఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజెస్ కంట్రోల్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన పరిశోధన సంస్థలతో కూడిన ఒక బృందం ఈ అధ్యయనం నిర్వ హించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, అహ్మదా బాద్, హైదరాబాద్, కోల్‌కతా, పుణె, షిమ్లా, వారణా సిల్లో పరిశోధకులు.. పీఎం 2.5 వాయుకాలుష్యానికి ఆయా నగరాల్లో మరణాలకు మధ్య ఉన్న సంబం ధాన్ని విశ్లేషించారు. 2.5 మైక్రాన్ల కంటే తక్కువ వ్యాసం ఉన్న కాలుష్య కణాలను పీఎం 2.5 కాలు ష్యంగా పేర్కొంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమా ణాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో ఒక ఘనపు మీటరుకు 15 మైక్రోగ్రాముల పీఎం 2.5లోపు ఉంటే అక్కడి గాలి సురక్షితంగా ఉన్నట్లు. అయితే, భారత్‌లో వాయు ప్రమాణాలు వేరుగా ఉన్నాయి. 60 మైక్రోగ్రా




ములలోపు పీఎం 2.5 ఉంటే నాణ్యమైన గాలిగా పరిగ ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మన దేశంలోని ప్రమా ణాల ప్రకారమే శాస్త్రవేత్తలు అధ్యయనం నిర్వహిం చారు. 2008-2019 మధ్య కాలంలో పది నగరాల్లో సంభవించిన 36 లక్షల మరణాలు, వాటికి కారణా లను విశ్లేషించారు. దీని ప్రకారం.. నగరాల్లో పీఎం 2.5 కాలుష్యానికి ప్రధాన కారణం వాహన, పారిశ్రామిక ఉద్గారాలే. రోజువారీ మరణాల్లో వీటి వల్ల సంభవిస్తు న్నవి 7.2 శాతం ఉన్నాయి. పీఎం 2.5 కాలుష్య కార కాలు సగటున 10 మైక్రోగ్రాములు పెరిగితే రోజువా రీగా 2.7 శాతం మరణాలు ఎక్కువగా సంభవిస్తు న్నాయి. ఢిల్లీలో పీఎం 2.5 కాలుష్యం అత్యధికంగా 113 స్థాయిలో ఉండగా, అక్కడి రోజువారీ మరణాల్లో 11.5 శాతం మరణాలకు వాయుకాలుష్యం కారణమవు తోంది. హైదరాబాద్‌లో పీఎం 2.5 38.9 ఉండగా, రోజువారీ మరణాల్లో 5.6 శాతం వాయుకాలుష్యం వల్ల సంభవిస్తున్నాయి. మొత్తం 10 నగరాల్లో షిమ్లాలో పీఎం 2 కాలుష్యం అత్యల్పంగా 28.4 స్థాయిలో ఉంది. అక్కడి రోజువారీ మరణాల్లో వాయు కాలుష్యం వల్ల సంభవిస్తున్నవి 3.7 శాతమే. ఈ అధ్య యనంలో పాలుపంచుకున్న ముఖ్య శాస్త్రవేత్తల్లో ఒక రైన భార్గవ్ కృష్ణ మాట్లాడుతూ, దేశంలో వాయుకా లుష్యం ఆందోళనకరస్థాయిలో పెరిగిపోయిందన్నారు. వాయునాణ్యతకు సంబంధించి భారత్‌లో నిర్ణయించు కున్న ప్రమాణాలు ఉండాల్సిన పరిమితి కన్నా ఎక్కు వగా ఉన్నాయని చెప్పారు.

సగటు పీఎం 2.5, రోజువారీ మరణాల్లో కాలుష్యం కారణంగా సంభవిస్తున్నవి (శాతంలో)

నగరం	సగటు	శాతం
అహ్మదాబాద్	37.9	5.6
బెంగళూరు	33.0	4.8
చెన్నై	33.7	4.9
ఢిల్లీ	113	11.5
హైదరాబాద్	38.9	5.6
కోల్‌కతా	55.2	7.3
ముంబై	41.7	5.6
పుణె	45.3	5.9
షిమ్లా	28.4	3.7
వారణాసీ	82.1	10.2
మొత్తం	53.6	7.2

లోకం తీరు



ఝార్ఖండ్ సీఎంగా
హేమంత్ ప్రమాణం

రాంచీ, జూలై 4: జేఎంఎం కార్యనిర్వాహక అధ్య క్షుడు హేమంత్ సోరెన్ (48) గురువారం ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా మళ్లీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హేమంత్ సోరెన్ చేత గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. హేమంత్ సోరెన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది మూడోసారి. ఈ కార్యక్రమంలో సోరెన్ తండ్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) చీఫ్ శిబూ సోరెన్, ఆయన తల్లి రుపి సోరెన్, భార్య కల్పనా సోరెన్‌తోపాటు జేఎంఎం నేతృత్వంలోని కూటమి సీనియర్ నేతలు, బుధవారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన చంపయి సోరెన్ కూడా పాల్గొ న్నారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఝార్ఖండ్ హైకోర్టు జూన్ 28న బెయిల్ మంజూరు చేయడంతో దాదాపు ఐదు నెలల తర్వాత హేమంత్ సోరెన్ జైలు నుంచి విడు దలయ్యారు. కాగా ప్రతిపక్షాలు తనపై కుట్రపన్నా యని, ఫలితంగా తాను దాదాపు ఐదు నెలల పాటు జైల్లో ఉండాల్సి వచ్చిందని హేమంత్ వీడియో సందేశంలో తెలిపారు. కాగా హేమంత్ సోరెన్ క్యాబినెట్‌కు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.



ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న హేమంత్

మైక్రోసాఫ్ట్‌లో మరోసారి ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ, జూలై 4: ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి లేఆఫ్‌లు ప్రకటించింది. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొన్ని బృందా లకు చెందిన ఉద్యోగులను తొలగించినట్లు 'గీక్‌వైర్' అనే మీడియా సంస్థ తెలిపింది. జూన్ 30తో ఆర్థిక సంవత్సరం ముగియ డంతో... కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ ఈ మార్పులు చోటుచేసుకు న్నట్లు స్పష్టమవుతోంది. ఎంతమందిని తొల గించింది అనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. అయితే తాజా తొలగింపులపై మైక్రో సాఫ్ట్‌పై అధికార ప్రతినిధి ఒకరు స్పందిం చారు. వ్యాపార నిర్వహణలో భాగంగా సంస్థా గతంగా కొన్ని మార్పులు తప్పవని తెలిపారు. వినియోగదారులకు, భాగస్వాములకు మెరు గైన సేవలు అందించే క్రమంలో కోతలు సర్వ సాధారణమేనని పేర్కొన్నారు. కాగా, మైక్రో సాఫ్ట్ ఈ ఏడాదిలోనే దాదాపు 3 వేల మందిని తొలగించింది.

8 నెలల గరిష్ఠానికి నిరుద్యోగ రేటు

- మేలో 7% నుంచి జూన్‌లో 9.2 శాతానికి!
- 2023 జూన్ నాటికి ఈ రేటు 8.5 శాతమే
- పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పురుషులతో పోలిస్తే మహిళల్లో అధికం
- సీఎంఐఈ హౌస్‌హోల్డ్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో నిరుద్యోగ రేటు జూన్‌లో 9.2 శాతానికి చేరిందని.. ఇది 8 నెలల గరి ష్ఠమని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకా నమీ (సీఎంఐఈ) వెల్లడించింది. 2024 మేలో 7 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. నెలలోనే 2.2 శాతం మేర పెరగడం గమనార్హం. 'కన్స్యూమర్ పిర మిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే ఆధారంగా సీఎంఐఈ ఈ వివరాలను విడుదల చేసింది. దాని ప్రకారం..

- గత ఏడాది ఇదే సమయానికి.. అంటే 2023 జూన్ నాటికి దేశంలో నిరుద్యోగ రేటు 8.5 శాతంగా ఉంది.
- నిరుడు జూన్‌లో 15.1 శాతంగా ఉన్న మహిళా నిరుద్యోగ రేటు.. ఈ ఏడాది మరింత పెరిగి 18.5 శాతానికి చేరింది. జాతీయ నిరుద్యోగరేటుకు ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం.
- పురుషుల్లో నిరుద్యోగరేటు గత ఏడాది జూన్‌లో 7.7% ఉండగా.. ఈ ఏడాది అది 7.8 శాతంగా ఉంది.
- ఎప్పటిలాగానే ఈసారి కూడా.. పట్టణ ప్రాంతా లతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు అధికంగా ఉంది. మే నెలలో గ్రామీణ ప్రాంతాల్లో 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. జూన్‌నాటికి 9.3 శాతానికి చేరింది. 2023లో ఇది 8.8 శాతమే. గ్రామీణ ప్రాంతాల్లో పురు షుల్లో మే నాటికి 5.4 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు జూన్‌కి 8.2 శాతానికి, మహిళల్లో నిరు ద్యోగ రేటు 12 శాతం నుంచి 17.1 శాతానికి పెరగడం గమనార్హం.
- పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు స్వల్పంగా మాత్రమే (మేలో 8.6% నుంచి జూన్‌లో 8.9 శాతానికి) పెరిగింది. పట్టణ మహిళల్లో నిరు ద్యోగ రేటు మాత్రం 18.53 శాతం నుంచి 21.36 శాతానికి పెరిగింది.

పని చేసినోళ్లకు ప్రాధాన్యమెలా?

నామినేటెడ్ పదవులపై టీడీపీ నాయకత్వం కసరత్తు

- ఒత్తిళ్లను తట్టుకున్నవారికి అవకాశం
- దాడుల బాధితులకు కూడా..
- నియోజకవర్గాలవారీగా వివరాల సేకరణ
- 8లోగా నామినేటెడ్ పోస్టుల వివరాలివ్వండి
- ఉన్నతాధికారులకు జీఏడీ ఆదేశాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్షంలో ఉండగా కష్టనష్టాలకోర్చి.. పార్టీని విజయపథంలో నడి పిన పార్టీ నేతలు, శ్రేణులకు ప్రభుత్వంలో ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వా లన్న అంశంపై టీడీపీ అధినాయకత్వం కసరత్తు చేపట్టింది. గత ఐదే ళ్లలో ఎవరు ఎలా పనిచేశారన్న అంశం ప్రాతిపదికగా వారందరికీ అంత ర్గతంగా ర్యాంకులు ఇచ్చి తదనుగుణంగా నామినేటెడ్ పదవుల్లో అవ కాశం ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో వివిధ శాఖలు, కార్పొరేషన్లల్లో ఉన్న నామినేటెడ్ పోస్టుల వివ రాలను సోమవారం లోపు పంపించాలని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) సర్క్యులర్ కూడా జారీ చేసింది. కొద్ది రోజుల క్రితం టీడీపీ కేంద్ర కార్యాలయంలోని వివిధ పార్టీ విభాగాల నేతలతో నాయకత్వం సమావేశం నిర్వహించింది. నామినేటెడ్ పదవుల భర్తీ, పార్టీకి- ప్రభుత్వా నికి మధ్య సమన్వయం, పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అనేక అంశాలపై చర్చించారు. అధికారంలోకి వచ్చాక నాయకుల సిఫారసు లతో అనేక మంది నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నిస్తుంటారని, అయితే వీరిలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాగా పనిచేసిన వారికి ఎలా ప్రాధాన్యమివ్వాలో కొన్ని ప్రతిపాదనలు వచ్చాయి. గత ఐదేళ్లలో ఏ నియోజకవర్గంలో ఎవరు ఎలా పనిచేశారు.. ప్రభుత్వ ఒత్తిళ్లను తట్టు కుని పనిచేసిన వారెవరు.. దాడులకు గురైన వారెవరు అనేవి పరిగణన లోకి తీసుకుంటూ సమాచారం సేకరించాలని.. దాని ప్రాతిపదికగా వారికి ర్యాంకులు ఇవ్వాలని ప్రాథమికంగా నిశ్చయించారు. నామినేటెడ్ పదవులు లేదా పార్టీ పదవులు ఇచ్చే సమయంలో ఈ అంశాలకు ప్రాధాన్యమిచ్చి తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ దిశగా కసరత్తు చేయాలని సమావేశం నిర్ణయించింది.

పార్టీ నేతల వినతులకు పెద్దపీట

ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నేతల నుంచి వచ్చే వినతులకు అగ్ర ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించేలా చూడాలని టీడీపీ నాయకత్వం నిశ్చయించింది. ఈ వినతులను మంత్రులు, అధికారులు, సంబంధిత శాఖలకు పంపే సమయంలో వాటిని రికార్డు చేసి.. అవి త్వరగా పరి ష్కారమయ్యేవరకు వెంటపడుతూ ఉండాలని, వాటిపై నిరంతర సమీక్ష ఉండేలా చూసుకోవాలని నిర్ణయించారు. కేంద్ర కార్యాలయానికి పార్టీ సభ్యులు ఎవరు వచ్చి వినతులు ఇచ్చినా.. వాటికొక నంబరు ఇచ్చి ప్రభుత్వ శాఖలకు పంపాలని.. అవి కూడా త్వరగా పరిష్కారం కావడా నికి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. వినతుల పరిశీలన, పరిష్కా రంపై దృష్టి పెట్టడానికి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక విభాగాన్ని ఏర్పాటు చేయడంపై కూడా చర్చించారు.

మండలాల నుంచీ అక్రమ కేసుల సమాచారం

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ శ్రేణులపై మోపిన అక్రమ కేసులపైనా సమావేశంలో చర్చించారు. అన్ని నియోజకవర్గాలు, అన్ని మండలాల నుంచి ఈ కేసుల సమాచారం తెప్పించి వాటిని విశ్లే షించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని, రాజకీయ వేధింపులకు గురైన కేడర్‌కు కేసుల నుంచి ఉపశమనం కల్పించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది.

వైసీపీ అక్రమాలపై చర్యలు..

వైసీపీ నేతల అక్రమాలపై ప్రతిపక్షంలో చేసిన పలు ఆరోపణల వి షయం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో అనేక అంశాలపై పార్టీ నేతలు ఆరోపణలు చేశారని, వాటిపై ఇప్పుడు చర్యలు తీసుకోవాలని కొందరు నేతలు సూచించారు. దీనికి నాయకత్వం అంగీకరించింది.

ఏ శాఖలో ఎన్ని నామినేటెడ్ పోస్టులు?

కార్పొరేషన్లు, సొసైటీల్లోవీ ఇవ్వండి: జీఏడీ

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ శాఖలు, కార్పొరేషన్లల్లో ఉన్న నామినేటెడ్ పోస్టుల వివరాలను వెంటనే పంపించాలని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లోని సర్వీసెస్ కార్యదర్శి పోలా భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నామి నేటెడ్ పోస్టులతో పాటు సొసైటీలు, ప్రత్యేక బాడీల్లో ఉన్న పోస్టుల వివరాలు కూడా సత్వరమే పంపించాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ఆదేశిం చారు. వచ్చే సోమవారం (8వ తేదీ) ఉదయం 11.30లోపు ఆ వివ రాలు పంపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలో నియమించే అన్ని పోస్టుల వివరాలను అందించాలని ఆదేశించారు.

హత్రాస్ తొక్కిసలాట కేసులో ఆరుగురి అరెస్టు

» ప్రధాన నిందితుడు దేవ్‌ప్రకాశ్ మధుకర్ ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమానం: పోలీసులు

హత్రాస్, జూలై 4: హత్రాస్ తొక్కిసలాట దుర్ఘటన కేసుకు సంబంధించి భోలే బాబా సేవాదారులు ఆరుగురిని అరెస్టు చేశామని యూపీ పోలీసులు ప్రక టించారు. ఆ ఆరుగురిలో సత్సంగ్ నిర్వాహక కమిటీకి చెందిన ఇద్దరు మహిళా సేవాదార్లు ఉన్నట్లు వారు వెల్లడించారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడు.. సత్సంగ్ నిర్వహణకు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్న సేవాదార్.. దేవ్‌ప్రకాశ్ మధుకర్ ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమానం ప్రకటిస్తామని అలీగఢ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శలభ్ మాథుర్ తెలిపారు. అతడిపై నాన్‌బెయిలబుల్ వారంట్ కూడా జారీ చేయనున్నట్లు చెప్పారు. తాము అరెస్ట్ చేసిన ఆరుగురిలో ఒకరైన రామ్ లద్దైతే (50), ఉపేంద్రసింగ్ యాదవ్ (62) మెయిన్‌పురివాసులని.. మిగతా నలుగురు మేఘ్ సింగ్ (61), ముఖేశ్ కుమార్ (38), మంజు యాదవ్ (30), మంజు దేవి (40) హత్రాస్‌వాసులని వివరించారు. వీరంతా సత్సంగ్ నిర్వాహక కమిటీ సభ్యులని, సేవాదార్లుగా పనిచేస్తున్నారని మాథుర్ తెలిపారు. ఆరోజు జనాన్ని అక్కడికి తరలించింది, విరాళాలు స్వీకరించింది వీరేనని వివరించారు. పెద్ద ఎత్తున వచ్చిన జనాన్ని నియంత్రించేందుకు పోలీసులను, అధికారులను వారు అనుమతించలేదని తెలిపారు. ఎఫ్‌ఐఆర్‌లో భోలే బాబా పేరును చేర్చకపోవడం గురించి ప్రశ్నించగా.. అవసరమైతే ఆయన్నూ ప్రశ్నిస్తామని పేర్కొన్నారు. ఇక ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారందరి వివరాలనూ గుర్తించి, మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేశామని పోలీసులు తెలిపారు. మరోవైపు యూపీలోని మెయిన్‌పురిలో ఉన్న భోలే బాబా ప్రధాన ఆశ్రమం 'రామ్ కుటీర్ చారిటబుల్ ట్రస్ట్'లో యూపీ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ భోలే బాబా లేరని, 30-40 మంది సేవాదార్లు మాత్రం ఉన్నారని మీడియాకు తెలిపారు. అయితే బాబా సత్సంగ్‌లో ఇంత ఘోరం జరిగినా ఇంకా చాలా మంది ఆయన ఆశ్రమం వద్దకు వచ్చి 'ఇలా జరిగిందేంటి బాబా' అని కన్నీరు పెడుతున్నారు. 'జై భోలే బాబా' అని నినాదాలు చేస్తున్నారు.

21న కైలాస దేశం వివరాల వెల్లడి

» నిత్యానంద స్వామి


చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం భారత్ నుంచి పరారై, ఈక్వెడార్ ప్రాంతానికి చేరువలో ఉన్న దీవిని కొనుగోలు చేసి ప్రత్యేక దేశం ఏర్పాటు చేసుకు న్నట్లుగా ఇంతకాలం సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్న వివాదాస్పద స్వామి నిత్యానంద ఎట్టకేలకు ఈ వివరాలను లోకానికి చాటేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 21న కైలాసదేశం గురించిన వివరాలను అధికారికంగా ప్రకటించనున్నట్లు తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. గురుపూర్ణిమ సందర్భంగా కైలాసదేశం ఎక్కడుందో లోకానికి ఎలుగెత్తి చాటిచెప్పనున్నానని, అందులో పౌరసత్వం కోసం త్వరగా దర ఖాస్తు చేసుకోవాలని కూడా సూచించారు.



24 గంటలు.. మూడు బ్రిడ్జిలు

» బిహార్ సరన్ జిల్లాలో కూలిన మరో వారధి

పట్నా, జూలై 4: బిహార్‌లో బ్రిడ్జిలు కూలిపోయే పరంపర కొనసాగుతోంది. ఒక్క సరన్ జిల్లాలోనే 24 గంటల్లో మూడో వారధి పడిపోయింది. ఆ రాష్ట్రంలో 17 రోజుల్లో ఇది 12వ ఘటన. సరన్‌లోని బనియాపూర్ బ్లాక్‌లో పదిహేనేళ్ల క్రితం నిర్మించిన చిన్న బ్రిడ్జి గురువారం కూలిపోయింది. గండకీ నదిపై కట్టిన ఈ వారధి సరన్‌లోని పలు గ్రామాలు, పొరు గునున్న సివాన్ జిల్లాలోని ఊళ్లను కలుపుతుంది. తాజా ప్రమాదంలో ఎవరూ చనిపోలేదని, ఘటనపై ఉన్నతాధికా రులతో విచారణ కమిటీని వేశామని సరన్ కలెక్టర్ అమన్ సమీర్ తెలిపారు. సరన్ జిల్లాలో దీనికిముందు జనతా బజార్, లహ్లాద్ పూర్ ఏరియాల్లో రెండు చిన్న బ్రిడ్జిలు పడి పోయాయి. ఈ జిల్లాలో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బ్రిడ్జిలు కూలడానికి ఇదీ ఓ కారణమని స్థానికులు చెబుతున్నారు. మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లోనూ ఇటీవలికాలంలో పది వారధులు కూలాయి. రాష్ట్రంలోని అన్ని పాత బ్రిడ్జిల పరిస్థి తిపై ప్రభుత్వం సమీక్షకు ఆదేశించింది. ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే వారధులు కూలుతున్నా యని బిహార్ అదనపు ప్రధాన కార్యదర్శి చైతన్య ప్రసాద్ (జల వనరులు) తెలిపారు. గండకీ నదిపై సివాన్, సరన్ జిల్లాల్లోనే బుధ, గురువారాల్లో 6 వంతెనలు పడిపోయాయ న్నారు. వీటిలో చాలావరకు 30ఏళ్ల కింద నిర్మించినవి, పునా దులు లోతుగాలేవని చెప్పారు. కాగా వరుస ఘటనల నేప థ్యంలో బిహార్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా సూచించాలని న్యాయవాది బ్రజేశ్ సింగ్ సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దేశంలోనే అత్యంత వరద ప్రభావిత రాష్ట్రం బిహార్ అని ఆయన పేర్కొన్నారు.



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి ప్రవహిస్తున్న గోదావరి

పోలవరం స్పిల్‌వే నుంచి నీటి విడుదల

పోలవరం, జూలై 4: పోలవరం ప్రాజెక్టు ఎగువన నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదులైన శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర, వర్ధ నదుల నీటి మట్టం పెరిగి గోదావరిలో నీరు చేరుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.390 మీటర్లు, దిగువన 16.430 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం ఎగువన 26.480 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాం దిగువన 16.520 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు. స్పిల్‌వేలోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్టు ఈఈలు మల్లికార్జునరావు, పి.వెంకటరమణ తెలిపారు.



పట్టిసీమ ఎత్తిపోతల నుంచి పోలవరం కుడికాల్వకు విడుదలైన గోదావరి జలాలు

పట్టిసీమ నుంచి 2,800 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం, జూలై 4: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 2,800 క్యూసెక్కుల గోదావరి జలాలు పోలవరం ప్రాజెక్టు కుడి కాలవకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డీఈఈ వీఆర్ఎస్ పెద్దిరాజు గురువారం తెలిపారు. పట్టిసీమ వద్ద గోదావరి నీటిమట్టం 14.74 మీటర్లకు పైబడి ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8 పంపులు 8 మోటార్ల ద్వారా నీటి పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు.

ఎండలు..వానలు..

▸ జంగమహేశ్వరపురంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఒక మోస్తరుగా కదులుతున్నాయి. అయితే, బంగాళాఖాతంలో రుతుపవనాలు బలంగా ఉండడంతో కోస్తా వైపు తేమగాలులు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. మిగిలిన చోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. జంగమహేశ్వరపురంలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

తిరుమలలో టాటా గ్రూప్స్ చైర్మన్

తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): టాటా గ్రూప్స్ చైర్మన్ చంద్రశేఖరన్ శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు స్వాగతం పలికి కాసేపు మాట్లాడారు. తిరుపతిలోని టాటా క్యాన్సర్ ఆస్పత్రి పనులపై చర్చించారు. ఆయనతో పాటు టీసీఎస్ ప్రెసిడెంట్ రాజన్న ఉన్నారు. కాగా, చంద్రశేఖరన్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.



చంద్రశేఖరన్‌ను సత్కరిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

9న శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల, జూలై4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. జూలై16న ఆణివార ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారం అష్టదళపాద పద్మారాధన సేను టీటీడీ రద్దు చేసింది.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయండి: రామకృష్ణ

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను వచ్చే ఆగస్టు 15న విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి గురువారం ఆయన లేఖ రాశారు. క్షణికావేశంలోనో, ఆగ్రహంతోనో తప్పు చేసినవారు సంవత్సరాల తరబడి జైలు గోడల మధ్య ఖైదీలుగా ఉండిపోతున్నారు. వారికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలి' అని రామకృష్ణ కోరారు.

అమరావతికి కేంద్ర సంస్థల క్యూ..!

▸ మళ్లీ రాజధానికి విచ్చేస్తున్న 45 సంస్థలు
▸ 40కి పైగా సంస్థలు సీఆర్‌డీఏతో చర్చలు
▸ జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సూచనలు
▸ సోమవారం నుంచి పనులు ప్రారంభించే ఏర్పాట్లు
▸ కొన్నిసంస్థలతో ఎంఏయూడీ అధికారుల చర్చలు

విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో కేంద్ర సంస్థలు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి క్యూ కడుతున్నాయి. గతంలో భూ కేటాయింపులు పొందిన సంస్థలు ఒక్కొక్కటిగా కాలుమోపుతుండగా తాజాగా కేంద్ర సంస్థలు కూడా అమరావతి బాట పడుతున్నాయి. సోమవారం నుంచి దాదాపు 45 కేంద్ర సంస్థలు అమరావతిలో తమకు కేటాయించిన భూములలో కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించనున్నాయి. కొన్ని సంస్థలు ఇప్పటికే సీఆర్‌డీఏ అధికారులతో టచ్‌లోకి వచ్చాయి. తమకు కేటాయించిన భూములను చదును చేసే అంశాలపై చర్చిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతి రాజధానిలో మొత్తం 132 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయి. వీటిలో కేంద్ర సంస్థలు 45 వరకూ ఉన్నాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత అమరావతి విధ్వంసానికి పాల్పడింది. కార్యాలయాల ఏర్పాటు, స్థలాల స్వాధీనం, అగ్రిమెంట్ల విషయంలో ఆయా సంస్థలను అనేక ఇబ్బందులకు గురిచేసింది. దీంతో గత ఐదేళ్ల కేంద్ర సంస్థలు ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలూ నిర్వహించలేకపోయాయి. కొన్ని సంస్థల భూకేటాయింపులను రద్దు చేస్తామని కూడా వైసీపీ ప్రభుత్వం బెదిరించింది. ఆయా సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పడంతో వెనకడుగు వేసింది. ఈ నేపథ్యంలో సంస్థలకు సహకరించకుండా ఇబ్బందులు పెట్టింది. టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో.. సుమారు 40 సంస్థలు మళ్లీ సీఆర్‌డీఏ అధికారులను సంప్రదిస్తున్నాయి. ప్రభుత్వ స్థాయిలో కూడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) అధికారులు మిగిలిన సంస్థలకు ఫోన్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు కూడా ఆయా సంస్థలతో మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీని కలిసిన సందర్భంలో కూడా కేంద్ర సంస్థలు అమరావతిలో తమ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ వెంటనే ప్రధాని కార్యాలయం నుంచి ఆయా సంస్థలకు యుద్ధ ప్రాతిపదికన అమరావతిలో కార్యాలయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాలు అందాయి. దీంతో గురువారం సాయంత్రమే కేంద్ర సంస్థల నుంచి సీఆర్‌డీఏ అధికారులకు ఫోన్ల మీద ఫోన్లు వచ్చాయి. దాదాపుగా అన్ని కేంద్ర సంస్థల నుంచి సానుకూలత, సుముఖత వ్యక్తమైంది. సోమవారం నుంచి తమ కార్యాలయాల ఏర్పాటుకు వీలుగా చర్యలు చేపడతామని ఆయా సంస్థలు సీఆర్‌డీఏకు తెలిపాయి. తమకు కేటాయించిన స్థలాలలో జంగిల్ క్లియరెన్స్ చేసి పెట్టాల్సిందిగా కొన్ని సంస్థలు సీఆర్‌డీఏను కోరాయి.

మల్లవల్లిలో ఆగస్టు నుంచి అశోక్ లేలాండ్ ఉత్పత్తి

మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి ప్రారంభం కావడానికి మార్గం సుగమమైంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చొరవతో ఆగస్టు నుంచి కార్యకలాపాలు నిర్వహించేందుకు అశోక్ లేలాండ్ సంస్థ సిద్ధమైనట్టు తెలిసింది. ఈ మేరకు త్వరలోనే ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడనుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భారీ పరిశ్రమల కేటగిరిలో అశోక్ లేలాండ్‌కు 75 ఎకరాలను కేటాయించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద హబ్‌గా ఇక్కడ ఎలక్ట్రికల్ బస్సుల బాడీ బిల్డింగ్ యూనిట్‌ను ఆ సంస్థ నెలకొల్పింది. కరోనా సమయంలో ఈ ప్లాంట్‌లో కార్యకలాపాలు ఆగిపోయాయి. కరోనా తర్వాత వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థకు సహకారం అందించలేదు. పైగా ఉత్పత్తిని ప్రారంభించడం లేదని నోటీసుల మీద నోటీసులు ఇచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అశోక్ లేలాండ్ మల్లవల్లి ప్లాంట్‌లో తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే సుధాకర్ అరెస్టు

▸ యువతిపై లైంగిక వేధింపుల కేసులో

14 రోజుల రిమాండ్, కర్నూలు జిల్లా జైలుకు తరలింపు

కర్నూలు, జూలై 4: యువతిపై లైంగిక వేధింపుల కేసులో వైసీపీకి చెందిన కోడుమూరు మాజీ ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌ను టూటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఆయన ఓ యువతిని లైంగికంగా సహకరించాలని బలవంతం చేసినట్టుగా ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో పాటు ఆ యువతి ఇటీవలే పోలీసులను ఆశ్రయించి మూడేళ్లుగా సుధాకర్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తాను భయపడి అప్పట్లో ఫిర్యాదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది. మైనర్‌గా ఉన్నప్పటి నుంచి తనను వేధిస్తున్నాడని, ఇప్పుడు మేజర్ కావడంతో ధైర్యంగా ముందుకు వచ్చినట్టు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో సుధాకర్‌ను ఉదయమే కర్నూలు టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. అనంతరం పోలీసులు ఆయన్ను కర్నూలు శివారులోని పంచలింగాలలోని జిల్లా జైలుకు తరలించారు.

ఉదయం నుంచి ఉత్కంఠ: సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఉదయం నుంచి అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన అరెస్టుపై గోప్యత పాటిస్తూ మీడియాకు వివరాలు పొక్కకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయనను పలు చోట్ల తిప్పుతూ రాచమర్యాదలు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో వైద్యపరీక్షలు చేయించారు. అక్కడి నుంచి నేరుగా ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడ సాయంత్రం దాకా ఉంచారు. ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్ఐలతో కూడిన పోలీసు బృందం సుధాకర్ అరెస్టును మీడియా కంట పడనీయకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ బృందంలోని ఓ పోలీసు అధికారి మొదటి నుంచి వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

పోలింగ్ రోజు నుంచే వీడియో వైరల్..!: సుధాకర్ ఓ యువతిని తన గదిలోకి తీసుకెళ్లి హత్తుకుంటూ లైంగికంగా వేధించినట్టు ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పోలింగ్ ముగిసిన రోజు సాయంత్రం ఆ వీడియోను సోషల్ మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఆ తర్వాత సుధాకర్‌తో పాటు మరికొంత మంది బాధిత యువతి కుటుంబంతో బలవంతంగా రాజీ చేయించినట్టు సమాచారం. అయినప్పటికీ తనకు న్యాయం జరగాలని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

వైఎస్ జయంతి కార్యక్రమానికి రండి

▸ కర్ణాటక సీఎంను ఆహ్వానించిన షర్మిల

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలో 8న నిర్వహిస్తున్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమానికి రావాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. ఈ మేరకు కార్యక్రమం ఆహ్వాన పత్రాన్ని గురువారంబెంగళూరులో ఆయన్ను కలసి షర్మిల అందజేశారు. ఆమె ఆహ్వానంపై సీఎం సిద్ధరామయ్య సానుకూలంగా స్పందించారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అల్లూరి స్ఫూర్తితో పురోగమించాలి: చంద్రబాబు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. 'భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహోజ్వల శక్తిగా వెలుగొందిన అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. గిరిజన, తాడిత పీడిత ప్రజలను స్వాతంత్ర్య సంగ్రామానికి సమాయత్తం చేసిన ఆ మహనీయుడి స్ఫూర్తితో మనం పురోగమించాల్సిన అవసరం ఇప్పటికే ఉంది. సమసమాజ స్థాపనకు అల్లూరి సీతారామరాజు చూపిన బాట మనకు ఆదర్శప్రాయం' అని చంద్రబాబునాయుడు ట్వీట్ చేశారు.



ఢిల్లీలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబు

టీడీపీ కార్యాలయంలో....

మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎన్ఆర్ఐ టీడీపీ కోఆర్డినేటర్స్ బుచ్చి రాంప్రసాద్, రాజశేఖర్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు: పల్లా

గాజువాక (విశాఖపట్నం), జూలై 4: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టనున్నట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. గురువారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

అల్లూరి పార్కుకు రూ.50 లక్షల ఎంపీ నిధులు: అయ్యన్న

కృష్ణాదేవిపేట (అనకాపల్లి జిల్లా), జూలై 4: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పార్కు అభివృద్ధికి ఎంపీ సీఎం రమేష్ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయిస్తామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. అల్లూరి జయంతి సందర్భంగా కృష్ణాదేవిపేటలో గల ఆయన సమాధి వద్ద అయ్యన్నపాత్రుడుతో పాటు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి తదితరులు నివాళులర్పించారు.



కృష్ణాదేవిపేటలో అల్లూరి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

పార్లమెంట్ ప్రాంగణంలో అల్లూరి విగ్రహం పెట్టాలి

▸ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మంత్రి సీతక్క

కవాడిగూడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిష్ఠించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. అల్లూరి విగ్రహం ఏర్పాటు కోసం తెలుగు రాష్ట్రాల ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం ట్యాంక్‌బండ్‌పై క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేరం ఎవరిది?

హత్రాస్ దేశమంతటికీ తెలిసిన పేరు. నాలుగేళ్ల కిందట అక్కడ ఒక దళిత అమ్మాయి అత్యాచారం, హత్య జరిగాయి. దోషులు అగ్రకులానికి చెందినవారు. ఎంతగా నిరసన వ్యక్తమైనా, ప్రభుత్వం చర్య తీసుకోవడానికి గాని, తీసుకున్నట్టు కనిపించడానికి కానీ సిద్ధపడలేదు. ఇప్పుడు, మరొక విషాదానికి హత్రాస్ కేంద్రమయింది. ఒక దళిత కుటుంబంలో సూరజ్ పాల్‌గా పుట్టి, నారాయణ్ సకాల్ హరి అలియాస్ భోలే బాబాగా ప్రసిద్ధుడయిన ఒక బాబా పాదధూళి కోసం మంగళవారం నాడు జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించారు. మరో ముప్పై మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయినవారిలో 112 మంది మహిళలే. ఇప్పుడు కూడా ప్రభుత్వం, అదే ఆదిత్యనాథ్ ప్రభుత్వం, ఎటువంటి కఠిన చర్య తీసుకోవడానికి సిద్ధంగా లేదు. బాబా మీద కేసే లేదు. ప్రభుత్వ యంత్రాంగం ప్రాణనష్టానికి ఎటువంటి బాధ్యతా తీసుకోవడం లేదు. అక్కడ భక్తుల సమావేశం (సత్సంగ్) నిర్వహించిన వారు ఆరుగురి మీద మాత్రం కేసు పెట్టారు. ఇదంతా అలక్ష్యం వల్ల, వైఫల్యం వల్లా జరగలేదని, ఏదో కుట్ర ఉండి ఉండవచ్చునని ప్రభుత్వ పెద్దలు అనుమానిస్తున్నారు. న్యాయవిచారణకు కూడా ఆదేశించారు.

భోలేబాబా మధుర, ఆగ్రా, హత్రాస్ పరిసర ప్రాంతాలలో బాగా ప్రసిద్ధుడు. ఈ సంఘటన తరువాత, డేరా బాబా వంటి వారితో ఈయన పేరును కలిపి చెబుతున్నారు కానీ, ఈయన పెద్ద హంగామా ఉన్న బాబా కాదు. భక్తులు మాత్రం దళితులతో పాటు, ఇతర కులాల్లో కూడా ఉన్నారు. ఈ బాబాను సమీపించడమే కష్టం అని చెబుతారు. మంచిచెడుల గురించి బోధనలు చేస్తాడని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉపదేశిస్తాడని భక్తులు చెబుతున్నారు. ఈయన గత చరిత్రలో ఏమన్నా నేరాలు, ఘోరాలు ఉన్నాయా అని పోలీసులు, మీడియా పరిశోధనలు చేశారు కానీ, పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసి స్వచ్ఛంద విరమణ చేసిన ఈ సూరజ్‌పాల్ మీద దాదాపు పాతికేళ్ల కిందట ఒక కేసు నమోదయింది. చనిపోయిన ఒక బాలికను బతికిస్తానని చెప్పి, ఖననం చేసిన శవాన్ని వెలికి తీయించిన అభియోగం అది. అప్పుడు ఆయన మీద ఆ నేరారోపణ ఉంది కానీ, తన సత్సంగ్‌లలో బాబా ఎటువంటి మాయమంత్రాలు ప్రదర్శించడని భక్తులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలు, మానసిక కలవరాలు ఆయన మాటలు వింటే తొలగిపోతాయని, మనశ్శాంతి దొరుకుతుందని వాళ్లు నమ్ముతున్నారు. ఇన్నిమరణాలకు కారణమైన సంఘటనలో బాబా నేరమేమీ లేదని, సొంతవారిని కోల్పోయిన భక్తులు కూడా వాదిస్తున్నారు.

ఎనభై వేల మంది హాజరవుతారని చెప్పిన సమావేశానికి రెండు లక్షల ముప్పైవేల మంది వచ్చారు. సమావేశ స్థలం పక్కన బురద నేల ఉంది. వర్షం వచ్చేట్టు ఉన్నదని వాతావరణ సూచన ఉన్నా, అక్కడ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు. కారులో వెడుతున్న బాబాను అందుకోవడానికో, కారు కింది మట్టిని ముట్టుకోవడానికో భక్తులు ఎగబడిపోయారు. అదుపు తప్పింది. సమావేశంలో క్రమశిక్షణ కోసం నిర్వాహకులు నియమించుకున్న వలంటీర్లు చేతులెత్తేశారు. ఏదో ప్రమాదం జరిగిందని పసిగట్టిన వెంటనే బాబా అక్కడి నుంచి పారిపోయాడు.

ఇప్పుడు నేరం ఎవరిదని చర్చ. బాబాను కేసులో చేర్చడానికి ప్రభుత్వం సంకోచిస్తున్నది. అతనికి ఉన్న ప్రజాదరణ రీత్యా ఆ సంకోచం సహజమే కావచ్చు. మరో పక్క, దేశవ్యాప్తంగా బాబా మీద చర్య కోసం డిమాండ్ పెరుగుతున్నది. ఇటువంటి జనసమీకరణలో, కార్యక్రమ నిర్వాహకుల బాధ్యత ఎంత, స్థానిక ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత ఎంత అన్న చర్చ కూడా అవసరం. రెండు లక్షలమందికి పైగా ఒక చోట గుమిగూడినప్పుడు, అక్కడ అవాంఛనీయ పరిస్థితులు నివారించడానికి ప్రభుత్వమే కల్పించుకోవడం ఆనవాయితీ. సమస్యల మీద గొంతెత్తే ప్రజలు నలుగురు గుమిగూడితే చాలు, పరిగెత్తుకువచ్చే పోలీసులు ఇంత జనసమ్మర్దాన్ని ఎట్లా వదిలేస్తారు? పరిస్థితిని అదుపు చేయడంలోను, త్వరితగతిన చెదరగొట్టి, వైద్య సదుపాయాలు అందించడంలోను వైఫల్యం ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అంగీకరించాలి.

అనుమతి పొందిన సంఖ్య కంటె ఎక్కువ మంది గుమిగూడడం, నిర్వాహకులు బాధ్యతారహితంగా ఉండడం వంటివి సాంకేతిక అంశాలు. ప్రభుత్వ యంత్రాంగం పాత్ర కూడా జవాబుదారీతనానికి సంబంధించినది. అసలు సమస్య, ఎందుకు అంత మంది అటువంటి బాబాలకు భక్తులవుతున్నారు? అతని వంటి వారి మాటల నుంచి, వారిని నమ్మడం నుంచి ప్రజలకు కలుగుతున్న ఉపశమనమేమిటి? వ్యవస్థాగతమైన, పాలనాపరమైన ఏ లోపాల నుంచి, ఏ జీవన సంక్షోభాల నుంచి ప్రజలు బాబాలను ఆశ్రయిస్తున్నారు? అవధులు దాటిన ఈ బాబా భక్తి వెనుక ఉన్న సామాజిక, మానసిక ధోరణులేమిటి? వీటిని శోధించాలి. అతనిని చూడడంలో, వినడంలో, చివరికి ధూళిని అందుకోవడంలో ఆ ప్రజలు చూపిన ఆత్రుత, తపన ఆశ్చర్యకరమైనవి. ప్రభుత్వాల నుంచి, వ్యవస్థల నుంచి పొందిన ఆశాభంగాలే, వారిని గుడ్డినమ్మకాల వైపు తరుముతున్నాయి. ఇటీవల తమిళనాడులో కల్తీ మద్యం తాగి పెద్ద సంఖ్యలో మరణించడానికి, ఈ తొక్కిసలాటకీ పెద్ద తేడా లేదు. రెండూ తరుణోపాయం కోసం ప్రజల ప్రయత్నంలో జరిగిన ప్రమాదాలే.

జలజగడాలు కొనసాగవలసిందేనా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన పదేళ్ల తర్వాత కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రుల స్థాయిలో సమావేశం కావాల్సిన దుస్థితి నేడు నెలకొని ఉంది. ఆశాజనకమైన అంశమేమంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవడం, అంతకుముందే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంసిద్ధత వెలిబుచ్చి ఉండడంతో ఇరువురిలోనూ సమస్యల పరిష్కారానికి నిజాయితీ ఉందని భావించవచ్చు. పైగా ముఖ్యమంత్రుల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు లేవు. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనే కాకుండా సోదరులైన ప్రజల మధ్య కూడా స్నేహ సంబంధాలు నెలకొనాలనే ఆకాంక్ష ఉంది. కాబట్టి పట్టువిడుపులతో ఇద్దరూ ప్రయత్నిస్తే ఈ ఒక్క సమావేశంలోనే అన్ని సమస్యలు పరిష్కారం కాకున్నా, ముున్ముందు దారి దొరకకపోదు. ఎంతటి జటిల సమస్యలనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకొన్న సంఘటనలున్నాయి. తెలుగు రాష్ట్రాల మధ్య ఉమ్మడి సంస్థల విభజన, ఆస్తుల పంపకాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర అనేక అపరిష్కృత సమస్యలు ఉన్నా ఇవన్నీ ప్రభుత్వాల స్థాయిలో ఉన్నవి మాత్రమే. కాని అంతర్ రాష్ట్ర జల వివాదాలు ప్రభుత్వాల మధ్యనే కాకుండా ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చురేగి పతాకస్థాయికి చేరి ఉన్నాయి. ప్రధానంగా ఇరువురు ముఖ్యమంత్రులు జల జగడాలకు ముందుగా తెరదించే యత్నం చేయాలి.

కేసీఆర్, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్న 2016 సెప్టెంబర్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఉప్పు నిప్పుగా ముగిసింది. తదుపరి అయిదేళ్ల కాలంలో కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఇరువురూ అలాయ్ బలాయ్ ఆడుకున్నా దుష్ఫలితాలే మిగిలాయి. కేసీఆర్ బడిపంతులు పాత్ర పోషిస్తే, జగన్మోహన్ రెడ్డి మన్నన గల విద్యార్థిగా వ్యవహరించేవారు. తత్ఫలితంగా మూడవ ట్రిబ్యునల్ నియామకం జరిగింది. పైగా కేసీఆర్, జగన్మోహన్ రెడ్డి ఇరువురూ పలుమార్లు సమావేశమైనా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య రావణ కాష్టంగా ఉన్న జల జగడాల గురించి గాని, ఇతర అపరిష్కృత సమస్యలు గాని చర్చకు వచ్చిన సందర్భం లేదు. వాళ్ళ ప్రైవేటు వ్యవహారాలతో పాటు విందులతో సమావేశాలు ముగిసేవి. ప్రస్తుత ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశం కావడంపై గొంతెండిపోతున్న దక్షిణ తెలంగాణ ప్రాంత ప్రజలతో పాటు నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమ వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

దక్షిణ తెలంగాణ ప్రజలు వేయికళ్లతో ఎదురు చూస్తున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి కేటాయింపుల్లో బ్రేక్ పడింది. ఈ మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిని కలిసినపుడు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కోరారు. నీటి కేటాయింపులు జరిగితే తప్ప ఆ ప్రాజెక్టు ముందుకు పోదు. ఆంధ్రప్రదేశ్ సహకరిస్తే గాని ఇది సాధ్యం కాదు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కెసి కెనాల్‌కు నీటి కేటాయింపులు ఉన్నాయి. 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు గల ఈ పథకానికి కేవలం 1.25 టియంసిలు నీటి సామర్థ్యం గల సుంకేసుల బ్యారేజీ ఒక్కటే దిక్కు. 20 టియంసిల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించాలంటే తెలంగాణ భూభాగంలో ముంపు వస్తుంది. తెలంగాణ అనుమతి ఇస్తేనే ముందుకు సాగుతుంది. రెండు రాష్ట్రాలకు ఉపకరించే సిద్దేశ్వరం అలుగు నిర్మాణం జరగాలన్నా తెలంగాణ ఆమోదం తప్పని సరి. ఒక్క మాటలో చెప్పాలంటే కవల పిల్లలు వాణి–వీణ విడివడలేక ఎలా బాధపడుతున్నారో అలా కృష్ణా జలాల అంశంలో దక్షిణ తెలంగాణ, రాయలసీమ వాసుల పరిస్థితి ఉంది. జల జగడాలకు సంబంధించి ఇరువురు ముఖ్యమంత్రులు ముందుగా ఒక అంశం పరిగణనలోకి తీసుకోవాలి. దక్షిణ తెలంగాణ ప్రాంతంలోనూ, రాయలసీమలోనూ పెండింగ్ ప్రాజెక్టులు గాని కొత్త ప్రాజెక్టులు గాని పట్టాలెక్కాలంటే ట్రిబ్యునల్ తీర్పులతో ఇప్పట్లో సాధ్యం కాదు, ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో రాజీపడి వ్యవహరిస్తేనే సాధ్యమవుతుంది. వాస్తవంలో నీటి లభ్యత ఎంత? అనేది ముందుగా అంచనాకు రావాలి. నీటి లభ్యత ఎక్కువగా ఉన్నపుడు లేక తక్కువగా ఉన్నపుడు ఆ మేరకు ఇరు రాష్ట్రాలు భరించే సానుకూల విధానం చేపట్టాలి.

గత పదేళ్లుగా కేసీఆర్ అమలు జరిపిన భావోద్వేగ విధానాల ఫలితంగా జరిగిన నష్టం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనంలోకి తీసుకోవాలి. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు విచారణ చేపట్టిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పదేళ్లు గడచిపోయినా ఇంతవరకు బయటికి రాలేదు. తిరిగి మరో ట్రిబ్యునల్ ఏర్పడింది. ఇది ఎంత కాలం తీసుకొంటుందో ఎవరూ చెప్పలేరు. అప్పటి వరకు సోదరులైన తెలుగు ప్రజలతో ఉన్న రెండు రాష్ట్రాల మధ్య జలజగడాలు కొనసాగవలసిందేనా? ఈ పదేళ్ల కాలంలో అటు దక్షిణ తెలంగాణలోనూ, ఇటు రాయలసీమలోనూ నెర్రెలు బారిన పొలాలకు ఉపయోగపడే ఎంతో విలువైన కృష్ణా జలాలను కేసీఆర్.. శ్రీశైలం నుంచి సముద్రం పాలు చేశారు. శ్రీశైలం కింద భాగంలో అవసరం లేకున్నా విద్యుదుత్పత్తి పేరు చెప్పి వృథా చేశారు. 2023 మే నెలతో ఆఖరైన నీటి సంవత్సరంలో శ్రీశైలం జలాశయానికి 2040 టియంసిల జలాలు వస్తే, 1330 టియంసిల నీళ్లు సముద్రం పాలయ్యాయి. రెండు రాష్ట్రాలు సఖ్యతగా ఉండివుంటే బచావత్ ట్రిబ్యునల్ తీర్పు మేరకు నికర జలాలు 811 టియంసిలు పోగా, క్యారీ ఓవర్ కింద అనుమతించిన 150 టియంసిలు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిల్వ చేసుకొని ఉండవచ్చు. అదే జరిగివుంటే 2024 వేసవిలో హైదరాబాద్ జంటనగరాల తాగునీటి కోసం సాగర్ నుండి ఎత్తిపోతలు తప్పేవి కదా? ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు ఈ సంక్షోభం కొనసాగకుండా తెరదించవలసిన కర్తవ్యం ముఖ్యమంత్రులుగా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి మీద ఉంది. రాజకీయ ప్రయోజనాలు విస్మరించి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చర్చలు జరిపితే ఏదో ఒక తాత్కాలిక ఏర్పాటు కనుగొనవచ్చు.

బచావత్ ట్రిబ్యునల్ తీర్పుతో తెలంగాణకు అన్యాయం జరిగిందనే వాదన ఉంది. అయితే ఈ అన్యాయం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటి వాటాలు పంచినపుడు జరిగిందనే అంశం విస్మరించకూడదు. దక్షిణ తెలంగాణ వాసులులాగే అవశేష ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాయలసీమ వాసులు తమకూ అన్యాయం జరిగిందనే భావనతో ఉన్న విషయం అందరికీ తెలుసు. బచావత్ ట్రిబ్యునల్ కూడా 1969కి నిర్మింపబడిన లేక నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాతిపదికగా తీసుకొని కృష్ణా జలాలను బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. తదుపరి 2004లో వచ్చిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కూడా బచావత్ ట్రిబ్యునల్ పంపిణీ చేసి, వినియోగంలో ఉన్న నీటి కేటాయింపుల జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎలాంటి తీర్పు ఇస్తుందో పక్కన పెడితే, తాజాగా రెండు రాష్ట్రాలు కలసి 2099 టియంసిలు తమకు కేటాయించాలని ట్రిబ్యునల్ ముందు స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ దాఖలు చేశాయి. తెలంగాణ 954.9 టియంసిలు కోరితే ఆంధ్రప్రదేశ్ 1,144 టియంసిలకు టెండర్ పెట్టింది. బేసిన్ మొత్తం మీద 2130 టియంసిలు లభ్యమవుతాయని బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసి పంపకం చేస్తే, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ మరొక 448 టియంసిల నికర మిగులు జలాలు బేసిన్ మొత్తం మీద ఉంటాయని అంచనా వేసింది. మరి రెండు తెలుగు రాష్ట్రాలకే 2099 టియంసిల నీళ్లు ట్రిబ్యునల్ ఎక్కడ నుండి తెచ్చి పంపకం చేస్తుంది? ఇంత కథనం ఎందుకంటే కేసీఆర్ నీళ్ల రాజకీయ వ్యూహం ఏ కడకు దారి తీసిందో, సాగునీటిరంగ నిపుణులు ముందు నవ్వుల పాలు చేసిందో తెలియజెప్పడానికి మాత్రమే. నేల విడిచి సాము చేసే ఈ పెడధోరణుల నుండి ఇరువురు ముఖ్యమంత్రులు బయటపడవలసి ఉంది.

ఉభయ తెలుగు రాష్ట్రాల ముందు మరో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోజు కాకున్నా రేపైనా సుప్రీంకోర్టు స్టేతో ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలుకు రావచ్చు. అదే జరిగితే కృష్ణలో మరొక 285 టియంసిల నీళ్లను ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటకకు ఏకంగా 170 టియంసిలు కేటాయించింది. పైగా ఆల్మట్టి ఎత్తు 525 మీటర్లకు పెంచుకొనే వెసులుబాటు కల్పించింది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నికరంగా దక్కేది కేవలం 38 టియంసిలు మాత్రమే. కాగా విద్యుదుత్పత్తి పేర మహారాష్ట్ర పశ్చిమ కనుమల నుండి ఎంత నీరు సముద్రం పాలు చేస్తోందో గణాంకాలు లేవు. ఈ పదేళ్ల కాలంలో కేసీఆర్ ఎప్పుడూ ఎగువ రాష్ట్రాల జల దోపిడీ గురించి మాట మాత్రంగా ప్రస్తావన తేలేదు. ప్రతి క్షణం ఆంధ్రోళ్ల దోపిడీ అంటూ భావోద్వేగాలు పండించుకొనేందుకు విఫలయత్నాలు చేశారు. ఇప్పటికైనా ఇరువురు ముఖ్యమంత్రులు ముున్ముందు రానున్న ప్రమాదం గురించి ఆలోచన చేయాలి. తమ మధ్య ఉన్న సమస్యలు రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలుగకుండా పరిష్కారం చేసుకొంటూ, ఎగువ రాష్ట్రాల జల దోపిడీకి వ్యతిరేకంగా సంయుక్తంగా పోరాడాలి.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



తెలుగు రాష్ట్రాల ముందు మరో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోజు కాకున్నా రేపైనా సుప్రీంకోర్టు స్టేతో ఉన్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలుకు రావచ్చు. అదే జరిగితే కృష్ణలో మరొక 285 టియంసిల నీళ్లను ఎగువ రాష్ట్రాలు తన్నుకుపోతాయి. ఇరువురు ముఖ్యమంత్రులు తమ మధ్య ఉన్న సమస్యలు రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలుగకుండా పరిష్కారం చేసుకొంటూ, ఎగువ రాష్ట్రాల జల దోపిడీకి వ్యతిరేకంగా సంయుక్తంగా పోరాడాలి.

హరిత ధరిత్రే మనిషి ఆరోగ్య భాగ్యం



■ సునీతా నారాయణ్

మట్టివాసన

శీతోష్ణస్థితిలో మార్పు దైనందిన వాతావరణాన్ని (ఒక ప్రదేశంలో ఒకే సమయంలో ఉన్న వేడి, చలి, తడి, పొడి మొదలైన పరిస్థితులు) ప్రభావితం చేస్తోంది; ఈ ప్రభావ ప్రాబల్యం అశేష ప్రజల జీవితాలు, వారి జీవితాధారాలను సమస్యలపాలు చేస్తోంది. అయితే వాతావరణంలో తీవ్ర వైపరీత్యాలు మానవ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయన్న విషయమై మనం చర్చించడం లేదు. ఉష్ణోగ్రతలు అదుపు తప్పుతున్న ఈ నిరాశామయ కాలంలో, వడగాడ్పులు అనేక మంది ప్రజలను, ముఖ్యంగా పేదలను ఎలా చంపుతున్నాయో మనకు తెలిసివస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రత – రాత్రి పూట వేడి– మనుషుల మరణాలకు ఎలా కారణమవుతుందో కూడా మనం తెలుసుకుంటున్నాం. మారుతోన్న వాతావరణంతో సుదూర భవిష్యత్తులో సంభవించనున్న విపత్తు, మన ఆరోగ్యానికి ఎలా, హానికరం కానున్నదో కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఈ ఏడాది ప్రపంచ ప్రజలు 'పగళ్లన్నీ పగిలిపోయి/ నిశీథాలూ విశీర్ణిల్లిన' ఎండాకాలాన్ని చవి చూశారు. అవును, ఈ ప్రచండ వేసవిలో (జూన్ మాసాంతంలో ఈ వ్యాసం రాస్తున్న సమయానికి) న్యూ ఢిల్లీలో 270 మంది వడదెబ్బకు చనిపోయారని అధికారిక వర్గాలు అంచనా వేశాయి. అయితే ఈ మృతుల సంఖ్యను అంగీకరించేందుకు సందేహిస్తున్నాను. నిజంగా ఎంత మంది చనిపోయిందీ మనకు తెలియదు. ఎందుకంటే హృద్రోగాలు, మూత్ర పిండాల సంబంధిత జబ్బులు మొదలైన ఆరోగ్య సమస్యలను వేసవి వేడి మరింతగా ప్రకోపింప చేస్తుంది. కనుక ఈ వేసవిలో ఇంకా ఎంతో మంది ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పోయి తుది శ్వాస విడిచి వుంటారు. అయితే డాక్టర్లు ఆ మరణాలకు దారితీసిన యథార్థ కారణాలను అలక్ష్యం చేస్తున్నారు. నిరుపేదలు (నిర్మాణ కార్మికులు, సన్నకారు రైతులు తదితరులు) తమ శ్రమ జీవన పరిసరాలు, పరిస్థితుల కారణంగా ఎండల తీవ్రతకు అతిగా లోనవుతారు. మూడు పూటలా తిండికే నోచుకోని అభాగ్యులకు విద్యుత్ వసతులు అంతగా ఉండవు, అసలు లేకపోనూవచ్చు. మరి అటువంటి దుస్థితిలో కునారిల్లుతున్నవారు పని అనంతరం సేదదీరేందుకు అవసరమైన అత్యాధునిక సదుపాయాలు కలిగి ఉండరనడంలో సందేహం లేదు. ఇటువంటి నిర్భాగ్యుల మరణాలు ఎండ తీవ్రతకు సంభవించినవిగా రికార్డు కావడం లేదు. ఆ మృతులలో అత్యధికులు పేదలు లేదా వృద్ధులు అయివుంటారు. 'అజ్ఞాత కారణాల' వల్ల వారు ఈ లోకం నుంచి వెళ్ళిపోయిన వారుగా నమోదవుతున్నారు! భారత ప్రభుత్వ నోటిఫైడ్ డిసీజెస్ (డాక్టర్లు రోగ నిదానం చేసినప్పుడు ఏ జబ్బులనయితే ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రజారోగ్య అధికారులకు విధిగా వాటి గురించి తెలియజేయవలసి ఉంటుందో ఆ వ్యాధులు)లో వడగాడ్పు మరణాలు లేవు. ఈ కారణంగా వాటిని రికార్డు చేయవలసిన, లేదా వాటి గురించి అధికారులకు సమాచారమివ్వాల్సిన అవసరం ఉండదు. ఇందువల్లే ఈ వేసవిలో తీవ్ర గాడ్పుల మూలంగా ప్రజల ఆరోగ్యానికి వాటిల్లిన హాని, సంభవించిన మరణాల గురించి మనకు కచ్చితంగా తెలిసింది తక్కువ అని గుర్తించవలసి ఉంది.

అయితే ఇప్పుడు వివిధ పరిశోధనలు ప్రాణాంతక వడగాడ్పుల తీవ్రతను స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతల పెరుగుదల గరిష్ఠ మరణాలకు కారణంగా ఉన్నదనేది తొట్ట తొలుత మనం అర్థం చేసుకోవల్సిన వాస్తవం. 'రాత్రిపూట ఉష్ణోగ్రత అధికంగా ఉన్న రోజుల్లో వడగాడ్పుల మరణాలు, రాత్రి పూట ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న రోజుల్లో కంటే 50 శాతం అధికంగా ఉంటున్నట్టు' బ్రిటిష్ మెడికల్ జర్నల్ 'ది లాన్సెట్'లో రెండేళ్ల క్రితమే (2022లో) ప్రచురితమైన ఒక పరిశోధనా పత్రం వెల్లడించింది. కారణమేమిటి? అధిక ఉష్ణోగ్రత నిద్రను ప్రభావితం చేస్తుంది. తత్కారణంగా, శ్రమతో అలసిన దేహం తనకు తానుగా ఉపశమనం పొందలేదు. దీని మూలంగా వేడి తీవ్రతకు శరీరం ఎక్కువగా లోనవుతుందని ఆ పరిశోధకుడు పేర్కొన్నాడు.

హెచ్చు ఉష్ణోగ్రతల మూలంగా సంభవిస్తున్న మరణాలు పట్టణాలు, నగరాలలో పెరుగుతున్నాయి. ఆ ఉష్ణోగ్రతలు మానవ శరీరాలు భరించే శక్తికి మించి ఉంటున్నాయి. 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'లో నా సహచరులు ఇటీవల రూపొందించిన ఒక నివేదిక ప్రధాన భారతీయ నగరాలలో వేడి పెరుగుదల తీరుతెన్నులు ఎలా ఉన్నాయో వివరించింది. నగర పరిసరాలలో వ్యాపించి ఉన్న ఉష్ణోగ్రతలు దేశ సగటు ఉష్ణోగ్రత కంటే ఎక్కువగా పెరుగుతున్నాయని వెల్లడయింది. 2001–2010 దశకంతో పోలిస్తే 2014–2024 దశకంలోని వేసవి కాలాలలో తేమ 5 నుంచి 10 శాతం మేరకు పెరిగినట్టు ఆ నివేదిక వెల్లడించింది. ఒక్క బెంగళూరులో మాత్రమే తేమ పెరుగుదల సంభవించ లేదు. ఇందుకు కారణాలేమిటో శోధించవలసి ఉన్నది. దేశ వ్యాప్తంగా అన్ని వాతావరణ మండలాలలోను రాత్రిపూట నగరాలలో వాతావరణం చల్లబడడం లేదని కూడా ఆ నివేదిక వెల్లడించింది. 2001–10 దశకం వేసవి కాలాలలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు పగటి పూట గరిష్ఠత కంటే 6.2 శాతం తగ్గి 13.2 శాతంగా ఉన్నాయి. అయితే గత పది వేసవి కాలాలలో పగలు, రాత్రి పూట ఉష్ణోగ్రతలలో తేడా అంటే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం తగ్గుముఖం పట్టింది. ఈ తగ్గుదల హైదరాబాద్‌లో 13 శాతంగా ఉన్నది. ఢిల్లీలో 9 శాతం, బెంగళూరులో 15 శాతం మేరకు ఆ తగ్గుదల ఉన్నది. కోల్‌కతాలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉన్నది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండడమే అందుకు కారణం.

మన ధరిత్రి అంతకంతకూ వేడెక్కుతోంది. ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రతలు గత గరిష్ఠ రికార్డులను బద్దలు కొట్టాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే వర్షపాతం క్రమరహితంగా ఉంటోంది. కొద్ది రోజులు అతివృష్టి. సుదీర్ఘంగా అనావృష్టి. ఉష్ణోగ్రతలూ నిలకడగా ఉండడం లేదు. మొత్తం మీద వాతావరణ వైపరీత్యాలు అంతకంతకూ మరింత హానికరమవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాయు విన్యాసాలలో మార్పులు సంభవిస్తున్నాయి. ఇవన్నీ వేసవి తాపాన్ని విపరీతంగా పెంచుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఆ పెరుగుదల ప్రాణాంతకంగా ఉంటోంది. మరో వైపు మన నగరాలలో సూక్ష్మ శీతోష్ణస్థితి (మైక్రో క్లైమేట్– మిక్కిలి చిన్న ప్రదేశంలో ఉండే శీతోష్ణస్థితి)లో ఆకస్మిక మార్పులు సంభవిస్తున్నాయి. హీట్ ఐలెండ్ ఎఫెక్ట్ అనబడే ఈ పరిణామం మరింతగా తీవ్రమవుతోంది. నగరాలు కాంక్రీట్ భవనాలమయం కావడమే ఇందుకు కారణమని మరి చెప్పనవసరం లేదు. రోడ్లపై వాహనాల రద్దీ, ఇంధన వినియోగం, ఎయిర్ కండిషనర్ల వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో కర్బన ఉద్గారాలు పెరిగి వాతావరణంలో వేడి అధికమవుతోంది.

వేడి తీవ్రతకు సంబంధించి ఈ వేసవి మనకు కొత్త పాఠాలను నేర్పింది. వాస్తవమేమిటంటే వాతావరణ మార్పు అనేక ఆశ్చర్యకర పరిణామాలకు దారితీస్తోంది. మానవ ఆరోగ్యంపై వాటి ప్రభావం విషమపూరితంగా ఉంటోంది. ఇప్పటికీ ఈ మార్పులను సమగ్రంగా అర్థం చేసుకోవడం జరగలేదు. వాతావరణ మార్పు మన ఆరోగ్యంపై ఎటువంటి ప్రభావం చూపనున్నది ఇంకా విపులంగా అర్థం చేసుకోవల్సి ఉన్నది. మానవ తప్పిదాల కారణంగా పదే పదే ప్రాకృతిక విపత్తులు సంభవిస్తున్నాయి. మన సమున్నత, అధునాతన నాగరికతలకు ఆలంబన అయిన ప్రాకృతిక వనరులు వేగంగా క్షీణించి పోతున్నాయి. జీవ వైవిధ్యం హరించుకుపోతోంది. ఇటువంటి విపత్కర పరిస్థితులు ధరిత్రి ఆరోగ్యాన్ని సమస్థితిలో ఉంచుతాయా? ధరిత్రి ఆరోగ్యం (ప్లానేటరీ హెల్త్) సమస్థితిలో ఉన్నప్పుడే మానవాళి ఆరోగ్యం భద్రంగా ఉంటుంది మానవ ఆరోగ్యం గురించిన సంప్రదాయక అవగాహనలో మౌలిక మార్పు తెచ్చిన భావనే ప్లానేటరీ హెల్త్. ప్రాకృతిక వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే ఈ భావన ప్రజారోగ్య భావన కంటే విశాలమైనది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మానవ జీవన విధానాలు, వాటికి ఆధారమైన ప్రాకృతిక వ్యవస్థల ఆరోగ్యమే ప్లానేటరీ హెల్త్. మరి ధరిత్రి ఆరోగ్యం భద్రంగా ఉండాలంటే మనం పర్యావరణ సమతౌల్యతను కాపాడుకున్నప్పుడే ధరిత్రికి శ్రేయస్సు, మానవాళికి ఆరోగ్య సంక్షేమం సమకూరుతాయి. వాతావరణ మార్పు అనేది మన అస్తిత్వ సంక్షోభమే అన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవల్సిన సమయమాసన్నమయింది. ఈ విషయంలో ఇంకెటువంటి జాప్యం కూడదు. అది వ్యక్తులు, సమాజాలు, యావత్ మానవాళికి ఒక జీవన్మరణ సమస్య అని చెప్పడంలో ఎటువంటి అతి శయోక్తి లేదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)



మానవ ఆరోగ్యం గురించిన సంప్రదాయక అవగాహనలో మౌలిక మార్పు తెచ్చిన భావనే ప్లానేటరీ హెల్త్. ప్రాకృతిక వ్యవస్థల భద్రతకు ప్రాధాన్యమిచ్చే ఈ భావన ప్రజారోగ్య భావన కంటే విశాలమైనది. పర్యావరణ సమతౌల్యతను కాపాడుకున్నప్పుడే ధరిత్రికి శ్రేయస్సు, మానవాళికి ఆరోగ్య సంక్షేమం సమకూరుతాయి.

వాక్ స్వాతంత్ర్యానికి ప్రాణం వచ్చింది!

గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూగబోయిన గొంతులు, మీడియాకు కొత్త ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రాణం వచ్చింది. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మీడియా మీద, సామాజిక మాధ్యమాల మీద విపరీతంగా ఆంక్షలు పెట్టారు. ఎవరైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా అనవసరంగా కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, జైళ్లలో పెట్టడం చేశారు. పోలీసు వ్యవస్థను స్వప్రయోజనాలకు ఉపయోగించుకుని, సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకుల వరకు అందరి వాక్ స్వాతంత్ర్యాన్నీ హరించారు. వాక్ స్వాతంత్ర్యం మనకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమూ దీనిని హరించకూడదు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే రకమైన పోకడలు పోయింది. ప్రతిపక్షానికి చెందిన ముఖ్య నాయకులను సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి కేసులు పెట్టి ఇబ్బంది పెట్టింది. ఇలాంటి కక్షపూరిత వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. నిజంగా ఏదైనా తప్పు జరిగి, అందుకు తగిన ఆధారాలు ఉంటే ఎంతటి వారికైనా శిక్ష పడవలసిందే. కానీ దురుద్దేశంతో తప్పుడు కేసులు బనాయించకూడదు. ఇప్పటి ఎన్డీయే ప్రభుత్వానికి గతంలోలా దూకుడుగా వ్యవహరించే అవకాశాలు తక్కువ. ఎందుకంటే సంకీర్ణ పక్షాల నుంచి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా తమిళనాడు తరహాలో కక్ష రాజకీయాలు ఉండకూడదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఇలాంటివి పునరావృతం కారాదు.

–విష్ణు భరద్వాజ్ పి.ఎస్, లండన్, యు.కె.

ఆరోగ్యశ్రీ అనారోగ్యంలో వైద్యవ్యవస్థ

'మేడిపండు చూడు మేలిమై ఉండు, పొట్ట విప్పి చూడు పురుగులుండు' అన్న సామెత ఆరోగ్యశ్రీ పథకానికి సరిగ్గా సరిపోతుంది. పేదలకు మెరుగైన వైద్యం అనే ఉన్నతాశయం మాటున రాజకీయ స్వలాభంతో ఆరంభించిన ఆరోగ్యశ్రీ పథకం మొత్తం వైద్య వ్యవస్థనే దిగజార్చింది. ప్రజలకు విద్య, వైద్యం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ఓట్లు దండుకోడానికి కుహనా రాజకీయవాదులు వల్లించే ఉచిత కార్పొరేట్ విద్య ఉచిత కార్పొరేట్ వైద్యం లాంటి పథకాలు ఖచ్చితంగా గర్హనీయం. పేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు లాంటివి పెట్టడంలో కొంత అర్థం ఉంది. కానీ నచ్చిన హోటల్లో భోజనం చేయమని పేదలకు కార్డులు మంజూరు చేస్తే అది దివాలాకోరు రాజకీయం అవుతుంది. ఇప్పుడు అమలులో ఉన్న ఆరోగ్యశ్రీ పథకం ఈ కోవలోకే వస్తుంది.

చేసే వైద్యం ఒకటే అయినా ప్రభుత్వ రంగంతో పోలిస్తే, ప్రైవేటు రంగంలో హంగులు, ఆర్భాటాలు జోడించడం వల్ల అది పైకి ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ప్రాథమిక సేవలు అందించే నెపంతో ప్రజలను అనవసరపు కార్పొరేట్ ఆకర్షణలతో మభ్యపెట్టి, ప్రభుత్వ ఆదాయాన్ని దుర్వినియోగం చేయటం వారిని మోసగించడమే అవుతుంది. ఒక పక్క 'ఆసరా' అంటూ అడక్కపోయినా డిశ్చార్జి లోపే పేషెంట్ల అకౌంట్లలో డబ్బులు వేసి వారిని ప్రలోభపెట్టడం, మరోవైపు సేవలు అందించిన ఆసుపత్రులకు మాత్రం బిల్లులు చెల్లించకుండా ఇదిగో... అదిగో అంటూ అబద్ధాలు చెబుతూ తప్పించుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్యాకేజీ రేట్లు పెంచకుండా నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం... ఆరోగ్యశ్రీ పథకం మాటున ఓట్లు దండుకునే స్వార్థ పాలకుల కుటిలనీతిని చెప్పకనే చెబుతుంది.

పాలకులు ఆర్భాటంగా చెప్పుకునే 'ఆరోగ్యశ్రీ' తరచి చూస్తే అంతా లోపభూయిష్టమే. చాలా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ రోగుల పరిస్థితి ద్వితీయ శ్రేణి పౌరుల కన్నా దారుణంగా ఉంటుంది. పాలకులు ఇచ్చే అరకొర ప్యాకేజీలు తమకు గిట్టుబాటు కాక దాదాపు అన్ని కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్ నుంచి తప్పుకున్నాయి. చిన్న, మధ్య తరగతి ఆసుపత్రులు మాత్రమే తప్పక ఎంపానెల్ అవుతున్నాయి. అక్కడ కూడా ఆరోగ్యశ్రీ పేషెంట్స్‌ని చూసేది ఎంబీబీస్ డాక్టర్లే కానీ స్పెషలిస్టులు కాదు. అలాగే ఎక్కువ శాతం ఆపరేషన్లు చేసేది అనుభవజ్ఞులైన వైద్యులు కాదు. వాడే మందులు, పరికరాల నాణ్యత కూడా ప్రశ్నార్థకమే. కార్పొరేట్ హాస్పిటల్లో సిజేరియన్‌కి లక్ష రూపాయలు బిల్లు అవుతుంటే.. ప్రభుత్వం వారిచ్చే పదీ పదిహేను వేలకు ఇంతకంటే మంచి సేవలు ఊహించుకోవటం అత్యాశే అవుతుంది.

ఆరోగ్యశ్రీ పథకం ప్రైవేటు ఆసుపత్రుల మధ్య అనవసరమైన పోటీ తెచ్చి వారిని పీకల్లోతు అప్పుల్లోకి దింపింది. సమాజంలో దాదాపు అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చిన నేపథ్యంలో ఆరోగ్యశ్రీ లేకుండా ఆసుపత్రుల మనుగడ కష్టమైంది. దాంతో తలకు మించిన భారం అయినా అన్ని ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ఎంపానెల్‌మెంట్ కోసం పడకల సంఖ్య, సౌకర్యాలు పెంచుకున్నాయి. ఇంకా, అలవికాని నిబంధనల నేపథ్యంలో రకరకాల లైసెన్సుల కోసం భారీగా ముడుపులు ముట్టజెప్పాల్సిన పరిస్థితి. ఒక పక్క పెరిగిన నిర్వహణ ఖర్చు, అధికారిక, అనధికారిక ఫీజులు; మరో పక్క అరకొర ప్యాకేజీలు, అవి కూడా సకాలంలో రాని పరిస్థితి. కాబట్టి ఆస్పత్రి యాజమాన్యాలు నిజాయితీగా ఉందామన్నా ఉండలేని స్థితి. ఆరోగ్యశ్రీ వదిలేసి ప్రాక్టీస్ చేద్దామంటే ఓట్ల కోసం నాయకులు విచ్చలవిడిగా కార్డులు మంజూరు చేయిస్తున్నారు. ఆ కరుణా హృదయుల అనుగ్రహంతో అనేక మంది రోగులు కారులో వచ్చి, డీలక్స్ రూము తీసుకుని, ఆపరేషన్ మాత్రం ఆరోగ్యశ్రీ కింద చేయించుకుని వెళ్తున్నారు. పేదవారి పరిస్థితి షరా మామూలే.

ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా ఆరోగ్యశ్రీ వర్తించడం మరో ప్రహసనం. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యసేవలు ఎప్పుడూ ఉచితమే. వీటిలో ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయడం వల్ల పేదలకు ఏం మేలు జరుగుతుందో పాలకులకే తెలియాలి. ఆరోగ్యశ్రీ కింద సేవలు అందించడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు కొంత అదనపు ఆదాయం వస్తే రావచ్చు. కానీ ఆరోగ్యశ్రీ సిబ్బంది జీతభత్యాల రూపంలో ప్రభుత్వానికి అనవసరపు వ్యయం కూడా పెరుగుతుంది. తరువాత ఒకే గొడుగు కింద చెయ్యాల్సిన సేవలను ఆరోగ్యశ్రీ, నాన్ ఆరోగ్యశ్రీ అని విభజన చేయడం వల్ల సాఫీగా జరిగిపోయే పనిలో లేనిపోని గందరగోళం, ఆటంకం ఏర్పడుతుంది.

పేదల ఆరోగ్యం మీద నిజంగా మనస్సు ఉన్న పాలకులు చేయాల్సింది ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుని మెరుగుపరచి ప్రజల్లో వాటిపట్ల నమ్మకం కల్పించడం. ఆరోగ్యశ్రీ పేరు మీద ఖర్చు చేస్తున్న నిధులను గవర్నమెంట్ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి వినియోగిస్తే ఈ పథకం కింద ఇప్పుడు ప్రైవేటు ఆసుపత్రులు ఇచ్చే సేవ కంటే మెరుగైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందించవచ్చు. నిజానికి పాలకులు తాయిలాలు పంచడం మీద పెట్టే దృష్టిలో ఒక్క శాతం ప్రజారోగ్యం మీద పెడితే ప్రభుత్వ ఆసుపత్రులను ప్రపంచస్థాయి ఆసుపత్రులుగా తీర్చిదిద్దవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రమాణాలు పెరగాలంటే ముందు బడ్జెట్ కేటాయింపులు తగిన స్థాయిలో జరగాలి. తరువాత మంచి ప్రతిభ, పేరు, సేవాతత్పరత ఉన్న వైద్యులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రులకు సీఈఓలుగా, సలహాదారులుగా నియమించాలి. చాలామంది వైద్యులకు ప్రభుత్వ సర్వీసు మీద ఆసక్తి ఉన్నా, ప్రభుత్వ వ్యవస్థలోని మితిమీరిన బ్యూరోక్రసీ వల్ల, మూస ధోరణులు, కాలం చెల్లిన విధానాల వల్ల ప్రభుత్వ సర్వీసులు అంటే విముఖత చూపిస్తున్నారు. బ్యూరోక్రసీ తగ్గించి, ఫ్లెక్సిబిలిటీ పెంచితే ప్రతిభావంతులు, సేవాతత్పరత ఉన్న వైద్యులు ఖచ్చితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపుతారు. తరువాత పార్ట్ టైం సర్వీస్, వాలంటరీ సేవలకు అవకాశం కల్పించి ప్రతిభావంతులైన ప్రైవేట్ వైద్యుల సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా వినియోగించుకోవచ్చు. తద్వారా పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించవచ్చు.

వైద్య వ్యవస్థను ప్రక్షాళన గావించటానికి పాలకులు చేయవలసిన మరో ముఖ్యమైన పని ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఆస్పత్రులకు పరిమితం చేయడం. అనేక ప్రైవేట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రుల్లో మంచిగా సౌకర్యాలు, నిపుణులు ఉండి కూడా పేషెంట్స్ లేకపోవడంతో వైద్య విద్యార్థులకు తగిన శిక్షణ ఉండడం లేదు. ఆరోగ్యశ్రీని మెడికల్ కాలేజీలకు పరిమితం చేస్తే, పేదలకు మెరుగైన వైద్యం లభించడంతో పాటు ఎంబీబీస్ విద్యార్థులకు, అలాగే పీజీలకు కూడా మంచి శిక్షణ లభిస్తుంది. మిగతా ప్రైవేట్ ఆస్పత్రులతో పోలిస్తే మెడికల్ కాలేజీ ఆస్పత్రులు... అనుభవజ్ఞుల పర్యవేక్షణలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందిస్తాయి.

చిన్న చిన్న నర్సింగ్ హోమ్స్, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులు యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ గుదిబండ నుంచి విముక్తి పొందుతాయి. అనవసర లైసెన్సుల బెడద, ముడుపుల భారం లేకుండా వారు ఎప్పటి లాగానే తమ మీద నమ్మకంతో వచ్చిన రోగులకు, హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న వారికి సేవలు అందించగలరు. తద్వారా గవర్నమెంటు ఆసుపత్రుల మీద అధిక భారం పడదు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రక్షాళన చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రపంచ స్థాయి ఆసుపత్రులుగా తీర్చిదిద్ది, మంచి ప్రమాణాలు, విలువలతో కూడిన వైద్యవ్యవస్థకు బాటలు వేయాలి.

● డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు

పేదల ఆరోగ్యం మీద నిజంగా శ్రద్ధ ఉన్న పాలకులు చేయాల్సింది ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుని మెరుగుపరచి ప్రజల్లో వాటిపట్ల నమ్మకం కల్పించడం. ఆరోగ్యశ్రీ పేరు మీద ఖర్చు చేస్తున్న నిధులను ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి వినియోగిస్తే ఈ పథకం కింద ఇప్పుడు ప్రైవేటు ఆసుపత్రులు ఇచ్చే సేవ కంటే మెరుగైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందించవచ్చు.





ఆందోళన

అజిత్‌సింగ్‌నగర్ మదర్సాలో అనుమానాస్పదంగా మృతిచెందిన కరిష్మా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు గురువారం నగరంలోని సీపీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.

ఢిల్లీలో చర్చల అనంతరం కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం చంద్రబాబు, ఎంపీ కేశినేని చిన్ని, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీల మాటామంతీ..



తూర్పు బైపాస్

కేంద్రమంత్రి గడ్కరీ గ్రీన్‌సిగ్నల్.. త్వరలో టెండర్లు

ఇన్నాళ్లూ వైసీపీ తొక్కిపెట్టిన కీలక ప్రాజెక్టులన్నింటికీ వరుసగా మోక్షం లభిస్తోంది. సీఎం చంద్రబాబు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో జిల్లాకు వరాలజల్లు కురిసింది. తూర్పు బైపాస్ రోడ్డుకు లైన్‌క్లియర్ కావడంతో పాటు వెస్ట్ బైపాస్‌ను త్వరగా పూర్తిచేసేలా, విజయవాడ నగరంలో అతిపెద్ద ఫ్లై ఓవర్‌కు, అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి అనుమతి లభించింది. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం చంద్రబాబు, ఎంపీ కేశినేని చిన్ని జరిపిన చర్చలు సత్ఫలితాలనిచ్చాయి.

ఆరు నెలల్లో వెస్ట్ బైపాస్ పూర్తి

గడ్కరీతో జరిగిన చర్చల్లో విజయవాడ వెస్ట్ బైపాస్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. దాదాపు 90 శాతం పనులు పూర్తయినా హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా అసంపూర్తిగా ఉంది. ఇవన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావటానికి ఆరు నెలల సమయం పడుతుందని గడ్కరీ చెప్పారు. డిసెంబరులో ప్రారంభోత్సవం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అతిపెద్ద ఫ్లైఓవర్‌కు ఓకే

విజయవాడ నగరంలో అతిపెద్ద ఫ్లై ఓవర్‌కు మార్గం సుగమమైంది. 16వ నెంబర్ జాతీయ రహదారిపై మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు 6.50 కిలోమీటర్ల పొడవైన ఆరు వరసల ఫ్లై ఓవర్‌కు డీపీఆర్ సిద్ధమైన దశలో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ప్రాజెక్టు అవసరం గురించి విజయవాడ ఎంపీ వివరించటంతో మార్గం సుగమమైంది. డీపీఆర్ దాదాపు పూర్తికావటం వల్ల త్వరలోనే ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

అమరావతి అవుటర్‌కు గ్రీన్‌సిగ్నల్

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టుకు కూడా కేంద్రమంత్రి గడ్కరీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధానమైన జాతీయ రహదారులన్నింటినీ అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానమయ్యేలా ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టు ఐదేళ్లుగా మూలనపడింది. టీడీపీ ప్రభుత్వం తిరిగి రావటంతో ఈ ప్రాజెక్టుకు కదలిక వచ్చింది.

కేంద్రమంత్రితో చంద్రబాబు, ఎంపీ కేశినేని చిన్ని భేటీ

- ప్రాజెక్టుల అవసరం గురించి సుదీర్ఘ వివరణ
- అన్నింటికీ సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి
- వెస్ట్ బైపాస్ ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ
- నిడమానూరు ఫ్లై ఓవర్‌కు కూడా ఓకే..
- అమరావతి రింగ్‌రోడ్డు సాకారానికి సానుకూలత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : డీపీఆర్ పూర్తయిన విజయవాడ తూర్పు బైపాస్ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను గత వైసీపీ ప్రభుత్వం తమ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రయోజనకరంగా ఉండేలా మార్చింది. విజయవాడ తూర్పు బైపాస్ అనేది ప్రస్తుతం చిన్న అవుటపల్లి దగ్గర వెస్ట్ బైపాస్‌తో అనుసంధానిస్తూ నిర్మించాల్సి ఉండగా, దీనిని పొట్టిపాడు వరకు పొడిగించారు. మాజీమంత్రికి చెందిన లే అవుట్ల వెంబడి వెళ్లేలా చేయటం కోసమే ఇలా చేశారని తెలుస్తోంది. ఈ అలైన్‌మెంట్‌పై పలు విమర్శలొచ్చాయి. తూర్పు బైపాస్ డీపీఆర్ పూర్తయిన దశలో కేంద్రం లాజిస్టిక్ పార్కుకు భూములు ఇవ్వాల్సిందిగా కోరింది. లాజిస్టిక్ పార్క్ అనేది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు కావటంతో వైసీపీ ప్రభుత్వం సహకరించలేదు. దీంతో కేంద్రం ఈ ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టింది. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. ప్రస్తుతం విజయవాడ తూర్పు బైపాస్ అంశాన్ని ఎంపీ కేశినేని చిన్ని తెరపైకి తెచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. స్పందించిన చంద్రబాబు కచ్చితంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ఈ ప్రాజెక్టుపై చర్చ జరగడం, గడ్కరీ అంగీకరించడం జరిగిపోయాయి. త్వరలోనే తూర్పు బైపాస్‌కు టెండర్లు పిలిచేందుకు ఆయన ఆమోదం కూడా తెలిపారు. అయితే, చిన్న అవుటపల్లి నుంచి నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్చాల్సిన అవసరం ఉంది. ఈ అంశాన్ని జాతీయ రహదారుల సంస్థ దృష్టికి తీసుకురావాలి. అలాగే, కృష్ణానదిలో మూడు కిలోమీటర్ల మేర బ్రిడ్జిని కూడా నిర్మించాలి. ఈ రోడ్డు కాజా వద్ద ఎన్‌హెచ్-16కు కలుస్తుంది.

చెన్నుపాటి గాంధీపై హత్యాయత్నం కేసు

రీ ఓపెన్

- వైసీపీ నేత వల్లూరు ఈశ్వరప్రసాద్ అరెస్టు
- 2022లో ఘటన.. కన్ను కోల్పోయిన గాంధీ
- కేసులో ఏ5గా ఈశ్వరప్రసాద్
- తాజాగా ఐపీసీ 307 చేర్చి అరెస్టు చేసిన పోలీసులు
- దేవినేని అవినాష్‌కు ముఖ్య అనుచరుడు



దాడి సమయంలో గాంధీని పరామర్శిస్తున్న చంద్రబాబు (ఫైల్)

విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీపై జరిగిన దాడి కేసును పోలీసులు బయటకు తీశారు. ఈ కేసులో ఆది నుంచి ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టు నుంచి తప్పించుకున్న వైసీపీ నేత వల్లూరు ఈశ్వరప్రసాద్‌ను పటమట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ప్రస్తుతం ఉన్న సెక్షన్లకు అదనంగా ఐపీసీ 307 సెక్షన్‌ను చేర్చారు.

ముందస్తు ప్రణాళికతోనే దాడి

2022, సెప్టెంబరు 4న పటమటలంకలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను చెన్నుపాటి గాంధీ పరిశీలించడానికి వెళ్లారు. ఈ డివిజన్‌కు గాంధీ కార్పొరేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య క్రాంతిశ్రీ కార్పొరేటర్‌గా ఉన్నారు. ఇదే డివిజన్‌కు వల్లూరు ఈశ్వరప్రసాద్, గద్దె కల్యాణ్ వైసీపీ నాయకులుగా ఉన్నారు. వారిలో కల్యాణ్ వైసీపీ 9వ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్నాడు. ఈ ఇద్దరూ వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు ముఖ్య అనుచరులు. గాంధీ డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సమయంలో గద్దె కల్యాణ్, మరో ముగ్గురు యువకులతో అక్కడికి చేరుకున్నాడు. ఆయనతో ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగాడు.

మిగతా 6వ పేజీలో...

మరో ఏడాది..!

తప్పని రైళ్ల రద్దు.. ప్రయాణికులకు ఇక్కట్లు

'దయచేసి వినండి.. మీకు అత్యవసర ప్రయాణాలుంటే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోండి.. ఎందుకంటే మరో ఏడాది పాటు భారీగా రైళ్లు రద్దవుతూనే ఉంటాయి. ఎప్పుడు ఏ రైలు రద్దవుతుందో తెలియని పరిస్థితి. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నా సరే.. ఏ క్షణంలో ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు.' ఆటోమేటిక్ సిగ్నలింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ పనుల పేరిట ఇప్పటికే చాలా రైళ్లను రద్దు చేసిన అధికారులు ఇదే పరిస్థితి మార్చి వరకూ ఉంటుందని చెబుతున్నారు. వందేభారత్ రైళ్లకు మాత్రం ఈ రద్దులో మినహాయింపు ఇవ్వడం కొసమెరుపు.

- విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో పనుల వల్లే..
- ఇప్పటికే భారీగా రైళ్లను రద్దు చేసిన అధికారులు
- వచ్చే మార్చి వరకూ తప్పదని వెల్లడి
- వాస్తవానికి అంత అవసరం లేదు..!
- అయినా ఇష్టానుసారంగా రద్దు నిర్ణయాలు
- వందేభారత్ రైళ్లకు మాత్రం మినహాయింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో ఆటోమేటిక్ సిగ్నలింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ పనులు వచ్చే ఏడాది అంటే.. 2025-మార్చి వరకు జరుగుతాయి. ఇది రైల్వే అధికారుల ప్రాథమిక అంచనా మాత్రమే. ఈ సమయం మరింత పెరిగే అవకాశం ఉందే తప్ప, తగ్గే అవకాశమైతే లేదు. కాబట్టి అత్యవసర ప్రయాణాలు చేసేవారు రైళ్లను నమ్ముకుంటే ఇబ్బందుల్లో పడతారు. విజయవాడ-దువ్వాడ సెక్షన్ మొత్తం 330 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో ఆటోమేటిక్ సిగ్నలింగ్, ట్రాక్ మెయింటెనెన్స్ పనులను రైల్వే అధికారులు ప్రారంభించారు. కానీ, ఈ పనులు చేయడానికి భారీ సంఖ్యలో రైళ్లను రద్దు చేయాల్సిన అవసరం లేదు. ఇక ఈ రైళ్ల రద్దులో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.

ఏడాది పాటు ఆటోమేటిక్ సిగ్నలింగ్ పనులు

విజయవాడ-దువ్వాడ సెక్షన్‌లో మనుషులతో సంబంధం లేకుండా ఆటోమేటిక్ సిగ్నలింగ్ విధానాన్ని అభివృద్ధి చేయాలని రైల్వే నిర్ణయించింది. మొత్తం 330 కిలోమీటర్లలో ఆరు నెలలుగా 55 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ సిగ్నలింగ్ పనులు చేపట్టారు. మిగిలిన 275 కిలోమీటర్లలో పనులు చేపట్టాలంటే కనీసం వచ్చే మార్చి వరకూ సమయం పడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఆటోమేటిక్ సిగ్నలింగ్ వల్ల ఈ సెక్షన్‌లో మరింత వేగంగా, సమర్థవంతంగా, భారీ సంఖ్యలో రైళ్లను నిరంతరాయంగా నడపవచ్చంటున్నారు.

అసంపూర్తిగా మెయింటెనెన్స్ పనులు

విజయవాడ-విశాఖపట్నం సెక్షన్‌లో మెయింటెనెన్స్ పనులు ఎప్పటినుంచో జరుగుతున్నాయి. పలుచోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. విజయవాడ-నిడదవోలు మధ్య 4.98 కిలోమీటర్లు, నిడదవోలు-సామర్లకోట 4.10 కిలోమీటర్లు, సామర్లకోట-దువ్వాడ 5.52 కిలోమీటర్ల మేర మొత్తం 14.61 కిలోమీటర్ల మేర పూర్తి చేయాల్సి ఉంది. ట్రాక్ మెయింటెనెన్స్ పనుల్లో కొంత పురోగతి ఉంది. నిడదవోలు-సామర్లకోట 39.61 కిలోమీటర్లు, సామర్లకోట-దువ్వాడ 27.40 కిలోమీటర్లు వెరసి 67.02 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశారు. అలాగే, ఇదే సెక్షన్‌లో డీప్ స్క్రీనింగ్ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. విజయవాడ-నిడదవోలు 11.05 కిలోమీటర్లు, నిడదవోలు-సామర్లకోట 27.87 కిలోమీటర్లు, సామర్లకోట-దువ్వాడ 42.51 కిలోమీటర్ల మేర మొత్తంగా 81.89 కిలోమీటర్ల మేర చేపట్టాల్సి ఉంది.

విజయవాడ-గూడూరు మూడోలైన్ కమిషన్ పనులు

విజయవాడ డివిజన్ పరిధిలో బెజవాడ-గూడూరు మూడోలైన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా 85 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ కారణంగా గూడూరు వైపు వెళ్లే రైళ్లను కూడా రద్దు చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టుకు విజయవాడ-రాయనపాడు మధ్య థర్డ్‌లైన్ కమిషన్ పనులు పూర్తవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

విజయదుందుభి

- 2023-24లో 12 కోట్ల లీటర్ల పాలసేకరణ
- ఐదేళ్లలో మూడు రెట్లు పెరిగిన లాభాలు
- ఓవైపు అమూల్.. మరోవైపు వైసీపీ
- ప్రతికూలతలను అధిగమించి ముందుకు...



చలసాని ఆంజనేయులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతిపెద్ద కో-ఆపరేటివ్ యూనియన్‌గా ఉన్న కృష్ణా మిల్క్ యూనియన్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు 12 కోట్ల లీటర్ల పాలసేకరణతో రికార్డు నెలకొల్పింది. యూనియన్ ఆవిర్భవించాక ఈ స్థాయిలో పాల సేకరణ జరగడం ఇదే ప్రథమం. గడిచిన ఐదేళ్లుగా ఎన్ని ప్రతికూల పరిస్థితులు నెలకొన్నా, వాటన్నింటినీ అధిగమించి విజయ డెయిరీ ఈ రికార్డును నెలకొల్పడం విశేషం. ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ సర్కార్ రాష్ట్రంలో సహకార రంగాన్ని ప్రోత్సహించాల్సింది పోయి అమూల్ వంటి ఇతర రాష్ట్ర సంస్థలను దిగుమతి చేసుకుంది. వాటిని ప్రోత్సహిస్తూ స్థానిక సహకార సంస్థలపై కత్తి పెట్టింది. మరోవైపు దిగ్విజయంగా నడుస్తున్న సహకార యూనియన్లపై వైసీపీ నేతలు డేగల్లా తిరుగుతూ వాటిలో చొరబడి కొల్లగొట్టేందుకు చేయని ప్రయత్నం లేదు. వీటన్నింటినీ అధిగమిస్తూ విజయ డెయిరీని లాభాల బాటలో పయనింపజేయడంలో చైర్మన్ చలసాని ఆంజనేయులు కృషి ఎంతో ఉంది. ఆయన చైర్మన్‌గా బాధ్యతలు తీసుకునే నాటికి యూనియన్ టర్నోవర్ రూ.712 కోట్లు. స్థూలలాభం రూ.84 కోట్లు. దాన్ని గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1,196 కోట్లు, రూ.212 కోట్లకు చేర్చారు. ఐదేళ్లలో స్థూల లాభాన్ని మూడు రెట్లకుత తీసుకెళ్లారు. మరోవైపు రైతులకు ఇచ్చే పాలసేకరణ ధరను సైతం రూ.100కు తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నారు. ఆంజనేయులు చైర్మన్‌గా బాధ్యతలు తీసుకునే సమయానికి పాలసేకరణ ధర రూ.56గా ఉండేది. ప్రస్తుతం రూ.90 చెల్లిస్తున్నారు. ఏడాదిలో దీన్ని రూ.100కు చేరుస్తానని ఆంజనేయులు ప్రకటించారు.

న్యాయ పోరాటం!

నున్నలో గర్భిణీ మౌనపోరాటం

- చెప్పకుండా ఎటో వెళ్లిపోయిన భర్త
- పట్టించుకోని అత్తామామ
- నాలుగేళ్ల కొడుకు, నాలుగు నెలల గర్భంతో అత్తింటి ముందు దీక్ష
- నాలుగు రోజులుగా తిండి, నిద్ర లేక..
- సీపీని కలిసినా జరగని న్యాయం



6లో..



లంక భూముల్లో అనధికార బట్టీలు!

వైసీపీ నేతల బరితెగింపు

- అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ
- నిర్వాహకుల్లో వైసీపీ ప్రజాప్రతినిధుల భర్తలు
- బట్టీల వద్ద రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

6లో..


రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నెట్టెం, తాతయ్య

కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి

» రంగా జయంతిలో నెట్టెం, తాతయ్య హామీ

జగ్గయ్యపేట, జూలై 4 : జగ్గయ్యపేటలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తామని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలో కాపు వారధి టీం, అఖిల భారత కాపు సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన వంగవీటి మోహన రంగా జయంతిలో వారు పాల్గొన్నారు. రంగా అన్ని వర్గాలకు తన విధానాలతో దగ్గరైన నేతగా కొనియాడరు. కాపుల కోసం పట్టణంలో కమ్యూనిటి హాలు నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. మాజీ మునిసిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం చిన బాబు, యలమంచిలి రాఘవ, వేదులాపురి సైదా, కన్నెబోయిన రామలక్ష్మి, డి.లక్ష్మణ రావు, మీసాల చిట్టిబాబు, బాబ్జీనాయుడు, జనసేన నేత ఈమని కిశోర్, పలువురు టీడీపీ కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ, కాపు నేతలు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం, ధైర్యం అందరికీ ఆదర్శం

» కృష్ణాజిల్లా కలెక్టర్, ఎస్పీ


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , జూలై 4 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు, త్యాగం అందరికీ ఆదర్శమని కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మన్యం వీరుడు అల్లూరి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కలెక్టర్ బాలాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి పద్మ, జడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షాహిద్ బాబు, సివిల్ సప్లయిస్ జనరల్ మేనేజరు తోట సతీష్, దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి గురువారం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్బీ ఇనస్పెక్టర్ రంగనాథ్, ఆర్ఐలు కృష్ణంరాజు, సతీష్, ఏవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

వన్‌టౌన్, జూలై 4 : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో కార్యకలపాలు జరగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యకలపాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారుల నివేదికలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య సరైన విధానంలో కొనసాగాలని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య విద్యార్థి భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్వవిద్య అందించాలన్నారు. మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందజేయాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఇందుకోసం ఇంటర్నల్ కంప్లైయింట్ కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్, పిల్లల హోమ్‌లు తదితరాలపై ఆమె సమీక్షించి తగు సూచనలు చేశారు. ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీసీపీవో రాజేశ్వరరావు తదితరులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబాల సంతోషమే లక్ష్యం

» కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని


చలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 4 : రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా లక్షలాది పాడిరైతు కుటుంబాల సంతోషమే లక్ష్యం, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ) ఫ్యాక్టరీలో గురువారం చలసాని జన్మదినోత్సవ సందర్భంగా పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. యూనియన్‌లో సభ్యులైన పాడిరైతులకు సేవలందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. లక్ష్యసాధనలో సహకరించిన ప్రతి పాడిరైతుకు కృతజ్ఞతలు తెలిపారు. ఛైర్మన్ ఆంజనేయులును సిబ్బంది గజమాలతో సత్కరించారు.

బెదిరించి నా తల్లిని చంపేశారు

» బేవరేజెస్ గోడౌన్ కాంట్రాక్టులో అవినీతి బాగోతం
» నిబంధనలు తుంగలో తొక్కి గోడౌన్ కాంట్రాక్ట్ కట్టబెట్టారు
» ఎండీ వాసుదేవరెడ్డి, కొడాలి, అప్పటి జేసీ మాధవీలత రెడ్డి బాధ్యులు
» పూర్తి ఆధారాలతో సిట్‌కు అందజేశా
» బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ కాంట్రాక్టర్ దుగ్గిరాల ప్రభాకర్ వెల్లడి



గుడివాడ : బేవరేజెస్ గోడౌన్ కాంట్రాక్టు విషయంలో తన తల్లి సీతామహాలక్ష్మిని వైసీపీ ప్రభుత్వంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, అతని అనుచరులు బెదిరించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, దీంతో ఆమె మనస్తాపంతో మృతి చెందారని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ కాంట్రాక్టర్ దుగ్గిరాల ప్రభాకర్ ఆరోపించారు. గుడివాడ ఆటోనగర్‌లో గురువారం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. బేవరేజెస్ గోడౌన్ విషయంలో అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, నాటి జేసీ మాధవిలతారెడ్డి చేసిన అవినీతిపై సిట్‌కు ఫిర్యాదు చేశానన్నారు. బహిరంగ టెండర్ ద్వారా చదరపు అడుగు కేవలం రూ.4లకు బేవరేజెస్ గోడౌన్ కాంట్రాక్టును తన తల్లి దక్కించుకున్నారన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టు కాలపరిమితి కాకుండానే గోడౌన్‌ను అక్రమంగా తరలించారన్నారు. పద్మారెడ్డి అనే వ్యక్తికి లబ్ధి చేకూర్చేందుకు వాసుదేవరెడ్డి ప్రయత్నించారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే వాసుదేవరెడ్డి తన తల్లిని, తనను తీవ్రంగా దుర్భ లాషలాడారన్నారు. అప్పట్లో ఎమ్మెల్యే కొడాలి నాని, అతని అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ తనను ఫోన్‌లో బెదిరించారన్నారు. తనను, తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఎమ్మెల్యే నాని గడ్డం గ్యాంగ్‌తో గోడౌన్‌లోని లిక్కర్ కేసులను పగులకొట్టి తగులబెట్టారని ఆరోపించారు. నందిపాటి పద్మారెడ్డికి చెందిన నందివాడ మండలం జొన్నపాడులోని శ్రీవంశీరామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు గోడౌన్ కాంట్రాక్టును దక్కేలా చేశారన్నారు. పద్మారెడ్డికి బేవరేజెస్ కార్పొరేషన్ ప్రతినెలా రూ.1.20 లక్షలు అదనంగా చెల్లించిందన్నారు. మొత్తం వ్యవహారంలో పద్మారెడ్డితో పాటు అతని అల్లుడు ఐఆర్ఎస్ కత్రి రామ్‌గోపాల్‌రెడ్డి కూడా భాగస్వామ్యుడని, కార్పొరేషన్ సొమ్మును ఇష్టానుసారంగా దోచేశారన్నారు. లక్షలాది రూపాయల కుంభకోణాన్ని పూర్తి ఆధారాలతో సిట్‌కు అందజేశానని దుగ్గిరాల ప్రభాకర్ వివరించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విస్సన్నపేట, జూలై 4 : పట్టణానికి చెందిన యువకుడు కొమ్మూరి షణ్ముక శ్రీసాయి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2024లో స్థానం సంపాదించినట్టు అతడి తండ్రి త్రినాథ్ తెలిపారు. సైబర్‌సెక్యూరిటీ, పెన్ టెస్టింగ్ పరిశోధన, భద్రతా లోపాలను గుర్తించే విషయంలో వెబ్‌సైట్స్ మొబైల్ అప్లికేషన్స్ (ఏపీఐ), వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ సైబర్ దాడులు జరగకుండా ముందుగా గుర్తించి వాటి పరిష్కారాలను తెలియజేసినందుకుగాను ఈ అవార్డు లభించినట్టు ఆయన తెలిపారు. నాసా, కొలంబియా ప్రెసిడెంట్ ఏజెన్సీ, నేషనల్ పార్క్ ఏజెన్సీ తదితర అంతర్జాతీయ సంస్థలను సైబర్ దాడుల నుంచి, హ్యాకర్ల నుంచి రక్షించినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సైబర్ రీ సెర్చింగ్ సమ్మిట్‌కు షణ్ముక సాయికి ఆహ్వానం అందిందన్నారు.

పటిష్ఠంగా ఉచిత ఇసుక



» ఎనిమిది స్టాక్ పాయింట్లలో 3,69,588 క్యూబిక్ మీటర్ల నిల్వలు
» తవ్వకం, రవాణా, లోడింగ్, సీనరేజ్ ఫీజు నామమాత్రపు వసూలు
» రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపుల అభివృద్ధికి వినియోగం
» డీఎల్ఎస్‌సీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 4 : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం జరిగింది. జిల్లాలోని వివిధ ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వలు, ఉచిత విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రాష్ట్రప్రభుత్వం ఈనెల 8వ తేదీ సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినందున, ఈ మేరకు జిల్లాస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించి, ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 12 ఇసుక నిల్వ కేంద్రాలకు సంబంధించి ఎనిమిది కేంద్రాల్లో 3,69,588 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక అందుబాటులో వుందని తెలిపారు. ఇసుక తవ్వకం, లోడింగ్, రవాణా ఖర్చు, సీనరేజ్ ఫీజు మాత్రమే నామమాత్రంగా వినియోగదారుల నుంచి వసూలు చేయడం జరుగుతుందని, ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని, నేరుగా జిల్లా, మండల పరిషత్‌లు, పంచాయతీలకు వెళుతుందన్నారు. ఈ మొత్తాన్ని రీచ్ ప్రాంత రహదారులు, ర్యాంపులు తదితరాల అభివృద్ధికి వినియోగించడం జరుగుతుందన్నారు. ఇసుక నిల్వ కేంద్రాల వద్ద నామమాత్రపు రుసుం వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని మైన్స్ అండ్ జియాలజీ, రెవెన్యూ, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులు పటిష్ఠ అమలుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఇసుక కొరతలేకుండా చూసేందుకు పూడిక రూపంలో వున్న ఇసుక పాయింట్లను కూడా గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరక్టర్ జి.వెంకటేశ్వర్లు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డీవీ రమణ, డీపీవో ఎన్వీ శివప్రసాద్ యాదవ్, గ్రౌండ్ వాటర్ డీడీ బి.నాగరాజు, డీటీసీ ఎం.పురేంద్ర, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

వివిధ స్టాక్ పాయింట్లలో అందుబాటులో వున్న ఇసుక (క్యూబిక్ మీటర్లు)

పెండ్యాల (కంచికచర్ల మండలం)	19,781
మాగల్లు (నందిగామ మండలం)	36,366
కొడవటికల్లు (చందర్లపాడు మండలం)	9,713
అల్లూరుపాడు (వత్సవాయి మండలం)	3,040
అనుమంచిపల్లి (జగ్గయ్యపేట మండలం)	56,820
పోలంపల్లి (వత్సవాయి మండలం)	922
కీసర (కంచికచర్ల మండలం)	1,49,703
మొగులూరు (కంచికచర్ల మండలం)	93,243

ప్రజల కోసం జరిగిన ఎన్నికలు

» వంగవీటి రాధా

గవర్నర్‌పేట : రాష్ట్రంలో గత సార్వత్రిక ఎన్నికలు ప్రజల కోసం జరిగాయని, అందుకే ప్రజలే గెలిచారని మాజీ ఎమ్మెల్యే రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. వంగవీటి మోహన రంగా 77వ జయంతిని పురస్కరించుకుని ఎంజీ రోడ్డులోని రంగా విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. రంగా కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం రాధా మాట్లాడుతూ, సామాన్యుడికి న్యాయం జరగాలన్నదే తన తండ్రి ఆశయమని అన్నారు. రంగా ఆశయ సాధన కోసం అందరూ కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రజల్ని ప్రభుత్వాలు, పాలకులు విస్మరిస్తే ఏమి జరుగుతుందో గత ఎన్నికల ఫలితాలు నిరూపించాయన్నారు.

దుర్గగుడిలో రికార్డుల పరిశీలన

» ఆలయంలో బంగారు, వెండి ఆభరణాల వివరాలపై జేఈవో ఆరా

వన్‌టౌన్, జూలై 4 : రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు దేవదాయశాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్(జేఈవో) దుర్గాభవాని గురువారం సాయంత్రం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని బంగారు, వెండి ఆభరణాల రికార్డులను పరిశీలించారు. ఇటీవల సంబంధిత విభాగం అధికారిణి దేవస్థానంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచిన బంగారు ఆభరణాల వివరాలు నమోదు చేసిన రికార్డు ప్రకారం కొంతమేరకు తగ్గిందని దేవస్థాన ఈవో కేఎస్ రామారావుకు లిఖితపూర్వకంగా లేఖ అందజేశారు. అయితే ఆ రోజు హుండీలలోని కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఈవో ఉండటం ద్వారా ఆ అధికారిణికి, ఈవోకు మధ్య కొద్దిపాటి వాగ్వివాదం జరిగింది. దీంతో ఆ అధికారిణి నేరుగా దేవదాయశాఖ కమిషనర్‌తో పాటు సంబంధిత ముఖ్య అధికారులకు మెయిల్ ద్వారా బంగారు ఆభరణాలు తగ్గిన అంశాన్ని తెలియజేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కమిషనర్ దుర్గగుడిలో బంగారు, వెండి ఆభరణాల రికార్డులను పరిశీలించాలని జేఈవోను ఆదేశించారు. దీంతో జేఈవో దుర్గాభవాని ఆలయానికి విచ్చేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. శుక్రవారం కూడా రికార్డులను పరిశీలించనున్నట్టు ఈవో తెలిపారు.

న్యాయ పోరాటం!

» అత్తింటి ముందు నాలుగు రోజులుగా తిండీ, నిద్ర లేక గర్భిణి దీక్ష
» గేటుకు తాళం వేసిన వెళ్లిపోయిన అత్త, మామ
» సీపీకి ఫిర్యాదు చేసినా జరగని న్యాయం


భర్త
అత్తింటి ముందు కొడుకుతో ఉమ దీక్ష

విజయవాడ రూరల్, జూలై 4 : జీవితాంతం తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త పెళ్లయిన ఐదేళ్లకే వదిలించుకుని ఎటో వెళ్లిపోయాడు. పుట్టింటికి వెళదామంటే అక్కడ ఒంటరిగా ఉంటూ ఇళ్లల్లో పాచిపని చేసుకునే తల్లి. నాలుగేళ్ల కొడుకు, మరోపక్క నాలుగు నెలల గర్భిణి.. అత్తింటి వారు ఆదుకుంటారనుకుంటే ఇంట్లోకి రానివ్వడం లేదు. పైగా ఇంటి గేటుకు తాళం వేసి మరీ వెళ్లిపోయారు. అయినవారు లేక అత్తింటి వారు రానివ్వక నున్న గ్రామం కుమ్మరి బజార్‌లో గర్భిణి పడుతున్న అవస్థలు చుట్టుపక్కలవారిని కంటతడి పెట్టిస్తున్నాయి.

పెనుగంచిప్రోలుకు చెందిన యనగంటి ఉమకు విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన భార్గవ్‌తో 2019లో వివాహమైంది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. నాలుగేళ్ల క్రితం ఉమ ఓ బాబుకు జన్మనిచ్చింది. భర్త పనీపాట లేకుండా తిరుగుతూ అప్పులు చేస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. కుటుంబ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు పెట్టినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఆరు నెలల క్రితం ఉమ పుట్టింటికి వెళ్లిపోయింది. మళ్లీ పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి ఉమను భర్త సర్వారావుపేటకు కాపురానికి తీసుకెళ్లాడు. అయినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా ఏకంగా నాలుగు నెలల గర్భవతైన ఉమను, కొడుకును జూన్ 18న వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో జూన్ 20న ఇంటి యజమాని చార్జీలకు డబ్బులివ్వగా.. ఆమె నున్న గ్రామంలోని అత్తింటికి వచ్చింది. అక్కడ పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. వాళ్లు మాట్లాడతామన్నారు. ఇంతలో జూన్ 29న అత్తమామలు తమ కుమారుడిని కోడలు ఏదో చేసిందని నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉమ స్టేషన్‌కు వెళ్లి తన గోడును వెళ్లబోసుకుంది. పోలీసులు అత్తమామలను పిలిపించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసుల ఎదుట తలాడించిన అత్తమామలు కోడల్ని స్టేషన్ బయటే వదిలేసి వెళ్లిపోయారు. కొడుకు చేసిన పనికి కోడల్ని ఆదరించాల్సింది పోయి అత్తమామలు ఇంటి గేటుకు కూడా తాళం వేసి వెళ్లిపోయారు.

ఈనెల 1న పోలీసు కమిషనర్ కార్యాలయంలో భర్త అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. నాలుగు రోజులుగా ఆమె అత్తింటి ఎదుట దీక్షకు పూనుకుంది. తిండీ నిద్ర లేకుండా కొడుకుతో రోడ్డుపైనే ఉంటోంది. అయినా భర్త కుటుంబసభ్యులు కనికరం చూపడం లేదు. గర్భవతైన వివాహిత ఏమైపోతుందో అన్న జాలితో స్థానికులు భోజనం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నా అలానే దీక్షను కొనసాగిస్తోంది. ఎండా, వానకు చలించకుండా వివాహిత చేస్తున్న పోరాటం అక్కడి వారిని కలచివేస్తోంది. తనకు తిండి పెట్టాల్సిన అవసరం లేదని ఇంట్లో కాస్త ఆశ్రయం కల్పిస్తే కూలి పనులు చేసుకుని తన కొడుకుతో తలదాచుకుంటానని అంటోంది.

లంక భూముల్లో అనధికార బట్టీలు!

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

» అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ
» నిర్వాహకుల్లో వైసీపీ ప్రజాప్రతినిధుల భర్తలు
» బట్టీల వద్ద రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు
» వెలుగులోకి వస్తున్న అనధికార బాగోతం


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అధికారం, అండదండలు ఉండటంతో వైసీపీ నేతలు కనిపించిన ఏ వనరుని వదల్లేదు. కొండలను కొల్లగొట్టారు. మట్టిని మోసేశారు. ఇసుకను ఇష్టానుసారం తవ్వేశారు. ఐదేళ్లలో చేసిన అకృత్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మూలపాడులో వైసీపీ నేతల అనధికార ఇటుక బట్టీల బాగోతం రెవెన్యూ, భూగర్భ గనులశాఖలోని విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనధికార ఇటుక బట్టీల నిర్వాహణ వెనుక వైసీపీ నేతల పాత్ర ఉన్నట్టు స్పష్టంగా తేలింది.

లెక్కలేనితనం..

మూలపాడు గ్రామంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాన్ని ఆనుకుని లంక భూములు ఉన్నాయి. సాధారణంగా ఇటుక బట్టీలకు రెవెన్యూ, జలవనరుల, భూగర్భ గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి. వైసీపీ అధికారంలో గ్రామానికి చెందిన నేతలు ఈ భూముల్లో రాత్రికి రాత్రి ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా లక్షలాది రూపాయలు వెనుకేసుకున్నారు. విషయం తెలిసినా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. వాస్తవానికి ఇబ్రహీంపట్నం ఇప్పటికే కాలుష్య కోరల్లో కూరుకుపోయింది. వీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నాన్ని కాలుష్యం చుట్టేస్తుండగా వైసీపీ నేతలు దానికి ఆద్యం పోశారు. జిల్లాపరిషత్ వైస్‌చైర్మన్ భర్త గరికపాటి రాంబాబు, మూలపాడు ఎంపీటీసీ భర్త గొట్టిముక్కల పోతురాజు ఇక్కడ ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బట్టీల డొంక కదిలింది. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. భూగర్భ గనుల శాఖలోని విజిలెన్స్ రెవెన్యూ, పోలీసు అధికారులతో విచారణ చేయించారు. గరికపాటి రాంబాబుకు గడచిన నెల 29వ తేదీన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ నోటీసు జారీచేశారు. ఆయన ఈనెల ఒకటో తేదీన నోటీసు తీసుకున్నారు. రెండు రోజుల్లో బట్టీలను ఖాళీచేయాలని నోటీసుల్లో ఆదేశించారు. అయినా లెక్కచేయకుండా యధావిధిగా బట్టీలను నిర్వహిస్తున్నాడు. మొత్తం పది అనధికార బట్టీలు ఉన్నట్టు గుర్తించారు. వాటిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు.

3 లక్షల ఇటుకలు సీజ్

ఇబ్రహీంపట్నం : లంక భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. జెట్టి శ్రీను అనే లంక భూముల సభ్యుడి ఫిర్యాదు మేరకు అధికారులు రంగంలోకి దిగి చర్యలకు పూనుకున్నారు. తమ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తూ ఖాళీ చేయకుండా ఐదేళ్లుగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మైనింగ్, పొల్యూషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ ఇన్స్‌పెక్షన్ నిర్వహించారు. మూలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత జడ్పీ వైస్ ఛైర్ పర్సన్ గరికపాటి శ్రీదేవి భర్త గరికపాటి రాంబాబుకు చెందిన సుమారు 3 లక్షల ఇటుకలను సీజ్ చేసినట్టు ఆర్ఐ వి.గోపి తెలిపారు.

7న గుడివాడలో కృష్ణా జిల్లా అండర్-19 చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు: గుడివాడలోని త్రివేణ స్కూల్లో ఈనెల 7న కృష్ణా జిల్లా అండర్-19 చెస్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఎం.ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన బాలబాలికలను నంద్యాలలో ఈ నెల 18, 19వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల్లోగా ఏపీ చెస్ వైబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9700775220, 9247153387 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

● మహిళకు స్వల్ప గాయాలు

విద్యాధరపురం: గొల్లపూడిలో ఆటో ఢీకొనడంతో యాక్టివాపై వెళుతున్న ఓ వృద్ధుడు (61) మృతి చెందగా అతడి భార్య (55)కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులోని చౌదరిపేటలో ముదునూరి గంగరాజు, సుబ్బలక్ష్మి నివాసం ఉంటున్నారు. కుమార్తెకు వివాహం కాగా ప్రస్తుతం గొల్లపూడిలో ఉంటుంది. గంగరాజు ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గంగరాజు, భార్య సుబ్బలక్ష్మితో కలిసి యాక్టివాపై గొల్లపూడిలోని కుమార్తె వద్దకు గురువారం ఉదయం బయలుదేరారు. వెంకయ్యనగర్ వద్దకు వెళ్లేసరికి వెనుకనుంచి అతివేగంతో వచ్చిన ఆటో యాక్టివాను ఢీకొంది. ఈ ఘటనలో గంగరాజుకు తీవ్ర గాయాలు కాగా అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గంగరాజును చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఆంధ్ర ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి పనుల్లో నాణ్యతా లోపం!


చొటపల్లి నూతన బైపాస్ రోడ్డుపై ధర్నా చేస్తున్న ఐదు గ్రామాల రైతులు


నాణ్యత లేని గ్రావెల్


మందం తక్కువగా ఉన్న పైపులు

» నిబంధనల ఉల్లంఘనపై రైతుల ఆందోళన

గుడివాడ రూరల్, జూలై 4 : గుడివాడ మండలం నుంచి వెళ్లే నూతన జాతీయ రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని 165వ జాతీయ రహదారిపై గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. టీడీపీ నాయకులు అట్లూరి రమణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళి తదితరులు మాట్లాడుతూ.. చొటపల్లి, సిద్ధాంతం అడ్డరోడ్డు వద్ద నూతనంగా నిర్మించనున్న జాతీయ రహదారి వెంట పొలాల మీదుగా తూములు వేసేటపుడు కనీస నిబంధనలు పాటించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలేని తూములు పెట్టడం వల్ల అవి త్వరలోనే పాడైపోతాయని తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రామును సంప్రదించి సంబంధిత అధికారులకు ఫోన్లు చేయించామని, స్పందన లేదని తెలిపారు. తూములు వేసినా నాణ్యత అంతంతమాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలు నీరు అందక బీడుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రావెల్ నాసిరకంగా వేయటంతో పొలాలు, పంట బోదెలు పాడైపోయే అవకాశం ఉందన్నారు. సంబంధిత ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు స్పందించకపోవటంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, డ్రెయినేజీ, జాతీయ రహదారుల అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఇండ్ల రామసుబ్బారెడ్డిని సత్కరించిన మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

విజయవాడ: మానసిక వైద్య నిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇండ్ల విశాల్‌ను మంత్రి ఎం.రామప్రసాద్‌రెడ్డి సత్కరించారు. గురువారం ఆయన ఇండ్లాస్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వారిని సత్కరించారు.

అంజాద్‌కు రిమాండ్

విజయవాడ: హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థినిని నగరం నుంచి తీసుకెళ్లి జమ్మూకశ్మీర్‌లో ఉంచిన కేసులో నిందితుడు అంజాద్ అలియాస్ షణ్మును పోలీసులు కోర్టులో గురువారం హాజరుపరిచారు. అతడికి మొదటి ఏసీఎంఎం కోర్టు 14 రోజుల రిమాండ్‌ను విధించింది. తల్లి వద్దకు చేరిన ఆ యువతి మాచవరం పోలీసులకు మరో ఫిర్యాదు చేసింది. తనను నగరం నుంచి బలవంతంగా తీసుకెళ్లి వివిధ ప్రాంతాల్లో బంధించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసులో పోలీసులు అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించింది.

పాతపాడులో గొలుసు దోపిడీ

● కత్తి చూపించి మహిళ బంగారపు గొలుసు లాక్కెళ్లిన దుండగులు ● కత్తిదాడితో గాయపడిన మహిళ


దాడిలో గాయపడిన మహిళ

పాయకాపురం, జూలై 4: మంగళాపురం-పాతపాడు గ్రామాల మధ్య నిర్మానుష్య ప్రాంతంలో గురువారం దారి దోపిడీ జరిగింది. మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మహిళలను బెదిరించి ఆమె బంగారపు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనలో ఆ మహిళ గాయాలపాలైంది. వివరాల్లోకి వెళితే మంగళాపురానికి చెందిన పామర్తి లక్ష్మీ, రాజలపాటి పద్మ, కొండేటి సాయమ్మ కూలీలుగా పని చేస్తుంటారు. పాతపాడులో ఉపాధి హామీ పథకం పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల సమయంలో ముగ్గురూ నడుచుకుంటూ వెళ్తున్నారు. రెండు గ్రామాల మధ్య ఉన్న నిర్మానుష్య ప్రాంతమైన గుబ్బల గట్టు వద్దకు రాగానే వెనుక నుంచి మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ముగ్గురు మహిళలను అడ్డగించారు. వీరిలో పామర్తి లక్ష్మీ అనే మహిళ మెడలోని బంగారపు గొలుసు ఇవ్వాలని బెదిరించారు. ఆ మహిళలు తిరగబడటంతో ఇద్దరిలో ఓ వ్యక్తి కత్తితీసి పామర్తి లక్ష్మీపై దాడిచేసి మెడలోని 3 కాసుల బంగారపు గొలుసును తెంచుకెళ్లిపోయారు. ఈ కత్తిదాడిలో లక్ష్మీ చేతికి గాయమైంది. దోపిడీకి పాల్పడిన వ్యక్తుల వయస్సు సుమారు 35 ఏళ్లుంటాయని, వారి ద్విచక్రవాహనానికి నెంబరు ప్లేట్ లేదని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో మహిళలు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

కాగా దోపిడీ జరిగిన విషయమై ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

రీ ఓపెన్

(5వ పేజీ తరువాయి)

మాటమాటా పెరగడంతో కల్యాణ్‌తో పాటు మిగిలిన ముగ్గురు యువకులు గాంధీపై దాడి చేశారు. బలంగా కొట్టడంతో గాంధీ కుడికన్ను గుడ్డు పగిలి బయటకు వచ్చింది. ఆయన కన్ను కోల్పోయారు. ఇనుప చువ్వ వంటి ఆయుధంతో కంట్లో పొడిచారని ఆయన ఆరోపించారు. ఈ ఘటన సరిగ్గా వల్లూరు ఈశ్వరప్రసాద్ ఇంటికి కూతవేటు దూరంలో జరిగింది. దీనిపై పటమట పోలీసులు ఐపీసీ 326, 506, రెడ్‌విత్ 34 సెక్షన్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏ1గా గద్దె కల్యాణ్, ఏ2గా లీలాకృష్ణ ప్రసాద్, ఏ3గా సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు, ఏ4గా శ్రీనివాస్‌ను చేర్చారు. ఈ ఘటనకు ఈశ్వరప్రసాద్ కారణమని, అతడు వెనుక ఉండి కథను నడిపించాడని, దాడి జరిగే సమయంలో అక్కడే ఉన్నాడని టీడీపీ నేతలు ఆరోపించారు. నాడు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఈశ్వరప్రసాద్ పేరు చేర్చలేదు. కేసులో హత్యాయత్నం సెక్షన్ చేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసులు మాత్రం మూడు సెక్షన్ల కిందే కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా, రిమాండ్‌ను కోర్టు తిరస్కరించింది. గాంధీ గాయాలకు సంబంధించి వైద్యులు ఇచ్చే ఊండ్ సర్టిఫికెట్‌ను రిమాండ్ రిపోర్టుకు జత చేయకపోవడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆ నలుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ విషయం అప్పట్లో తీవ్రమైన విమర్శలకు తావిచ్చింది. కొద్దిరోజుల క్రితం టీడీపీ నేతలు పోలీసు కమిషనర్‌ను కలిశారు. ఈ కేసును పునఃవిచారణ చేయించాలని కోరారు. విచారణను తిరిగి ప్రారంభించిన పోలీసులు తాజాగా ఈశ్వరప్రసాద్‌ను అరెస్టు చేశారు. కేసులో ప్రస్తుతం ఉన్న సెక్షన్లతో పాటు 307 సెక్షన్‌ను అదనంగా చేర్చారు. వల్లూరు ఈశ్వరప్రసాద్‌ను పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి అతడి రిమాండ్‌ను తిరస్కరించారు. ఐపీసీ 307 సెక్షన్ చేర్చడాన్ని అంగీకరించలేదని తెలిసింది. దీంతో ఇతర నిందితులకు ఇచ్చినట్టుగా స్టేషన్ బెయిల్ ఇచ్చారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

విశ్వనాథస్వామికి నాగాభరణం వితరణ

గవర్నర్‌పేట, జూలై 4: కాశీ క్షేత్రంలో విశ్వనాథస్వామికి అలంకరించబడే పంచ శిరస్సులు గల నాగాభరణం తరహాలో వెండితో తయారు చేసిన నాగాభరణాన్ని చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో గురువారం స్వామికి అలంకరించారు. దాతలచే తయారు చేయించబడిన 8 కేజీల 350 గ్రాముల వెండి నాగాభరణాన్ని ప్రత్యేక పూజలు అనంతరం స్వామికి అలంకరించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, 23వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కుక్కలకు ఉచితంగా యాంటీరేబిస్ వ్యాక్సిన్ రేపు

వన్‌టౌన్, జూలై 4: జునోసిస్ డే సందర్భంగా ఈనెల 6 వ తేదీన భవానీపురం జీవకారుణ్య ఆశ్రమం, సాయిబాబా సత్సంగ సేవా సమితి, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్ వేయించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భవానీపురంలోని ఐరన్ కాంప్లెక్సు వద్ద ఉన్న జీవకారుణ్య ఆశ్రమంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కేబీఎన్ కాలేజీ నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి వ్యాక్సిన్ వేస్తారన్నారు.

దీవెన ఫౌండేషన్ వితరణ

భవానీపురం, జూలై 4 : బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న మధురానగర్‌కు చెందిన మూడేళ్ల ధన్విత వైద్యఖర్చులకు దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరఫున రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రూప్ సభ్యులు సాయిరామ్ ప్లాస్టిక్స్ గోవిందరాజులు హైదరాబాద్ బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పాప దగ్గరకు వెళ్లి గురువారం అందజేశారు. ఆర్థిక సహాయం అందించడంపై తల్లిదండ్రులు ప్రసాద్, సునీత లు దీవెన ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మద్యం విక్రేతపై కేసు

పాయకాపురం, జూలై 4 : ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఓ మహిళ గురువారం తెల్లవారుజామున మద్యం విక్రయిస్తుందని సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు దాడులు చేసి పద్మావతి అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 44 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పించిన ఆర్టీసీ ఈడీ(అడ్మిన్)బ్రహ్మానందరెడ్డి, ఆక్టోపస్ అధికారులు, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తదితరులు



వీఎంసీ కార్యాలయంలో అల్లూరికి నివాళి

అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకం

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి ● ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు

వన్‌టౌన్, జూలై 4: ఆంగ్లేయులకు ఎదురొడ్డి గిరిజన ప్రజలను చైతన్యవంతులను చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గొప్ప వ్యక్తి అని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమాన్ని గురువారం పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఎన్టీఆర్ బ్లాక్‌లో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పొందాలని సూచించారు. డిప్యూటీ సీపీఎం (హెచ్‌ఆర్‌డీ) కుమారి సామ్రాజ్యం అధ్యక్షత వహిస్తూ అల్లూరి సీతారామరాజు ఘన చరిత్రను వివరించారు. మానవ వనరుల విభాగం, సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈడీ ఆపరేషన్స్ చంద్రశేఖర్, ఈడీ ఇంజనీరింగ్ జీవీ రవి వర్మ, ఎఫ్ఏ, సీఏవో రాఘవరెడ్డి, ఏడీ విజిలెన్స్ సెక్యూరిటీ శోభామంజరి, పలువురు ఉద్యోగులు, అధికారులు, సూపర్ వైజర్‌లు, బస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ● రాణిగారి తోటలోని సుందరయ్య గ్రంథాలయం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పుప్పాల కృష్ణ పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు తమ్మిన చంద్రశేఖర్, వై.కృష్ణ, యువజన నాయకులు ఈశ్వర్, ఆదామ్ పాల్గొన్నారు.

● ఆక్టోపస్ ఆధ్వర్యాన క్యాంపు కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో ఎస్పీలు ఎం. నాగేంద్రరావు, బి.రవి చంద్రలు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదనపు ఎస్పీలు కే.నగేష్‌బాబు, కే.రామచంద్రమూర్తి, డీఎస్పీలు పి.జగ్గయ్యనాయుడు, టి.నరసింహరావు, ఎన్వీ రమణ, కేఎస్ఎస్ శ్రీనివాస్, మెడికల్ యూనిట్ డాక్టర్లు ఎంసీ రత్నాకర్, జి.మంజువాణి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఆక్టోపస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు సోము భరత్ కుమార్, యు.వెంకటేశ్వరరావు, జే.ఆనందకుమార్, శ్రీరామ్ ఇందిరా, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, కే.శ్రీనివాస్, చిట్టా రాజశేఖర్, ఎంవీ సత్యప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. ● ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. కమిషన్ కార్యదర్శి శ్రీరామశేషు, డిప్యూటీ డైరెక్టర్ పద్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో...

చిట్టినగర్: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ ఏ.మహేష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అదనపు కమిషనర్లు మహేష్, సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాప్ కార్యాలయంలో...

విజయవాడ స్పోర్ట్స్: నగరంలోని ఐజీఎంసీలోని శాప్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. గిరిజన క్రీడాధికారి ఎస్.వెంకట రమణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన్యం వాసుల కష్టాలను తీర్చడానికి తెల్లదొరలను ఎదుర్కొని గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చేశారని కొనియాడారు. శాప్ అకౌంట్స్ ఆఫీసర్ బి. సుశీల, క్రీడాకారులు, కోచ్‌లు అల్లూరి చిత్రపటం వద్ద పూలు వేసి ఘన నివాళులర్పించారు.



కేక్ కటింగ్ కార్యక్రమంలో గద్దె, బొప్పన, అమ్మిశెట్టి, యార్లగడ్డ, చేతికర్రలు పంపిణీ చేస్తున్న అనిశెట్టి గోపి, రంగా విగ్రహానికి పూలదండ వేస్తున్న ఎమ్మెల్యే బొండా, బెజవాడ బార్‌లో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

బలహీనవర్గాల ఆశాజ్యోతి రంగా

● ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి
● కేక్ కటింగ్‌లు, పండ్లు, స్వీట్లు పంపిణీ
● మహిళలకు చీరల పంపిణీ ● భారీ అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్, జూలై 4 : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహనీయుడు వంగవీటి మోహనరంగా అని రాధా రంగా మిత్ర మండలి సభ్యుడు అనిశెట్టి గోపి అన్నారు. వంగవీటి మోహనరంగా 77వ జయంతిని పురస్కరించుకుని గురువారం సుంకర కిషోర్ ఆధ్వర్యంలో న్యూ రాజరాజేశ్వరిపేటలో వృద్ధులకు దుప్పట్లు, చేతికర్రలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో అనిశెట్టి గోపి ముందుగా రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 100 మంది వృద్ధులకు దుప్పట్లు, చేతికర్రలు అందజేశారు. ● అజిత్‌సింగ్‌నగర్‌లోని లూనా సెంటర్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ జాన్‌వలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

పాయకాపురం: పాయకాపురం ప్రశాంతినగర్‌లో, వాంబేకాలనీలో జరిగిన వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. వాంబేకాలనీలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. రాధా రంగా మిత్ర మండలి సభ్యుడు ఓట్ల స్వామినాయుడు ఆధ్వర్యంలో ఏపీఎస్ రెడ్డి రోడ్డులో జరిగిన కార్యక్ర మంలో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ

పటమట : పటమట రఘురామవేదికలో కమ్మిలి రంగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావులతో పాటు అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై రంగా చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం 500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ రంగా జయంతి వేడుకలు ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ రంగా మరణించి 36 ఏళ్ల గడిచినా ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ బలహీనవర్గాల ఆశాజ్యోతిగా రంగా వెలుగుతున్నారన్నారు. అనిత, చందన సురేష్, గాదిరెడ్డి అమ్ములు, గొరిపర్తి కామేశ్వరరావు, నిమ్మల జ్యోతిక, రాధా- రంగా అభిమానులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం: ఎనిమిదవ డివిజన్ అమ్మ కళ్యాణ మండపం వద్ద జనసేన డివిజన్ అధ్యక్షుడు మట్టా వివేక్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని రంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పండ్లు పంపిణీ చేశారు. 500 మందికి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భారతీనగర్: 5వ డివిజన్ సున్నపుబట్టీ సెంటర్ వద్ద దండమూరి సన్నిధి నేతృత్వంలో జరిగిన జయంతి వేడుకల్లో గద్దె క్రాంతికుమార్ పాల్గొని వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు.

కృష్ణలంక: కృష్ణలంక 21వ డివిజన్ జనసేన అధ్యక్షుడు కొవ్వూరు కిరణ్‌బాబు, శేషంశెట్టి చందు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ముందుగా కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. జనసేన నాయకులు పోతిరెడ్డి రమణ, ముళ్లపూడి నాగేశ్వరరావు, పోతిరెడ్డి అనిత తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని నిర్మల హృదయ భవన్ వద్ద రంగా విగ్రహానికి గురువారం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, రంగా అభిమానులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: స్థానిక గులాబితోట అన్న క్యాంటీన్ పక్కన ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పూల మాల వేసి, కేక్ కట్ చేసి నివాళులు అర్పించారు. అనంతరం 500 మంది పేదలకు చీరలు, పండ్లు పంపిణి చేశారు. నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.● సత్యనారాయణపురం రాజన్ కిళ్ళీ షాపు సెంటర్‌లో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ● దేవినగర్ 8వ రోడ్డు ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో దేవినగర్ కాపు సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సాంబశివరావు, వీరరాఘవ, కొప్పోలు శ్రీహరి, పాండురంగారావు పాల్గొన్నారు.

మధురానగర్: 29వ డివిజన్ మధురానగర్‌లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సెంట్రల్ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బోలిశెట్టి వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని రంగా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పండ్లు పంపిణీ చేశారు.

చిట్టినగర్: 46వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర బీసీ నాయకులు గుర్రం కొండ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్‌మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, అమ్మిశెట్టి వాసులు తొలుత వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ● 48వ డివిజన్ చిట్టినగర్ జంక్షన్‌లో జనసేన పార్టీ ధార్మిక మండలి సభ్యులు నారంశెట్టి కూర్మారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, సీనియర్ నాయకులు అజయ్‌వర్మ, విజయలక్ష్మిలు రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు.

భారీ అన్నదానం

భవానీపురం: జనసేన యువ నాయకుడు నామన కార్తీకచంద్ర ఆధ్వర్యంలో భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన బీసీ నాయకుడు అజయ్ ఠాగూర్ వర్మ అన్నదానాన్ని ప్రారంభించి మాట్లాడారు. 45వ డివిజన్ జనసేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఠాగూర్ వర్మ రంగా చిత్రపటం వద్ద నివాళి అర్పించి, కేక్ కట్ చేసి పంచారు.

బెజవాడ బార్‌లో....

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగాల జయంతి వేడుకలను న్యాయవాదులు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరారావు, బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్, మాజీ బార్ అధ్యక్షులు సిహెచ్.మన్మథరావు, వి.గురునాథం, సంపర శ్రీను, పిళ్లా రవిలు కేక్ చేసి తినిపించుకొన్నారు. బార్ కార్యవర్గసభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వన్‌టౌన్: భవానీపురం 40వ డివిజన్‌లో జనసేన పార్టీ నాయకులు తిరుపతి అనూష, సురేష్‌ల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగాల జయంతి కార్యక్రమాలు జరిగాయి. సీతారామరాజు, రంగాల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు సుబ్బయ్య, జనసేన నాయకులు ఎండీ అయాజ్, దాసి రామ్‌మోహన్,



కేక్ కట్ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు

కానాల వినోద్‌కుమార్, పసుపులేటి నాగకృష్ణ పాల్గొన్నారు.

● వన్‌టౌన్‌లోని శంకర్‌కేఫ్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో వంగవీటి రంగా, అల్లూరి సీతారామరాజుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాపునాడు రాష్ట్ర నాయకుడు వడ్లాని మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. భారతమాత, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు, వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా భారీ కేకును అతిథులు కట్ చేసి పంపిణీ చేశారు.

ఘనంగా కొణిజేటి రోశయ్య జయంతి



కొణిజేటి రోశయ్య విగ్రహానికి నివాళులర్పించిన వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

వన్‌టౌన్, జూలై 4: తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా, ఆర్యవైశ్య ప్రముఖులు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర, సేగు వెంకటేశ్వరరావు, అన్నం రామకృష్ణారావు, గురునాథం, పువ్వాడ వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కొల్లిపర శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు వన్‌టౌన్‌లోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు.

వీధికుక్కలతో ఇబ్బంది పడుతున్నాం

కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు దృష్టికి స్థానిక సమస్యలు

వన్‌టౌన్, జూలై 4: కుక్కల బెడద అధికంగా ఉంది, బ్లేడ్ బ్యాచ్ వాళ్ల గొడవలు ఎక్కువగా ఉన్నాయని 52వ డివిజన్‌లో గురువారం శుభోదయం ప్రజాదర్బార్ నిర్వహించిన కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావుకు స్థానికులు వివరించారు. తాగునీటి సమస్య బాగా ఉందని, నలకలు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కాలువలు మరమ్మతులు చేయడంలేదని, చెత్తను ప్రతిరోజూ తీసుకు వెళ్లడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై చంటి స్పందిస్తూ ఈ సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం

అజిత్‌సింగ్‌నగర్, జూలై 4 : అయోధ్యనగర్ నుంచి న్యూ రాజరాజేశ్వరిపేట కరకట్ట రోడ్డులో ఉన్న ఇందిరా ఎన్‌క్లేవ్ వద్ద గురువారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే చనిపోయిన వ్యక్తి బ్లూ కలర్ నిక్కర్ వేసుకున్నాడని, వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఇంట్లో నగదు, బంగారు, వెండి వస్తువులు చోరీ

చిట్టినగర్, జూలై 4: కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధి అంబాపురంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. బంగారు నగలు, వెండి వస్తువులు, రూ. 15 వేలు అపహరణకు గురయ్యాయి. ఇంటి యజమానురాలు వడ్డి కామేశ్వరి ఇంటికి తాళం వేసి నెల రోజుల క్రితం బెంగళూరు వెళ్లారు. బుధవారం ఇంటి ఎదురుగా ఉంటున్న వారు కామేశ్వరి ఇంటి తలుపులు తీసి ఉన్న విషయాన్ని గుర్తించి ఆమె అల్లుడు వెంపటి శ్రీధర్‌శర్మకు ఫోన్ చేసి వివరాలు తెలిపారు, శ్రీధర్ శర్మ అంబాపురం వెళ్లి ఇంటిని పరిశీలించారు. ఇంట్లోని తలుపులు తీసి ఉన్నాయి. వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దేవుడి మందిరం తలుపులు తెరచి ఉన్నాయి. ఆయన కామేశ్వరికి ఫోన్ చేయగా పోయిన వస్తువుల వివరాలను ఆమె వెల్లడించారు. 20 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్, 10 గ్రాముల రెండు జతల చెవిదిద్దులు, 8 గ్రాముల బంగారు చెవి మ్యాటీ, 500 గ్రాముల వెండి పళ్లెం, వెండి దీపారాధన కుందులు రెండు, రెండు చిన్న వెండి గ్లాసులు, నాలుగు చిన్న వెండి మట్టుగిన్నెలు, రూ.15 వేలు అపహరణకు గురైనట్లు తెలిపారు. శ్రీధర్‌శర్మ తన అత్తవారి ఇంట్లో జరిగిన చోరీపై టూ టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



విజయవాడ కల్చరల్, జూలై 4: నగరంలో చెప్పులు కుట్టుకుని జీవిస్తున్న పేద కుటుంబాల విద్యార్థులకు కిసు లెదర్ ఆర్టిజన్స్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆటోనగర్‌లో ఉన్న వైఎస్‌టీ షోరూంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడ్ క్యాప్ ఎండీ డోలా శంకర్, దేవరపల్లి ఆనంద్‌కుమార్, దేవమణి పాల్గొన్నారు.

కళాకారుడు మోహన్‌కృష్ణ సంస్మరణ సభ

గాంధీనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో కళాకారుడు మోహనకృష్ణ సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల హజరత్తయ్యగుప్తా, గోళ్ల నారాయణరావు, నాని, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

మరింత సులభంగా ఎస్‌బీఐ రుణాలు

న్యూఢిల్లీ: రుణాల మంజూరు ప్రక్రియను ఎస్‌బీఐ మరింత సులభం చేసింది. బ్యాంకు 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇందుకోసం అనేక చర్యలు ప్రకటించింది. వ్యవసాయ రుణాల్లో ఉండే నష్ట భయాన్ని (రిస్క్) సరిగా అంచనా వేసి, వేగంగా రుణాలు మంజూరు చేసేందుకు కొత్తగా 35 కేంద్రీకృత వ్యవసాయ ప్రాసెసింగ్ సెల్స్ (ఏసీపీసీ) ఏర్పాటు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై రుణాల మంజూరు కోసం తన ఎండ్ టు ఎండ్ డిజిటల్ యాప్ యోనో, భీమ్ ఎస్‌బీఐ పే యాప్‌లో రెండు ప్రత్యేక ఫీచర్లు జోడించింది. ఎస్‌బీఐ సూర్య ఘర్ లోన్ మంజూరు ప్రక్రియనీ సులభతరం చేసింది. ప్రవాస భారతీయుల బ్యాంకింగ్ అవసరాలు తీర్చేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంది.

బైజూస్ జీతాలు చెల్లించాల్సిందే

ఎన్‌సీఎల్‌టీ

బెంగళూరు: ఎడ్యు స్టార్టప్ బైజూస్‌కి ఎన్‌సీఎల్‌టీ బెంగళూరు బెంచ్ గట్టి హెచ్చరిక చేసింది. ముందు ఉద్యోగుల జీతాల బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. లేకపోతే బైజూస్ ఆదాయ, వ్యయాల పుస్తకాలను ఐసీఏఐ ద్వారా ఆడిట్ చేయించాల్సి ఉంటుందని హెచ్చరించింది. రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించిన 20 కోట్ల డాలర్లు తమకు అందుబాటులో లేనందున ఇప్పటికిప్పుడు ఉద్యోగుల జీతాలు చెల్లించడం సాధ్యం కాదన్న బైజూస్ వాదనని ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. బైజూస్ ఇప్పటికే నడుస్తున్న బిజినెస్ సంస్థ కాబట్టి, వచ్చే ఆదాయం నుంచి ఉద్యోగుల జీతాలు చెల్లించడం పెద్ద సమస్య కాదని స్పష్టం చేసింది.

పదేళ్ల గరిష్ఠ స్థాయిలో ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఆరు నెలల్లో 1,73,241 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. గత పదేళ్లలో ఎన్నడూ ఈ నగరాల్లో ఇన్ని ఫ్లాట్లు, ఇళ్లు అమ్ముడుపోలేదని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది.

హైదరాబాద్‌లో మరింత పైకి: హైదరాబాద్ రియల్టీ గత ఆరు నెలల్లో 18,573 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ముంబై, ఢిల్లీతో సహా దేశంలో మరే ప్రధాన నగరంలోనూ ఇంత భారీ వృద్ధిరేటు నమోదు కాలేదు. ఆఫీసు స్పేస్ లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ కోసం లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

మార్కెట్ దూసుకెళ్తోంది.. జర జాగ్రత్త!



సెబీ, శాట్‌కు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సలహా..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న తరుణంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీతో పాటు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సూచించారు. అంతేకాదు, వ్యవస్థ సుస్థిరత కోసం శాట్ మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మార్కెట్ లావాదేవీలు భారీగా పెరగడంతోపాటు ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి తెస్తున్న నేపథ్యంలో ట్రిబ్యునళ్లపై పనిభారం గణనీయంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో అధికారులు కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలన్నారు. శాట్ కొత్త కార్యాలయంతోపాటు కొత్త వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ పెట్టుబడులకు చట్టాలు రక్షణ కల్పించగలవని, వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థలున్నాయని ఎప్పుడైతే మదుపరులు భావిస్తారో.. వారు మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలుంటాయని, అలాంటి వాతావరణం దేశంలో పెట్టుబడుల పెరుగుదలకు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. స్వలాభం కోసం ఒకరికొకరు హాని చేసుకునే ఆర్థిక ప్రపంచంలో శాట్ రిఫరీ పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అందరూ నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. మార్కెట్ సత్ప్రవర్తన, కార్పొరేట్ పాలన ప్రమాణాల అంశాలకు సంబంధించి శాట్ వద్ద అప్పీళ్లు కొన్ని రెట్లు పెరిగిన నేపథ్యంలో ట్రిబ్యునల్ సమర్థవంతంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు శాట్‌లో ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని సూచించారు.

మోసగాళ్లపై సమాచారం ఇవ్వండి: బుచ్

మార్కెట్లో తప్పుడు పనులకు పాల్పడుతున్న వారి సమాచారం ఇవ్వాలని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మార్కెట్ వర్గాలను కోరారు. స్వప్రయోజనాల కోసం తప్పుగా ప్రవర్తించే వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా తప్పుడు ప్రవర్తన వ్యవస్థాగత సమస్యగా రూపుదాల్చకుండా, మరిన్ని కఠిన నిబంధనలు ప్రవేశపెట్టే అవసరం లేకుండా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టడమే సెబీ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

కడప దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీలో కొత్త యూనిట్ ప్రారంభం

న్యూఢిల్లీ: దాల్మియా భారత్ ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో నిర్మించిన కొత్త యూనిట్‌లో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమయింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 2.6 ఎంటీపీఏ కాగా కొత్త యూనిట్‌తో అదనంగా 1.0 ఎంటీపీఏ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ విస్తరణతో తమ కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 46.6 ఎంటీపీఏకు పెరుగుతుందని పేర్కొంది.

డీసీఐకి రూ.156.5 కోట్ల కాంట్రాక్టు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి (డీసీఐ) రూ.156.5 కోట్ల విలువైన కొత్త కాంట్రాక్టు లభించింది. కొచ్చిన్ పోర్టులో ఏటా నిర్వహించే డ్రెడ్జింగ్ పనుల కాంట్రాక్టును డీసీఐ దక్కించుకుంది. కాంట్రాక్ట్‌లో భాగంగా కొచ్చిన్ పోర్టు అవుటర్ ఛానల్, అప్రోచ్ ఛానల్, ఐసీటీటీ బేసిన్, ఎల్ఎన్‌జీ బేసిన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుందని వివరించింది. మరో ఏడాది పొడిగించే నిబంధనపై ఈ కాంట్రాక్టు తమకు దక్కిందని డీసీఐ తెలియచేసింది.

2025 డిసెంబరు నాటికి సెన్సెక్స్ 1,00,000?

ఐదేళ్లకోసారి రెండింతలవుతున్న ఇండెక్స్

ముంబై: బీఎస్‌ఈ సెన్సెక్స్ గతంలో సాధించిన వృద్ధిని బట్టి చూస్తే, 2025 డిసెంబరు నాటికి 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. గడిచిన 45 సంవత్సరాల్లో సెన్సెక్స్ 15.9 శాతం సంచిత వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) నమోదు చేసుకుంది. 1979 ఏప్రిల్‌లో 100 బేస్ పాయింట్లతో ఏర్పాటైన సెన్సెక్స్. ఇప్పటివరకు 800 రెట్ల వృద్ధిని సాధించింది. 15.9 శాతం సీఏజీఆర్‌ను ముున్ముందూ కొనసాగించగలిగితే వచ్చే ఏడాది డిసెంబరు నాటికల్లా లక్ష పాయింట్లకు చేరుకోగలదని ఓ ఆంగ్ల దినపత్రిక కథనం అంచనా వేసింది. స్వల్పకాలంలో ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం సూచీలు వృద్ధి పథంలోనే పయనించనున్నాయని అంటోంది.

మార్కెట్ పర్యవేక్షణ కోసం కేబినెట్ మంత్రిని నియమించాలి..

సెన్సెక్స్ ప్రస్తుత 15.9 శాతం సీఏజీఆర్‌తో ప్రతి ఐదేళ్లకు రెట్టింపవుతూ వచ్చిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే, 2029 నాటికి సెన్సెక్స్ 1,60,000కు చేరుకోగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, దేశీయ క్యాపిటల్ మార్కెట్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేబినెట్ సహాయ మంత్రిని నియమించాలని సూచించారు.

80,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలకు చేరుకున్నాయి. క్రితం సెషన్‌లోనే 80,000 మైలురాయిని తాకి వెనక్కి వచ్చిన సెన్సెక్స్. తొలిసారిగా ఆ స్థాయికి ఎగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. సెన్సెక్స్ ఒకదశలో 400 పాయింట్ల మేర ఎగిసి 80,392.64 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 62.87 పాయింట్ల లాభంతో మరో జీవితకాల గరిష్ఠ స్థాయి 80,049.67 వద్ద స్థిరపడింది. 24,401 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన నిఫ్టీ చివరికి 15.65 పాయింట్ల లాభంతో 24,302.15 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును సైతం రికార్డు చేసింది. బీఎస్‌ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.4,47,30,452.99 కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) దూసుకుపోయింది.

పదేళ్లలో ఫార్మా ఎగుమతులు 13,000 కోట్ల డాలర్లు

ప్రస్తుతం 2500 కోట్ల డాలర్లు; తెలంగాణ వాటా 35 శాతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఫార్మా ఎగుమతులు వచ్చే పదేళ్ల కాలంలో 13000 కోట్ల డాలర్లకు (రూ.10.85 లక్షల కోట్లు) చేరనున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇప్కా) ప్రెసిడెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల పరిమాణం 2500 కోట్ల డాలర్లున్నదని (రూ.2.08 లక్షల కోట్లు), అందులో ఒక్క తెలంగాణ వాటానే 35 శాతం ఉందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ) వివరాలు తెలియచేయడానికి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ఔషధ మార్కెట్‌కు భారత్ ఎన్నో కీలక ఔషధాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రపంచ మార్కెట్లో భారత ఫార్మాను మరింత విస్తరించి, పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. ప్రపంచ ఫార్మా రంగ ప్రముఖులందరినీ ఒకే వేదిక పైకి తెచ్చి ఫార్మా రంగాన్ని మరింత ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఐపీసీ నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచంలోని భిన్న దేశాలకు చెందిన 12 వేల మంది ప్రతినిధులు, 74 మంది వక్తలు ఈ సదస్సుకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల తర్వాత ఇంత భారీ స్థాయిలో ఐపీసీ సదస్సు హైదరాబాద్ వేదికగా జరుగుతోందని ఆయన వెల్లడించారు.

ప్లేస్‌మెంట్ కాంక్లేవ్

ఫార్మా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం ఐపీసీలో భాగంగా ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ఐపీఏ అధ్యక్షుడు టీవీ నారాయణ చెప్పారు. పలు ఫార్మా కంపెనీలు ఇందులో పాల్గొని విద్యార్థుల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, అర్హులైన వారికి ప్లేస్‌మెంట్ లేఖలు కూడా అందచేయనున్నాయని ఆయన తెలిపారు. ఐపీసీలో ఇలాంటి ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. అలాగే స్టార్టప్‌ల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు తమ ఊహాత్మక ప్రాజెక్టులను ఇక్కడ ఆవిష్కరించినట్టయితే ఉత్తమ ఆవిష్కరణను కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం, అందచేయనున్నట్టు ఆయన చెప్పారు.

డబ్ల్యూహెచ్ఓ అభియోగంలో నిజం లేదు

భారతదేశంలో తయారవుతున్న ఔషధాల్లో 35 శాతం కల్తీ ఔషధాలే అన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికను ఐపీసీ ప్రతినిధులు ఖండించారు. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాల కోసం ప్రపంచం యావత్తు భారతదేశం వైపే చూస్తున్నదన్నారు. ప్రపంచ ఫార్మాగా ప్రసిద్ధి చెందిన మన దేశం కొవిడ్ సంక్షోభ కాలంలో 150 పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిందని, అలాగే ఎన్నో కీలకమైన వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నదని గుర్తు చేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	97,500
ముంబై	72,470 ▲	66,380 ▲	90,020

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	122
కర్నూలు	112	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		

నవ్య | చిత్రజ్యోతి

వేడుకగా నటి వరలక్ష్మి వివాహ రిసెప్షన్

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు







సినీ నటి వరలక్ష్మి, ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ల వివాహం రిసెప్షన్ బుధవారం రాత్రి చెన్నైలోని ఓ నక్షత్ర హోటల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు మంత్రి ఉదయనిధి, మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్, శశికళతో సహా పలువురు రాజకీయ నేతలు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటులు శివకుమార్, విజయకుమార్, నాజర్, నెపోలియన్, ప్రభుదేవా, ఆర్య, సిద్ధార్థ్, జీవా, అరవింద్ స్వామి, గౌతం కార్తీక్, మోహన్‌బాబు, సుదీప్, జాకీ ష్రాఫ్, తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్, సినీ నటి ఖుష్బూ, ఆండ్రియా, సుకన్య, దేవయాణి, రమ్యకృష్ణ, రోజా, సుహాసిని, సీత, సంగీత దర్శకులు దేవ, శ్రీకాంత్ దేవా, తమన్, దర్శకులు భారతీరాజా, ఎస్ఏ చంద్రశేఖరన్, మణిరత్నం, కేఎస్ రవికుమార్, పి.వాసు, బాలా, సురేష్ కృష్ణ, ఆర్‌కే సెల్వమణి, చేరన్, ఐశ్వర్య రజనీకాంత్, ఎ.వెంకటేశ్, ఏఎల్ విజయ్, అట్లీ, వసంత్‌బాలన్, నిర్మాతలు ఆర్‌బీ చౌదరి, ఏఎం రత్నం, ఐసరి కె.గణేష్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. వివాహానికి ముందు జరిగిన సంగీత్ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, నటి త్రిష పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డబ్బింగ్ పనుల్లో విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌కు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో తెరకెక్కుతోన్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో హనుమంతుడి భక్తుడిగా చిరంజీవి కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nDerGdD లో చదవండి.

సమస్యలివి... పరిష్కారాలేవి?

నంది అవార్డులు ఏవీ?

ఒకప్పుడు నంది అవార్డుల ఉత్సవమంటే సినిమావాళ్లకు ఓ పండుగ! అవార్డుల ప్రదానోత్సవాలు కూడా అంత ఘనంగా జరిగేవి. నటులకు ప్రోత్సాహకంగా ఉండేది. రెండు రాష్ట్రాలు విడిపడిన తర్వాత నంది అవార్డుల ప్రస్తావనే లేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'సింహ' పేరుతో చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అవార్డుల కోసం ఎంట్రీలు కూడా స్వీకరించింది. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ పదేళ్ల నుంచి తెలంగాణలో అవార్డుల ఊసే లేదు.

ఆంధ్రాలో పరిస్థితీ అంతే

ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో మూడేళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి కమిటీలు వేసి, నంది అవార్డులు ప్రకటించింది. అంతకుముందు రెండేళ్లుగా కూడా నంది అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకేసారి వేడుక నిర్వహించి మొత్తం ఐదేళ్ల కాలానికి ఒకేసారి నంది అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారం కోల్పోయి, జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. ఆయన నంది అవార్డుల గురించి పట్టించుకోనే లేదు. ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చి.. గద్దర్ పేరిట సినిమాలకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఆ తర్వాత దీని గురించి ప్రాథమికంగా కూడా చర్చ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి కానీ, విడివిడిగా కానీ చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

పరిశ్రమగా గుర్తించాలి

సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. అలా చేయడం వల్ల అనేక రాయితీలు లభిస్తాయి. ఫలితంగా చిత్ర నిర్మాణ వ్యయం తగ్గుతుంది. థియేటర్లు నిర్వహించేవారికి వెసులుబాటు కలుగుతుంది. ఖర్చులు కలిసి వస్తాయి. రాయితీల కారణంగా చిత్ర నిర్మాణాల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం పెరుగుతుంది.

టికెట్ ధరల తికమక

సినిమా టికెట్ ధరలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంది. చిత్ర నిర్మాణ వ్యయం అంచనాలకు మించి పెరిగిన నేపథ్యంలో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుకోవడానికి భారీ చిత్ర నిర్మాతలు విడుదలకు ముందు ప్రభుత్వాలను అభ్యర్థించడం ఇటీవలి కాలంలో ఓ అలవాటుగా మారింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- రూ. వంద కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు ధరలు పెంచుకోవటానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే కొన్నిసార్లు బడ్జెట్ ఎక్కువ అయినా నిర్మాతలు ఖర్చును తక్కువగా చూపిస్తారు. దీని వల్ల గత ఏడాది రెండు పెద్ద సినిమాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతే కాకుండా ఎంత కాలం సినిమా టికెట్ ధరలు పెంచుకోవచ్చనే విషయంపై కూడా అస్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కల్కి సినిమాకు 14 రోజులు ధర పెంచటానికి ఇచ్చిన జీఓపై కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. కొన్ని సినిమాలకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చినా, ఆంధ్రా ప్రభుత్వం మొండిచేయి చూపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలు కలిపి టిక్కెట్ల ధర విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తే బావుంటుందని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి. ఇదే విధంగా బుక్‌మై షో వంటి యాప్‌లకు ప్రేక్షకులు అదనంగా సర్వీస్ టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 250 రూపాయల టికెట్ ధరకు అదనంగా సుమారు 49 రూపాయలు బుక్‌మై షో కు చెల్లించాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రభుత్వమే టికెట్లు విక్రయించే విధంగా యాప్‌లను అభివృద్ధి చేస్తే బావుంటుందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఈ తరహా యాప్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు.



చిన్న సినిమాలూ బతకాలి!


ప్రతి ఏడాది తెలుగులో సుమారు 100 సినిమాలు విడుదల అవుతుంటాయి. వాటిల్లో పది నుంచి పదిహేను మాత్రమే పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే చిన్న సినిమాలు బతకాలంటే వాటికి ప్రత్యేకంగా రాయితీలు ప్రభుత్వ పరంగా ప్రకటించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు కూడా జరిగాయి. కానీ వాటిల్లో పురోగతి లేదు. థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న చిన్న చిత్రాల నిర్మాతలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి ఐదో ఆటగా చిన్న సినిమాను ప్రదర్శించుకోవడానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ఈ విషయం మీద కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే రాష్ట్రం విడిపోక ముందు సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రాలకు పది లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేది. ఆ తరహా చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఇది ఉపయుక్తంగా ఉండేది. అటువంటి విధానాన్ని మళ్లీ చేపట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

డిజిటల్ చార్జీలు కంట్రోల్ చేయలేమా?

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లోనే క్యూబ్(డిజిటల్ ఫార్మాట్‌లో చిత్రాల ప్రదర్శన) చార్జీలు ఎక్కువ. గతంలో ప్రింట్ల విధానం ఉండేది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు డిజిటలైజ్ అయ్యాయి. దీని వల్ల ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా- ఒక షో వేస్తే క్యూబ్‌కు రూ. 6500 చెల్లించాల్సిందే. ముఖ్యంగా సింగిల్ థియేటర్ యజమానులు ఈ పద్ధతి వల్ల చాలా నష్టపోతున్నారు. డిజిటల్ చార్జీల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే సింగిల్ థియేటర్లకు మేలు జరుగుతుంది. . లేకపోతే నష్టాలు భరించలేక ఎక్కువ థియేటర్లు కల్యాణ మండపాలుగానో.. షాపింగ్ మాల్స్‌గానో మారిపోయే అవకాశముంది.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమ అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) తెలిపింది. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, కే శివప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో చిత్ర పరిశ్రమ ప్రభుత్వానికి అండగా నిలిచింది, ఇకపైనా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపింది. డ్రగ్స్ సైబర్ నేరాల కట్టడిలో నటీనటులు, దర్శక నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు తమవంతు సహకారాన్ని అందిస్తారు, దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలసి చర్చిస్తాం' అని టీఎఫ్‌సీసీ తెలిపింది.



'జాయింట్ నంది అవార్డ్స్'...

తెలుగు సినీ రంగానికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో పైరసీ సమస్య ఒకటి. మరొకటి టికెట్ రేట్లు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా తగ్గిస్తే.. పరిశ్రమకు మేలు జరుగుతుంది. తెలుగు సినీ రంగానికి తోడ్పడేలా ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులు కలిపి 'జాయింట్ నంది అవార్డ్స్' ప్రకటిస్తే బాగుంటుంది. ఒక సంవత్సరం హైదరాబాద్‌లో, ఇంకో సంవత్సరం అమరావతిలో ఆ వేడుకలను జరపాలి. ఇలా చేస్తే తెలుగు సినిమాకు.. తెలుగు వారికి మరింత ప్లస్ అవుతుంది.

- డి.సురేశ్‌బాబు, నిర్మాత

నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది



రాష్ట్రాలు రెండే కాని.. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లోనూ ఆడుతోంది. గత ప్రభుత్వాలతో పోల్చితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు సినీరంగ అభివృద్ధికి, తోడ్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులు కలసి మళ్లీ నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ నిర్ణయం తెలుగు ప్రజలకు ఆనందం కలిగిస్తుంది. రేపు ముఖ్యమంత్రులిద్దరూ కలసి చర్చలు జరిపే నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులకు ఏదో ఒక పేరుతో అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది.

- ఎస్.వీ.రామారావు, సినీ చరిత్రకారుడు

నేడు మనం దర్శిస్తున్న జగన్నాథ, బలదేవ, సుభద్రా రూపాలు... వారివారి మహాభావ ప్రకాశ తత్త్వానికి ప్రతిరూపాలు. దేవశిల్పి అయిన విశ్వకర్మ... వారి రూపాలను ఇలా ప్రత్యేకమైన ఆకృతిలో మలచడం కూడా ఆ జగన్నాథుడి సంకల్పమే. దీనికి కారణాలు 'స్కాంద పురాణం'లోని 'ఉత్కళకాండ'లో ఉన్నాయి.



జగన్నాథ రథోత్సవం

హరేకృష్ణ

జగదానందపర్వం...



7న శ్రీ జగన్నాథ రథోత్సవం

జగన్నాథుడు, సుభద్ర, బలదేవుడు తమతమ రథాల్లో ఆసీనులై... భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఊరేగింపుగా కదలివచ్చే మహోత్సవం శ్రీ జగన్నాథ రథయాత్ర. ఒడిశా రాష్ట్రంలోని అత్యంత పురాతనమైన శ్రీజగన్నాథుడి దివ్యధామం... జగన్నాథపురి (పూరీ) క్షేత్రంలో ప్రతి యేటా కన్నుల పండుగగా జరిగే వేడుక ఇది. పూరీ ప్రధాన ఆలయం నుంచి గుండీచా ఆలయం వరకూ కొనసాగే ఈ రథ యాత్రలో... జగన్నాథుడు, బలదేవుడు, సుభద్ర... నందిఘోష, తాళధ్వజ, దేవదళన అనే తమతమ రథాలను అధిరోహిస్తారు. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు... జగన్నాథ రథయాత్రను యావత్ ప్రపంచానికీ పరిచయం చేశారు. ఆయన ప్రచార ప్రభావం వల్ల అనేక ఖండాల్లోని భక్తులు ఈ విశిష్టమైన రథయాత్రను ఏటా నిర్వహిస్తున్నారు.

భక్తుల కోసం కదలివచ్చే స్వామి...

జగన్నాథుడంటే... నంద మహారాజు పుత్రుడై అవతరించిన, సాక్షాత్తూ దేవదేవుడైన శ్రీకృష్ణుడే. శ్రీకృష్ణుని నిత్య లీలల్లో పాలు పంచుకొనేందుకు వివిధ పాత్రల్లో అవతరించే ఆయన పరివ్యాప్త స్వరూపం... ఆయన సోదరుడైన బలదేవుడు, బలరాముడు లేదా బలభద్రుడు. సుభద్రమ్మ శ్రీకృష్ణుని సోదరి. జగన్నాథుడంటే సమస్త జగత్తుకూ నాథుడు. 'జగత్' అంటే 'కదిలేది' అని అర్థం. అది ఈ విశ్వాన్ని సూచిస్తుంది. అందుకే జగన్నాథుడంటే విశ్వానికంతటికీ ప్రభువు. వివిధ కారణాల వల్ల స్వామి కృపను పొందేందుకు ఆలయానికి రాలేకపోయిన వారిని సైతం కరుణించడం కోసం... ఏడాదికి ఒకసారి ఆ స్వామే స్వయంగా బయటకు వస్తాడు. ఈ విధంగా ఆయనను సేవించే గొప్ప అవకాశం ప్రతి ఒక్కరికీ లభిస్తుంది. భక్తియుత భావనతో చేసే ఈ సేవ... మోక్షదాయకమై... భగవద్ధామానికి చేరుస్తుంది. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే'... అంటే "రథాన్ని అధిరోహించిన జగన్నాథుణ్ణి ఎవరైతే దర్శిస్తారో వారు పునర్జన్మ నుండి విముక్తిని పొందుతారు" అనే శాస్త్రవచనాన్ని... లండన్ రథయాత్ర సందర్భంగా శ్రీల ప్రభుపాదుల వారు భక్తులందరికీ తెలియజేశారు. జగన్నాథుణ్ణి కీర్తిస్తూ ఆదిశంకరాచార్యులు ఎనిమిది శ్లోకాలతో రచించిన 'శ్రీజగన్నాథాష్టకం' సుప్రసిద్ధమైనది. "జగన్నాథుడు తన రథంపై వెళుతున్నప్పుడు... అడుగడుగునా ప్రార్థనలు, కీర్తనలు బిగ్గరగా వినిపిస్తాయి. వారి స్తోత్రాలను వింటూ అత్యంత ప్రసన్నుడైన ఆ జగన్నాథుడు... దయాసముద్రుడు, సమస్త లోకాలకూ నిజమైన స్నేహితుడు. అమృతోద్భవ సమయాన జన్మించిన ఆ లక్ష్మీదేవీ పతి అయిన జగన్నాథుడు నా కన్నుల ప్రయాణంలో ఎల్లప్పుడూ ఎదురుగా ఉండుగాక" అని ఆదిశంకరులు ప్రస్తుతించారు.

ఆ రూపాలు దైవ సంకల్పమే...

నేడు మనం దర్శిస్తున్న జగన్నాథ, బలదేవ, సుభద్రా రూపాలు... వారి వారి మహాభావ ప్రకాశ తత్త్వానికి ప్రతిరూపాలు. దేవశిల్పి అయిన విశ్వకర్మ... వారి రూపాలను ఇలా ప్రత్యేకమైన ఆకృతిలో మలచడం కూడా ఆ జగన్నాథుడి సంకల్పమే. దీనికి కారణాలు 'స్కాంద పురాణం'లోని 'ఉత్కళ కాండ'లో ఉన్నాయి. ఒక రోజు సూర్యగ్రహణం సంభవించినవేళ... శ్రీకృష్ణుడు, బలరాముడు తమ సోదరి సుభద్రతోనూ... కుటుంబ, సపరివార సమేతంగానూ కురుక్షేత్రంలో పుణ్యస్నానాలు చేయడానికి ద్వారకనుంచి బయలుదేరి వెళ్ళారు. ఆ సమయంలో... బృందావనం నుంచి వచ్చిన నంద యశోదలు, రాధారాణి మొదలైన వ్రజవాసులందరినీ అక్కడ కలుసుకున్నారు. యాత్రికులందరూ తమతమ కుటీరాలను అక్కడ ఏర్పాటు చేసుకున్నారు. బలరాముని తల్లి అయిన రోహిణి తన కుటీరంలో... శ్రీకృష్ణుడి భార్యలకు శ్రీకృష్ణ, బలరాముల బృందావన బాల్య లీలలను వివరించడం మొదలుపెట్టింది. అటువైపు ఎవరూ రాకుండా చూడాలని సుభద్రను కాపలాగా ఉంచింది. ఇంతలో శ్రీకృష్ణుడు, బలరాముడు అక్కడికి వచ్చారు. లోపల జరుగుతున్నది వారికి సుభద్ర చెప్పింది. ముగ్గురూ ద్వారం దగ్గరే నిలబడి, రోహిణి చెబుతున్న విషయాలను వినసాగారు. గోపికలు, వ్రజవాసులతో కూడిన తమ బాల్య మధుర ఘట్టాలను విని బలరామకృష్ణులు పరవశించారు. వారి నేత్రాలు విశాలమయ్యాయి, శిరస్సు విస్తరించింది, కరచరణాలు లోపలికి చొచ్చుకుపోయాయి. వారిలోని అంతర్గతమైన మాధుర్య భావనలు... బాహ్యంగానూ వ్యక్తమై వారి శరీరాకృతులను మార్చేశాయి. వారిరువురినీ చూసిన సుభద్ర... అదే రీతిలో పారవశ్యానికి లోనయింది. ఆ దివ్యరూపాలను దర్శించిన నారదముని... అదే రూపాల్లో ఈ లోకంలో కొలువు తీరాలని కోరగా... శ్రీకృష్ణుడు సమ్మతించాడు. ద్వారకా పురవాసులు శ్రీకృష్ణుణ్ణి ఐశ్వర్య భావనతో సేవిస్తే... బృందావన వ్రజవాసులు మాత్రం మాధుర్య ప్రేమ భావనలతో ఆరాధించారు. వారు చూసిన ఆ మధురప్రేమకు ప్రతిరూపాలై వెలిశారు జగన్నాథ, బలదేవ, సుభద్రలు. శ్రీకృష్ణుడి జన్మతిథి శ్రావణ బహుళాష్టమి అయినప్పటికీ... ఆనాడు కురుక్షేత్రంలో మహాభావ ప్రకాశ తత్త్వాన్ని వ్యక్తపరుస్తూ జగన్నాథుడిగా ఆయన ఆవిర్భవించిన... జ్యేష్ఠ పౌర్ణమినే... జగన్నాథుడి జన్మతిథిగా పరిగణించడం మరో విశేషం.



జగన్నాథ రథయాత్రలో ఎలా పాల్గొనాలి?

జగన్నాథుడి రథోత్సవం భగవంతుణ్ణి సేవించే సదవకాశాన్ని భక్తకోటికి అందిస్తుంది. రథంపై ఆసీనుడైన స్వామిని కనులారా దర్శించుకోవచ్చు. తాడును పట్టుకొని రథాన్ని లాగవచ్చు. వివిధ ధూప దీప హారతుల మధ్య దేదీప్యమానంగా వెలుగొందే స్వామిని వీక్షించవచ్చు. స్వామికి అమితానందం కలిగించే విధంగా నృత్య సంకీర్తనలు చేయవచ్చు. రథం వెళ్ళే మార్గాన్ని శుభ్రపరచి, రంగురంగుల ముగ్గులతో అలంకరించవచ్చు. వివిధ రకాల పుష్పాలు, ఫలాలు, కొబ్బరికాయలు, రుచికరమైన మధుర పదార్థాలను స్వామికి నివేదించవచ్చు. భక్తిపూర్వకంగా చేసే సేవ ఏపాటిదైనా... అది మనల్ని ఆధ్యాత్మికంగా మరింత పురోగమింపజేస్తుంది. అటువంటి సేవాభాగ్యాన్ని ఏ విధమైన తారతమ్యాలూ లేకుండా ప్రతి ఒక్కరికీ అనుగ్రహిస్తున్న జగన్నాథుడు... పతితపావన సార్థక నామధేయుడు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



అమ్మ అభయం కోసం...



7 నుంచి బోనాల ఉత్సవాలు

ఘనమైన గ్రామీణ, సాంస్కృతిక వారసత్వం కలిగిన తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలూ ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొనే వేడుక బోనాల పండుగ. దీన్ని 'ఆషాఢ జాతర' అని కూడా అంటారు. ఆషాఢమాసంలోని మొదటి ఆదివారం లేదా గురువారం బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వర్షాలు మొదలై, పంటలు వేసే కాలంలో... ఎలాంటి విపత్తులూ ఎదురుకాకుండా చూడాలనీ, సమృద్ధిగా పాడి ఇంటికి చేరాలనీ అమ్మవార్లను రైతులు ప్రార్థిస్తారు. వర్షాకాలం కాబట్టి వ్యాధులు ప్రబలకుండా కాపాడాలని ప్రజలు గ్రామ దేవతలకు మొక్కుకుంటారు. ఏటా ఆషాఢ మాసంలో గ్రామదేవతలు తమ పుట్టిళ్ళకు వస్తారని ప్రజల విశ్వాసం. వారిని ఆహ్వానించి, నివేదనలు సమర్పించి, కోరికలు కోరుకొని, మొక్కులు చెల్లించుకొనే సందర్భమే... నెల రోజుల బోనాలు పండుగ. కాకతీయ రాజులు కాకతీమాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారనీ, అవే క్రమంగా బోనాలు వేడుకలుగా రూపుదిద్దుకున్నాయనీ అంటారు. నూట యాభై ఏళ్ళ కిందట ప్లేగు వ్యాధి హైదరాబాద్ నగరాన్ని కల్లోలపరచినప్పుడు... తమను ఆ మహమ్మారి బారి నుంచి కాపాడాలని వేడుకుంటూ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారని తెలుస్తోంది. నాటి నుంచీ బోనాల సంబరాలకు హైదరాబాద్ చిరునామాగా మారింది.

కుతుబ్‌షాహీ పాలకుడు తానీషాకు మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్నలు గోల్కొండ కోటలో నిర్మించిన జగదాంబిక ఆలయంలో బోనాల ఉత్సవాలకు ప్రతి సంవత్సరం అంకురార్పణ చేయడం ఆనవాయితీ. రథోత్సవంతో, తొట్టెల ఊరేగింపుతో అమ్మవారి విగ్రహాలను ఆలయానికి తీసుకువచ్చి, తొలి పూజ చేస్తారు. దీనితో ఉత్సవాలు మొదలవుతాయి. బోనాల సమర్పణ మరో ప్రధానమైన వేడుక. బోనం అంటే అమ్మవారికి నివేదించే అన్నం. చిత్రాన్నం, బెల్లం పొంగలి లాంటి రకరకాల వివిధ పదార్థాలను మహిళలు తయారు చేస్తారు. వాటిని పాత్రల్లో ఉంచి, చుట్టూ వేపమండలు కట్టి, ఆ పాత్రపైన మూతలో దీపం వెలిగిస్తారు. ఆ పాత్రలను తలపై ధరించి, ఆలయాలకు చేరుకుంటారు. అమ్మవారిని ప్రార్థించి, బోనాన్ని సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నుంచి కాపాడాలంటూ అమ్మవారికి వేప కొమ్మలను సమర్పిస్తారు. అలాగే తమ ఇళ్ళ నుంచి తెచ్చిన పదార్థాలను భక్తులు బండిపై ఉంచి, ఆలయానికి తీసుకువస్తారు. దీన్ని 'ఫలహారపు బండి' అంటారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాక, ఆ పదార్థాలను అమ్మవారికి నివేదిస్తారు. బోనాల ఉత్సవాల్లో మరో ఆకర్షణ పోతురాజు. పోతురాజును అమ్మవారి సోదరుడిగా భావిస్తారు. ఆలయ ఆవరణల్లో, వీధుల్లో పోతురాజు వేషధారులు చేతిలో కొరడాతో వీరంగం వేస్తారు. బోనాల సమర్పణ పూర్తయిన మరునాడు ఆలయం ఎదుట జరిగే రంగం సందర్భంగా... అవివాహిత అయిన మహిళ పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపిస్తారు. రాబోయే రోజుల్లో సంభవించే పరిణామాలను అమ్మవారే ఆ మహిళ ద్వారా ప్రకటిస్తారని భక్తులు నమ్ముతారు. రంగం ముగిసిన తరువాత బలిహరణం పేరిట అమ్మవారికి నివేదన ఉంటుంది. అనంతరం కలశాలనూ, అమ్మవారి చిత్రపటాలనూ అంబారీపై ఊరేగించి, ఘటాల నిమజ్జనతో అమ్మవారికి వీడ్కోలు చెప్పడంతో ఉత్సవాలు పూర్తవుతాయి. ఈ ఏడాది జూలై ఏడవతేదీ ఆదివారం నాడు గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో బోనాలు ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఆ తరువాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలను నిర్వహిస్తారు.

వేడుక

ఎప్పుడంటే...

- **జూలై 7న:** గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం
- **జూలై 21న:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు
- **జూలై 22న:** రంగం, భవిష్యవాణి
- **జూలై 28న:** పాతబస్తీ (లాల్ దర్వాజా) బోనాలు
- **జూలై 29న:** ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు



అహంకారం... వివిధ కోణాలు

గీతాసారం

అహంకారం ('నేనే కర్తను' అనే భావన) అర్జునుణ్ణి ఆవహించిందనీ, అదే అతని విషాదానికి కారణమనీ శ్రీకృష్ణుడు గమనించాడు. అర్జునుడి అహంకారాన్ని విచ్ఛిన్నం చేయడానికీ, అంతరాత్మదాకా చేరుకోవడానికీ సమగ్ర బుద్ధిని ఉపయోగించాలని సలహా ఇచ్చాడు. అహంకారానికి అనేక రూపాలు ఉన్నాయి. గర్వం అహంకారంలో ఒక చిన్న భాగం. ఎవరైనా విజయం/గెలుపు/లాభం అనే ధ్రువాలలోంచీ వెళుతున్నప్పుడు.... ఆ అహంకారాన్ని అభిమానం అంటారు. ఎవరైనా నష్టం/వైఫల్యం/ఓటమి అనే బాధాకరమైన ధ్రువాలలోంచీ వెళుతున్నప్పుడు... ఆ అహంకారాన్ని నిరాశ/దుఃఖం/క్రోధం అంటారు. ఇతరులు 'సుఖం' అనే ధ్రువంలోంచి వెళుతున్నప్పుడు... మనలోని అహంకారం అసూయగా మారుతుంది. ఎవరైనా 'దుఃఖం' అనే ధ్రువంలో ఉంటే... అప్పుడది మనలో సానుభూతిని కలిగిస్తుంది. మనం భౌతిక ఆస్తులను కూడబెడుతున్నప్పుడు, వాటిని పోగొట్టుకున్నప్పుడు కూడా ఇది ఉంటుంది. ఇది లోకంలో కర్మ చెయ్యడానికీ లేదా సన్యాసం స్వీకరించడానికీ ప్రేరేపిస్తుంది. సృష్టితో పాటు వినాశనానికి కూడా ఇదే కారణం. ఇది జ్ఞానంలోనూ ఉంది, అజ్ఞానంలోనూ ఉంది.



ప్రశంసలు అహంకారాన్ని పెంచుతాయి. విమర్శలు బాధ పెడతాయి. ఈ రెండు దశలూ మన భావాల్ని ఇతరులు తారుమారు చేయడానికి అనుకూలంగా మారుస్తాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే... ప్రతి భావోద్వేగం వెనుకా ఏదో రూపంలో అహంకారం ఉంటుంది. ఈ భావోద్వేగాలు మన బాహ్య ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. అహంకారం మనల్ని విజయం వైపు, శ్రేయస్సు వైపు నడిపిస్తున్నట్టు కనిపించవచ్చు. కానీ అది తాత్కాలిక తృప్తి కోసం మాదక ద్రవ్యాలను తీసుకోవడం లాంటిది. 'నేను', 'నాది', 'నన్ను', 'నాకు' అనేవి అహంకారానికి కాళ్ళ లాంటివి. రోజువారీ సంభాషణలు, ఆలోచనల్లో ఈ పదాలను ఉపయోగించకుండా ఉండడం ద్వారా... అహంకారాన్ని చాలావరకూ బలహీనపరచవచ్చు. మనల్ని మనం ఒక ధ్రువ లక్షణంతో లేదా మరోదానితో గుర్తించాలని కోరుకున్నప్పుడు... అహంకారం పుడుతుంది. అందుకే అహంకారానికి చోటివ్వని నిర్వికల్ప స్థితిలో... సమత్వ భావాన్ని కలిగి ఉండాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు సూచించాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

మౌనంతో మేలుకొలుపు



10న అవతార్ మెహెర్‌బాబా 99వ మౌన వార్షికోత్సవం

మౌనంతోనే లోకానికి అద్భుతమైన సందేశాన్ని ఇచ్చిన కారణజన్ముడు అవతార్ మెహెర్‌బాబా. మానవరూపంలో వచ్చిన దేవదేవునిగా, తమ ఇంటి ఇలవేల్పుగా మన దేశంతోపాటు ప్రపంచంలోని అనేక దేశాల్లో ఎందరో ఆయనను ఆరాధిస్తున్నారు. వారిలో తెలుగువారు కూడా అసంఖ్యాకంగా ఉన్నారు. "నేను బోధించడానికి రాలేదు, మానవాళిని మేలుకొలపడానికే వచ్చాను. ఏదో ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని ఆశించికాదు, విశ్వమానవ కళ్యాణం కోసమే మౌనాన్ని పాటిస్తున్నాను. మౌనంగా ఉన్నప్పటికీ... ప్రతి ఒక్కరి హృదయంతో నిరంతరం... నేరుగా మాట్లాడుతూనే ఉన్నాను" అని ఆయన ప్రకటించారు. "నేను ప్రత్యేకంగా ఎలాంటి మతాన్నీ స్థాపించడానికి రాలేదు. అన్ని మతాలూ ఒక్కటేనని చాటి చెప్పడమే నా లక్ష్యం. ప్రేమే నా మతం. ప్రతి ఒక్కరిలోనూ భగవంతుడు ఉన్నాడు. కాబట్టి ఎవరినీ నొప్పించేలా మాట్లాడవద్దు" అని చెప్పారు. "కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన దైవసేవ. 'నేను, నాది, నాకు' అనే భావనకు దూరంగా ఉంటూ, నిస్వార్థంగా చేసే సేవ ద్వారా మాత్రమే భగవంతుడికి ఎవరైనా చేరువవుతారు. అన్నిటిలోనూ క్షమాగుణమే ఉదాత్తమైనది" అని స్పష్టం చేశారు. ఆయన మాటలు ఆచరణకు కష్టంగా అనిపించవచ్చు. కానీ అసాధ్యం కాదని ఆయన అనుయాయులు రుజువు చేశారు. 1925 జూలై 10వ తేదీ నుంచి... 1969 జనవరి 31న శరీర త్యాగం చేసేవరకూ... అంటే నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన మౌనంలోనే ఉన్నారు. మెహెర్‌బాబా మౌన దీక్ష ప్రారంభించేనాటికి... ఆయన వయసు కేవలం 30 సంవత్సరాలే.

మౌనం, ఉపవాసం, ఏకాంతవాసం...

తన అనుయాయులను కూడా... తాను మౌనదీక్షను ప్రారంభించిన రోజున (జూలై 10న)... మౌనం పాటించాల్సిందిగా మెహెర్‌బాబా ఆదేశించారు. ఇది తన ఆధ్యాత్మిక ప్రణాళికలో వారిని భాగస్వాములను చేయడం కోసమేనని చెప్పారు. "మౌనంగా ఉన్న సమయంలో మనస్సును కట్టడి చేయండి. నోరు మాట్లాడకుండా ఉన్నా... మనస్సు అనేక ఆలోచనలతో గగ్గోలు పెడుతూనే ఉంటుంది. మనస్సులో వచ్చే ఆలోచనలను అదుపు చేయడం కష్టమే. కనీసం... నిరంతరాయంగా వచ్చే ఆలోచనలను పట్టించుకోకుండా... మౌనంగా ఉంటూ భగవన్నామస్మరణ చేయండి. మీ నోటినుంచి వచ్చే మాటల కన్నా... హృదయం నుంచి వెలువడే భాషనే భగవంతుడు ఆలకిస్తాడు" అని తెలిపారు. ఆయన తన జీవితంలో మౌనంతో పాటు... ఎక్కువ రోజులు ఉపవాసాన్నీ, ఏకాంతవాసాన్నీ పాటించారు. ముఖ్యంగా... తన జీవితకాలంలోని చివరి నాలుగు సంవత్సరాలు అత్యంత కఠినమైన ఏకాంతవాసం గడిపారు. అప్పటికే బాబా శరీరంలో కుడి, ఎడమ భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరోగ్యం బాగా క్షీణించింది. "ఆయన కనీసం గాలి కూడా ప్రవేశించడానికి వీలు లేకుండా... తన గదిలో తలుపులు, కిటికీలు అన్నీ మూసుకొనేవారు. మేము ఆ గదికి తాళం వేసేవాళ్ళం. ఏకాంతవాస సమయంలో యావత్ ప్రపంచం తనకు దగ్గరగా ఉంటుందని బాబా స్వయంగా చెప్పారు" అని ఆయనకు అత్యంత సన్నిహితుడైన ఏరుచ్ వెల్లడించారు. "మెహెర్‌బాబా స్వీయ ఆచరణ ద్వారా నిత్య జీవన సరళిని మాకు తెలియజేశారు. జీవన సత్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకొనేలా చేశారు. 'అందరిలో పరమాత్మ ఒక్కడే' అనే విషయాన్ని ఎన్నో సందర్భాలలో అనేక విధాలుగా అర్థమయ్యేలా చేశారు. ఇదే విధంగా చేయాలని బాబా మమ్మల్ని ఎన్నడూ నియంత్రించలేదు. మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ప్రతిదీ దైవానుగ్రహం వల్లనే జరుగుతోందనే చింతనతోనే ఏ కార్యాన్నయినా చెయ్యాలని ప్రబోధించారు" అంటూ బాబాతో తనకున్న అనుభవాలను ఒక అమెరికన్ భక్తుడు తెలియజేశారు.

మహిమలు చెయ్యనన్నారు కానీ...

"నేను ఎన్నడూ మహిమల్ని చెయ్యను" అని మెహెర్‌బాబా పలుమార్లు ప్రకటించారు. అయితే బాబా ప్రతిక్షణం తమకు ఊపిరికన్నా దగ్గరగా ఉంటారనీ, కంటికి రెప్పలా ఆదుకుంటారనీ పలువురుల భక్తులు చెబుతారు. అలాంటి ఒక వాస్తవ సంఘటన... ఇది అరవయ్యేళ్ళ నాటి సంగతి. హైదరాబాద్‌కు చెందిన ముత్తనపల్లి శ్రీనివాస తేజస్వికి... పుట్టిన పదినెలలకే తీవ్రమైన జ్వరం వచ్చింది. పోలియో సోకి... రెండు చేతులూ, కాళ్ళూ చచ్చుబడిపోయాయి. అతని తండ్రి హైకోర్టులో పెద్ద పేరున్న వకీలు. ఆయన స్థితిమంతుడు కావడంతో... కుమారుణ్ణి ప్రముఖ వైద్యులందరికీ చూపించారు. హోమియో వైద్యంతో నయమవుతుందంటే జర్మనీ కూడా వెళ్ళారు. ప్రతి దేవుడికీ మొక్కారు. కానీ ఫలితం లేకపోవడంతో... తమ కుమారుడికి నయమవుతుందనే ఆశ వదులుకున్నారు. ఆ సమయంలోనే మెహెర్‌బాబా గురించి తెలిసింది. ఆఖరు ప్రయత్నంగా... పుణేలో బాబాను దర్శించుకున్నారు. అప్పటికి మూడేళ్ళున్న ఆ పిల్లవాణ్ణి బాబా తన చేతుల్లోకి తీసుకున్నారు. అతను బాబా గుండెలమీద కొన్ని క్షణాలు ఆడుకున్నాడు. తరువాత హుషారుగా... ఆరోగ్యవంతుడిలా నడుస్తూ వెళ్తుంటే... అతని తల్లితండ్రులు తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. "బాబా మహిమలు చెయ్యనని చెప్పారు. కానీ 'అన్యథా శరణం నాస్తి' అనే స్థితిలో... నన్ను ఆదుకున్నారు" అని అరవై రెండేళ్ళ తేజస్వి చెబుతారు. "నాకు చిన్నప్పుడు పోలియో ఉండేదని వైద్యులకు చెబితే... 'మీ శరీరంలో దానికి సంబంధించిన గుర్తులేవీ లేవ'ని ఆశ్చర్యపడుతూ ఉంటారు" అని ఆయన అంటారు.

బాబా సమాధి...

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు అయిదు కిలోమీటర్ల దూరంలో మెహెర్‌బాబా సమాధి ఉంది. 1938 నాటికే... బాబా స్వీయ పర్యవేక్షణలో అది పూర్తయింది. ఆ సమాధి ప్రాంగణం నిరాడంబరతకు నిర్వచనంలా ఉంటుంది. అర్చక స్వాములు కానీ, పూజలు, హారతులు, కర్మకాండల్లాంటివేవీ అక్కడ ఉండవు. దర్శనం టిక్కెట్లు, విరాళాల కోసం హుండీలు కనిపించవు. అది అరుదైన ప్రశాంతత కలిగి నిశ్శబ్ద ప్రార్థనా ప్రాంగణం. సమాధికి సుమారు అర కిలోమీటరు దూరం నుంచి మౌనం రాజ్యమేలుతూ ఉంటుంది. మెహెర్‌బాబాను భౌతికంగా దర్శించుకొనే సందర్భంలో... సందర్శకుల మనసు ఆర్ద్రమయ్యేదనీ, దుస్తులు తడిసిపోయేలా కన్నీరు చెక్కిళ్ళపై కారుతూ ఉండేదనీ భక్తులు గుర్తు చేసుకుంటూ ఉంటారు. సమాధిని దర్శించుకొనే చాలామంది కూడా అదే అనుభూతిని అనుభవిస్తున్నామని చెబుతారు. ఏడాది పొడుగునా... రోజూ ఉదయం ఆరు నుంచి రాత్రి ఎనిమిది వరకూ బాబా సమాధిని దర్శించుకోవచ్చు.

• మల్లాది కృష్ణానంద్, 99595 53218

ధర్మపథం


ప్రపంచం ఒక మాయాజాలం

మన రాష్ట్రంలో జన్మించిన ఆచార్య నాగార్జునుడు తన నిశితమైన తార్కిక మేధస్సుతో పదునైన దార్శనిక, సైద్ధాంతిక వ్యూహాలను సృష్టించాడు. "ఈ ప్రపంచమంతా ఒక మాయాజాలం" అని ఆయన అన్నాడు. కలలలో కనిపించే వస్తువుల ఉనికి మాదిరిగా... ఈ ప్రపంచంలోని అన్ని వస్తువుల ఉనికి ఊహాజనితమే. మనం మేలుకొని ఉన్నప్పుడు కూడా కలలు కంటాం. అలాగే ఈ ప్రపంచాన్ని విశ్లేషిస్తే... అందులో ఏమీ లేదని తెలుస్తుంది. ప్రపంచం నిత్యం పరివర్తన చెందుతూ ఉంటుంది. ఇది ఏమాత్రం శాశ్వతం కాదు... ఇవీ ఆయన ప్రతిపాదనలు. "మరి కనిపించే ప్రపంచం మాట ఏమిటి? యదార్థమైన ఈ ప్రపంచంలో ఉంటూ, దాన్ని అనుభవిస్తూ, దాని అస్తిత్వాన్నే ఒప్పుకోకపోవడం సముచితమా?" అని కొందరు ప్రశ్నించవచ్చు. ప్రపంచం ఉన్నదనే మాట సత్యమే. కానీ అది పారమార్థికంగా లేదు. అందుకే ఆచార్య నాగార్జునుడి సిద్ధాంతానుసారం సత్యం రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి: సంవృతి సత్యం... అంటే ఉపరితల సత్యం. రెండోది: పరమార్థ సత్యం... అంటే అంతిమ సత్యం. పారమార్థికంగా చూస్తే 'ఈ ప్రపంచమంతా ఒక మాయాజాలం' అని తెలుస్తుంది. ఇంతకుముందు చెప్పినట్టు... కలలో కనిపించే వస్తువుల్లా... ఈ ప్రపంచం ఊహాజనితం. ఈ ద్వివిధ సత్య సిద్ధాంత ప్రతిపాదనలో నాగార్జునుడు కీలక పాత్రను పోషించాడు. ఆ తరువాత మిగిలిన అద్వైతాది తాత్వికులు ఈ సిద్ధాంతంపై తమ జగన్మిథ్యావాదాన్ని నిర్మించారు.

ఈ ప్రపంచం ఏమిటి? ఇది కేవలం అసంపూర్ణ సంబంధాల సమాహారం. పదార్థాలకు వాటి గుణాలు తప్ప స్వతంత్రమైన ఉనికి లేనట్టే... ఈ ప్రపంచం కూడా కేవలం సంస్కారాల కలయిక మాత్రమే. ఈ లోకంలో సుఖం, దుఃఖం, బంధం, మోక్షం, ఉత్పత్తి, వినాశం, చలనం, విశ్రాంతి, అంతరిక్షం, సమయం లాంటివి మన భావనలు మాత్రమే. మానవులు తమ అశాశ్వత సౌధాన్ని నిర్మించడం కోసం సృష్టించిన నిరాధారమైన ఊహే ఈ ప్రపంచం. ప్రపంచం బయటకు శాశ్వతంగా కనిపిస్తున్నా తార్కికంగా విశ్లేషించినప్పుడు అబద్ధమని తేలుతుంది. ప్రపంచంలోని ఈ సంబంధ బాంధవ్యాలు ఏదో ఒకనాడు ఇసుకలాగా రాలిపోతాయి. అయితే సమాజంలో సత్ప్రవర్తన చాలా అవసరం. ఆ సత్ప్రవర్తనే మోక్షాన్ని ప్రసాదిస్తుంది. దాని



కోసం సమాజాన్ని మనం నిలబెట్టాలి. ఈ విషయాలను 'మాధ్యమిక కారిక' గ్రంథంలో ఆచార్య నాగార్జునుడు చాలా స్పష్టంగా వివరించాడు. జగత్తు శక్తిని పరీక్ష చేసి, ఆ శక్తి ఉనికిని విశ్లేషించిన తరువాత... అది శూన్యరూపంలో ఉంటుందనే నిర్ధారణకు మాధ్యమికులు వచ్చారు. సృష్టి ఆవిర్భావాన్ని సరైన విచక్షణతో విశ్లేషిస్తే... దాని ఉనికిని నిరాకరించడం కుదరదు. కానీ 'అంతా ఉంది' అనుకోవడం ఒక తీవ్రత. 'అన్నీ లేవు' అనుకోవడం మరో తీవ్రత. ఈ రెండు తీవ్రతలనూ విడిచిపెట్టి... మధ్యమ మార్గంలో తన ధర్మాన్ని తథాగతుడు బోధించాడు.



ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు,
జేఎన్‌యు,
న్యూఢిల్లీ,
91 98189 69756

ఒలింపిక్స్‌కు 28 మంది భారత అథ్లెట్లు!

న్యూఢిల్లీ: ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ప్లేయర్ల జాబితాను వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) విడుదల చేసింది. ఆటోమేటిక్ క్వాలిఫికేషన్, ర్యాంక్‌ల ఆధారంగా రూపొందించిన లిస్టులో 28 మంది భారత అథ్లెట్లకు చోటు దక్కింది. కాగా, పారిస్ బెర్త్ పట్టేసిన 11 మంది మహిళల్లో తెలుగు ప్లేయర్లు జ్యోతి యర్రాజీ, జ్యోతిక శ్రీ దండి కూడా ఉండడం విశేషం. లాంగ్ జంపర్ జస్విన్ ఆల్‌డ్రిన్‌కు కూడా కొంత ఆలస్యంగా ఈ జాబితాలో చేరే అవకాశం ఉంది. ఒలింపిక్ అర్హత మార్క్‌ను అందుకొన్న లాంగ్ జంపర్ శ్రీశంకర్ గాయపడడంతో.. అతడి స్థానంలో జస్విన్‌కు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) అవకాశం కల్పించనుంది. 100 మీటర్ల హర్డిల్స్‌లో అర్హత సాధించిన తొలి భారత స్ప్రింటర్‌గా జ్యోతి ఘనత సాధించింది. మహిళల 4×400 రిలే జట్టులో జ్యోతికకు చోటు దక్కింది. జావెలిన్ త్రో వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా, కిశోర్ జనా నేరుగా అర్హత సాధించారు.

ఒలింపిక్ అథ్లెట్లతో మోదీ భేటీ: పారిస్ విశ్వక్రీడల్లో తలపడే షూటర్లు, ఆర్చర్లు, ట్రాక్, ఫీల్డ్ అథ్లెట్లు, సహాయ సిబ్బందితో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం భేటీ అయ్యారు. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య క్రీడా శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, పారిస్ బరిలో దిగుతున్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, రెండుసార్లు విశ్వక్రీడల పతక విజేత పీవీ సింధుతో మోదీ వర్చువల్‌గా సంభాషించారు.







విశ్వవిజేత విజయయాత్ర

జనసంద్రంగా మారిన మెరీన్ డ్రైవ్
రోహిత్ సేనకు ఘనస్వాగతం
రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ బహూకరణ

వచ్చేశారు.. 13 ఏళ్ల విరామం తర్వాత దక్కిన వరల్డ్‌కప్‌తో సగర్వంగా టీమిండియా ఆటగాళ్లు భారత గడ్డపై అడుగుపెట్టారు.. ఇక క్రికెట్‌నే మతంగా భావించే క్రీడాభిమానులు ప్రశాంతంగా ఎలా ఉండగలరు? వయస్సుతో సంబంధం లేదు.. చిన్నా, పెద్దా తేడా లేదు.. ఓ అత్యద్భుత విజయంతో తమ హృదయాలను ఉప్పొంగించిన క్రికెట్ హీరోలకు అదే రీతిలో గ్రాండ్ వెల్కమ్ పలికారు. ముందుగా న్యూఢిల్లీ, ఆ తర్వాత ముంబై ఇలా ఎక్కడికి వెళ్లినా అపూర్వ స్వాగతంలో వారిని మైమరిపించారు. గురువారం ఉదయం న్యూఢిల్లీలో రోహిత్ సేన ప్రధానిని కలిశాక.. విక్టరీ పరేడ్ కోసం సాయంత్రం ముంబైకి చేరుకుంది. అప్పటికే స్థానిక నారిమన్ పాయింట్ ఓ వైపు అరేబియా సముద్రం.. మరోవైపు అభిమాన జనసంద్రం అన్నట్టుగా మారిపోయింది. ఓపెన్ టాప్‌బస్‌లో సాగిన క్రికెటర్ల విక్టరీ పరేడ్ వాంఖడేలో ప్రేక్షకుల మధ్య భారీ నజరానా అందజేతతో ముగిసింది.



ముంబై: టీ20 ప్రపంచకప్ విజేత టీమిండియాకు భారత క్రికెట్ అభిమానులు నభూతో.. అనే రీతిలో స్వాగతం పలికారు. ఓ వైపు చిరుజల్లులు కురిసినా.. షెడ్యూల్ ప్రకారం ముంబైకి ఆటగాళ్ల రాక ఆలస్యమైనా గంటలకొద్దీ ఓపిగ్గా ఎదురుచూశారు. విక్టరీ పరేడ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు నారీమన్ పాయింట్‌లోని మెరీన్ డ్రైవ్ మధ్యాహ్నం నుంచే వేలాది మందితో కిక్కిరిసిపోయింది. వారిని చూసి చాంపియన్స్ జెర్సీ ధరించిన ఆటగాళ్లు సైతం తమ బడలికను మర్చిపోయి పులకించిపోయారు. సుదీర్ఘ ప్రయాణం తర్వాత కూడా గురువారం రోజంతా టీమిండియా ఆటగాళ్లు ఊపిరి సలపని బిజీ షెడ్యూల్‌తో ఎలా గడిపారో ఓసారి పరిశీలిద్దాం..

రోహిత్, సూర్య బల్లె.. బల్లే

బార్బడోస్ నుంచి 16 గంటల నాన్‌స్టాప్ ప్రయాణం తర్వాత ఉదయం 6 గంటలకు జట్టు న్యూఢిల్లీ విమానాశ్రయంలో దిగింది. అప్పటికే రాత్రి నుంచే వందలాది మంది అభిమానులు వారికోసం నిరీక్షిస్తూ కనిపించారు. ట్రోఫీతో కెప్టెన్ రోహిత్ విమానం నుంచి బయటికి రాగా బోర్డు కార్యదర్శి జైషా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికాడు. అక్కడే కేక్‌ను కట్ చేసి రెండు బస్సుల్లో ఆటగాళ్లంతా దారిపొడవునా అభిమానులకు అభివాదం తెలుపుతూ స్థానిక ఐటీసీ మౌర్య హోటల్‌కు చేరారు. ఈ క్రమంలో అక్కడ భాంగ్రా కళాకారులతో రోహిత్ కూడా సరదాగా నృత్యం చేస్తూ ఉత్సాహంగా కనిపించాడు. అతడితో పాటు సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, పంత్ కూడా జత కలిశారు.

వడాపావ్.. చోలే బటూరే

హోటల్ సిబ్బంది ఆటగాళ్ల కోసం ప్రత్యేక అల్పాహారాన్ని సిద్ధం చేశారు. ముంబైకర్ రోహిత్‌కు ఎంతో ఇష్టమైన వడా పావ్.. విరాట్‌కు నచ్చే అమృత్‌సర్ స్టయిల్ చోలే బటూరేని అల్పాహారంగా అందించారు. అలాగే ప్లేయర్ల గదులను అలంకరించడంతో పాటు చాక్లెట్‌తో బాల్స్, బ్యాట్, పిచ్‌ను తయారుచేశారు.

ప్రధానితో భేటీ

ప్రధాని మోదీతో సమావేశమయ్యేందుకు ఆటగాళ్లంతా ప్రత్యేక బస్సులో ఉదయం 11 గంటలకు 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌కు చేరుకున్నారు. దాదాపు 2 గంటల పాటు వీరి భేటీ సాగింది. అనంతరం హోటల్ నుంచి మధ్యాహ్నం ముంబైకి వెళ్లేందుకు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరారు.

ముంబై ఎయిర్‌పోర్ట్‌లో గార్డ్ ఆఫ్ ఆనర్

సాయంత్రం చిర్లు జల్లుల మధ్యే ముంబై ఛత్రపతి విమానాశ్రయంలో ఆటగాళ్లకు అపూర్వ స్వాగతం లభించింది. విస్తారా ఎయిర్‌క్రాఫ్ట్ రన్‌వేపై దిగగానే మూడు ఎస్కార్ట్ వాహనాలు గార్డ్ ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికాయి. వీటి వెనకాల విమానం నెమ్మదిగా ముందుకు సాగింది. ఇక టెర్మినల్ దగ్గరకు రాగానే విమానానికి ఇరు వైపులా ఉన్న రెండు ఫైరింజన్లు వాటర్ సెల్యూట్ ఇచ్చాయి. ఆ తర్వాత విమానాశ్రయంలో కేక్ కట్ చేశాక రెడ్ కార్పెట్‌పై నడుచుకుంటూ రోహిత్ బృందం బయటికి వచ్చింది.

జనసంద్రం..

ముంబైలో ఆటగాళ్లు దిగడానికి గంటల ముందే అభిమానుల సంబరాలు ఆరంభమయ్యాయి. పరేడ్ జరిగే నారిమన్ పాయింట్ నుంచి వాంఖడే స్టేడియం వరకు కిలో మీటర్ దూరంలో ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో నిండిపోయింది. చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు సైతం అక్కడ గుమిగూడి త్రివర్ణ పతాకాలను రెపరెపలాడించారు. ఇక ఉచిత ప్రవేశం కల్పించిన వాంఖడే స్టేడియం మధ్యాహ్నమే నిమిషాల వ్యవధిలో నిండిపోయింది.

ఉత్సాహంగా విక్టరీ పరేడ్

ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక బస్సులో హోటల్‌కు వెళ్లిన జట్టు కాస్త సేద తీరాక నారిమన్ పాయింట్‌లోని ఎన్‌సీపీఏ ఆఫీసుకు చేరుకుంది. షెడ్యూల్‌కన్నా రెండు గంటల ఆలస్యంగా రాత్రి 7.40కి అక్కడి నుంచి వాంఖడేకు విక్టరీ పరేడ్ ఆరంభమైంది. వేలాదిమంది అభిమానుల మధ్య గంటన్నరపాటు సాగింది. తమ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న అభిమానులకు అంతే ఉత్సాహంగా రోహిత్, విరాట్, హార్దిక్, సూర్యకుమార్, సిరాజ్, జడేజా ఇలా అందరూ అభివాదం చేస్తూ ఓపెన్ టాప్ బస్సులో ముందుకుసాగారు. ఇక రోహిత్, కోహ్లీ ఇద్దరూ కలిసి ఫ్యాన్స్‌కు ట్రోఫీని చూపించడంతో ఒక్కసారిగా మెరీన్ డ్రైవ్ హోరెత్తిపోయింది. అలాగే తమ అభిమాన క్రికెటర్లను సెల్‌ఫోన్లలో బంధించేందుకు వారు కూడా పోటీపడ్డారు.


హార్దిక్.. హార్దిక్

వాంఖడేలో హార్దిక్ పాండ్యాకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. ఫైనల్లోనే కాకుండా టీ20 ప్రపంచకప్‌లో తను మెరుగైన ఆటతీరుతో విజయంలో కీలకమయ్యాడు. దీంతో ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ విషయంలో ఎక్కడైతే ఎగతాళికి గురయ్యాడో, అదే చోట హార్దిక్.. హార్దిక్ అని గర్వంగా పిలిపించుకోగలిగాడు.

వాంఖడేలో చిందులు

వేలాదిమంది హర్షధ్వానాల మధ్య సాగిన పరేడ్ దాదాపు గంటన్నర తర్వాత వాంఖడే స్టేడియానికి చేరింది. అప్పటికే 34వేల మందితో నిండిన స్టేడియం చప్పట్లు, డీజే సాంగ్స్‌తో మార్మోగిపోయింది. ముంబై కా రాజా కౌన్?.. రోహిత్ శర్మ అంటూ నినాదాలు చేశారు. ఆ అద్భుత దృశ్యాన్ని చూసిన టీమిండియా ఆటగాళ్లు సైతం ఉప్పొంగిపోయారు. అంతే.. రెట్టించిన ఉత్సాహంతో కెప్టెన్ రోహిత్, విరాట్, హార్దిక్, సూర్య, అర్ష్‌దీప్, పంత్, జడేజా, శాంసన్, అక్షర్ తమ డ్యాన్స్‌తో ఫ్యాన్స్‌కు మరింత హుషారు తెచ్చారు.

ప్రైజ్‌మనీ



కప్ గెలవగానే భారత క్రికెట్ జట్టుకు బీసీసీఐ రూ.125 కోట్ల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. వాంఖడేలో ఇందు కోసం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్టేడియం మధ్యలో చిన్న వేదికను ఏర్పాటు చేసి మధ్యలో ఓ స్టాండ్‌పై టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీని ఉంచింది. ఆ తర్వాత బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జైషా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కలిపి రోహిత్ బృందానికి చెక్‌ను అందించారు. తర్వాత అందరూ కలిసి స్టేడియం చుట్టూ విక్టరీ ల్యాప్ తీసి భావోద్వేగాలతో అభివాదం చేస్తూ తమ సంబరాలను ముగించారు.





చాంపియన్లతో.. సందడే.. సందడి..!

ప్రధానిని కలిసిన టీమిండియా.. అనుభవాలను గుర్తు చేసుకొన్న ప్లేయర్లు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్ చాంపియన్ టీమిండియా గురువారం ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుంది. బార్బడోస్ నుంచి ఉదయమే ఢిల్లీ చేరుకొన్న రోహిత్ సేన.. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన 'చాంపియన్స్' జెర్సీ ధరించి ప్రధాని నివాసానికి వెళ్లారు. ఆయనతో కలసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా 11 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సాధించిన భారత జట్టుకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. ఒకదశలో ఉత్కంఠకు లోనైనా.. అద్భుత పోరాటంతో విజేతలుగా నిలిచారని ప్రశంసించారు. సుమారు రెండు గంటలపాటు క్రికెటర్లతో గడిపిన మోదీ.. రోహిత్, కోచ్ రాహుల్ ద్రవిడ్, కోహ్లీ, రిషభ్ పంత్ ఇలా ప్రతి ఒక్క భారత ఆటగాడితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన జోక్‌లకు క్రికెటర్లు పగలబడి నవ్వారు. ప్రధాని పంచ్ డైలాగ్‌లకు విరాట్ చేతులతో ముఖాన్ని దాచుకొని నవ్వుతూనే ఉన్నాడు. 'మన చాంపియన్లతో అద్భుతమైన సమావేశం. ఉదయం ఏడు గంటలకు వరల్డ్‌కప్ విన్నింగ్ టీమ్‌కు ఆతిథ్యం. టోర్నీ ఆసాంతం వారికి ఎదురైన అనుభవాల గురించి మాట్లాడుకోవడం గొప్ప జ్ఞాపకం' అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. జట్టు సభ్యులతో దిగిన ఫొటోలను షేర్ చేశారు. గ్రూప్ ఫొటోలో ప్రధానికి ఇరువైపులా రోహిత్, ద్రవిడ్ నిలబడి ఉన్నారు. మిగతా ప్లేయర్లు కూడా మోదీ వ్యక్తిగతంగా తీయించుకొన్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. భార్య సంజనతో ప్రధానికి కలసిన ఫొటోను బుమ్రా షేర్ చేశారు. ఈ సందర్భంగా బుమ్రా కొడుకు అంగద్‌ను మోదీ ఎత్తుకొన్నారు. తనను ఆత్మీయంగా ప్రధాని హత్తుకొన్న ఫొటోను కుల్దీప్ పోస్టు చేశాడు. ఇక, తల్లిదండ్రులతో కలసి మోదీతో దిగిన ఫొటోను అర్ష్‌దీప్ సింగ్ ఎక్స్‌లో పెట్టాడు. 'ప్రధాని మోదీని కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ గృహానికి మమ్మల్ని ఆహ్వానించినందుకు ధన్యవాదాలు' అని కోహ్లీ నెట్‌లో పోస్టు చేశాడు. ఆటగాళ్లతో మోదీ మాట్లాడుతున్న వీడియోను ప్రధాన మంత్రి కార్యాలయం షేర్ చేసింది.

బహుమతిగా 'నమో' జెర్సీ..

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా ప్రత్యేకంగా తయారు చేయించిన 'నమో నెం:1' జెర్సీని ప్రధానికి బహూకరించారు. రెండు వరల్డ్‌కప్‌లు సాధించాం అన్నట్టుగా రెండు స్టార్లు కూడా ముద్రించారు.

ట్రోఫీని పట్టుకోని మోదీ..

ట్రోఫీతో కలసి భారత జట్టు దిగిన గ్రూప్ ఫొటోలో వరల్డ్ కప్ ట్రోఫీని ప్రధాని పట్టుకోక పోవడం అందరి దృష్టినీ ఆకర్షించింది. తనకు ఇరువైలా ఉన్న రోహిత్, ద్రవిడ్ ట్రోఫీని పట్టుకొంటే.. మోదీ వారి చేతులను పట్టుకొన్నారు. నాదేమీ లేదు.. మీవల్లే ఈ గౌరవం, ఆనందం అని చాటి చెప్పడానికే మోదీ ఇలా చేసి ఉంటారని నెటిజన్లు అంటున్నారు.



మట్టి రుచి ఎలా ఉంది..

టోర్నీలో అద్భుత ప్రయాణం గురించిన అనుభవాలను పంచుకోవాలని మోదీ కోరారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ అనుభూతి ఎలా ఉందో చెప్పాలన్నారు. మ్యాచ్ నెగ్గిన తర్వాత రోహిత్.. బార్బడోస్ పిచ్ మట్టిని రుచి చూశాడు. ఆ సందర్భాన్ని ప్రస్తావిస్తూ 'మట్టి రుచి ఎలా ఉంది?' అని రోహిత్‌ను మోదీ అడిగారు. టోర్నీ ఆసాంతం పెద్దగా పరుగులు సాధించని కోహ్లీని ఫైనల్ గురించి ఎలా ఆలోచించావని ప్రశ్నించారు. ఇక, జట్టు క్లిష్టపరిస్థితిలో ఉన్నప్పుడు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా పంపడం ఎలా అనిపించిందని అక్షర్ పటేల్‌ను అడిగారు.

స్వియటెక్ ముందంజ

వింబుల్డన్



లండన్ : ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వింబుల్డన్‌లో ముందంజ వేశాడు. మహిళల్లో టాప్ సీడ్ స్వియటెక్ మరో సునాయాస విజయం దక్కించుకోగా, ఐదో సీడ్ జెస్సికా పెగులా రెండో రౌండ్‌నుంచే తిరుగుముఖం పట్టింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో రెండో సీడ్ జొకో 6-3, 6-4, 5-7, 7-5తో స్థానిక యువ ఆటగాడు జాకబ్ ఫెర్న్లీపై విజయం సాధించాడు. ఇక దిమిత్రోవ్ (బల్గేరియా) 5-7, 6-7 (7), 6-4, 6-2, 6-4తో చెంగ్ (చైనా)పై గెలిచి మూడో రౌండ్ చేరాడు. ఆర్థర్ ఫిల్స్ (ఫ్రాన్స్)తో రెండో రౌండ్‌లో 6-7 (7), 4-6, 6-2, 6-6తో ఉన్న దశలో గాయంతో ఏడో సీడ్ హుర్కాజ్ వాకోవర్ ఇచ్చాడు. మహిళల రెండో రౌండ్‌లో స్వియటెక్ 6-4, 6-3తో పెట్రా మార్టిక్‌ను వరుస సెట్లలో చిత్తు చేసింది. చైనాకు చెందిన అన్‌సీడెడ్ వాంగ్ షిన్ యూ 6-4, 6-7 (9), 6-1తో పెగులా (అమెరికా)కు షాకిచ్చింది.

యుకీ జోడీ శుభారంభం..బాలాజీ నిష్క్రమణ..

పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రి జోడీ బోణీ కొట్టింది. గురువారం జరిగిన మొదటి రౌండ్‌లో యుకీ/అల్బనో ఒలివేటి (ఫ్రాన్స్) ద్వయం 6-4, 6-4తో కజకిస్థాన్ జోడీ అలెగ్జాండర్ బబ్లిక్/అలెగ్జాండర్ షెవ్‌చెంకోను చిత్తు చేసింది. శ్రీరామ్ బాలాజీ/జాన్సన్ (బ్రిటన్) జంట 4-6, 5-7తో నాలుగో సీడ్ మార్సెలో (సాల్వడార్), పవిక్ (క్రొయేషియా) ద్వయంలో చేతిలో మొదటి రౌండ్‌లో పరాజయం చవిచూసింది.

పొట్టి సిరీస్‌నూ పట్టేయండి!

సౌతాఫ్రికాతో నేడు తొలి టీ20



రా. 7.30 నుంచి స్పోర్ట్స్ 18లో..

చెన్నై : మూడు వన్డేల సిరీస్ క్లీన్‌స్వీప్..ఆనక ఏకైక టెస్టులో పది వికెట్లతో ఘన విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ సేన జోరు అలా..ఇలా..లేదు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో చెన్నైలో జరిగే మూడు టీ20ల సిరీస్‌నూ పట్టేయాలని పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా మొదటి మ్యాచ్ శుక్రవారం జరగనుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అదరగొడుతున్న భారత్‌ను ఈ సిరీస్‌లో అడ్డుకోవడం సఫారీలకు సవాలే. మరోవైపు..పొట్టి సిరీస్‌ను దక్కించుకోవడం ద్వారా ఈనెల 19 నుంచి శ్రీలంకలో జరిగే ఆసియా కప్ టీ20 టోర్నీకి ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భారత్ భావిస్తోంది. అలాగే అక్టోబరులో బంగ్లాదేశ్ వేదికగా నిర్వహించే పొట్టి ప్రపంచ కప్‌కూ ఈ సిరీస్‌ను సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. వైస్-కెప్టెన్ మంధాన వన్డే సిరీస్‌లో అద్భుతంగా ఆడింది. మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీతో అదరగొట్టింది. ఆఖరి వన్డేలో శతకంతో హర్మన్ కూడా ఫామ్‌లో కొచ్చింది. వన్డే సిరీస్‌లో విఫలమై ఆందోళన కలిగించిన డ్యాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మ..టెస్ట్ మ్యాచ్‌లో ఏకంగా రికార్డు డబుల్ సెంచరీతో ఊరటనిచ్చింది. జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ కూడా టెస్టులో సత్తా చాటడంతో భారత బ్యాటింగ్ తిరుగులేని స్థితిలో ఉంది. రేణుకా సింగ్, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్‌తో పేస్, దీప్తిశర్మ, రాధా యాదవ్, ఆశా శోభనతో స్పిన్ విభాగం బలీయంగా ఉంది. మరోవైపు సౌతాఫ్రికా బ్యాటింగ్ భారాన్నంతా కెప్టెన్ లారా వోల్వార్డ్ మోస్తోంది. వన్డే, టెస్టులో ఒక్కో శతకంతో ఆమె ఆదుకోపోయి ఉంటే ఆ జట్టు పరిస్థితి దారుణంగా ఉండేది. టీ20 సిరీస్‌లో పోటీ ఇవ్వాలంటే వోల్వార్డ్ రాణించడంతోపాటు బాష్, కాప్, లుస్ తదితర బ్యాటర్లూ తలోచేయి వేయాల్సి ఉంటుంది.

భళా.. బోధన

చెస్‌లో తొమ్మిదేళ్ల చిన్నారి చరిత్ర
ఇంగ్లండ్‌కు ఆడనున్న భారత సంతతి బాలిక

లండన్ : తొమ్మిదేళ్ల బోధన శివానందన్ చెస్‌లో చరిత్ర సృష్టించనుంది. భారత సంతతికి చెందిన ఈ చిన్నారి ఇంగ్లండ్ తరఫున ఏ క్రీడలోనైనా అత్యంత పిన్నవయస్సులో అంతర్జాతీయ పోటీల బరిలో దిగనున్న ప్లేయర్‌గా రికార్డు సృష్టించనుంది. లండన్‌లోని హారోకి చెందిన బోధన వచ్చే సెప్టెంబరులో బుడాపెస్ట్‌లో జరిగే చెస్ ఒలింపియాడ్‌లో ఇంగ్లండ్ మహిళల జట్టు తరఫున ఆడనుంది. ఆ జట్టులోని ఇతర సభ్యులంతా 20, 30, 40 సంవత్సరాల వయస్సు వారు కావడం గమనార్హం. బోధన వంటి చెస్ చిచ్చర పిడుగును తానింత వరకు చూడలేదని..ఇంగ్లండ్ చెస్ జట్టు మేనేజర్ మాల్కమ్ పీన్ కితాబిచ్చాడు. కరోనా సమయంలో చెస్ పట్ల బోధన ఆకర్షితురాలైంది. కొద్దికాలంలోనే ఆటలో పట్టు సాధించిన ఆమె..గత డిసెంబరులో క్రొయేషియాలో జరిగిన యూరోపియన్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడం విశేషం.

జమ్మేకు రజావత్ షాక్

కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్

కాల్గరీ (కెనడా) : భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ సంచలనం సృష్టించాడు. కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థి రాస్మస్ జెమ్కేకు షాకిచ్చాడు. బుధవారం రాత్రి జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో వరల్డ్ నెం. 39 రజావత్ 17-21, 21-16, 21-14తో ఎనిమిదో సీడ్ జెమ్కే (డెన్మార్క్)ను చిత్తు చేశాడు. ఇతర మొదటి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆయుష్ షెట్టి 14-21, 11-21తో ఆరో సీడ్ కోకి వతనాబె (జపాన్) చేతిలో, శంకర్ ముత్తుస్వామి 16-21, 17-21తో అలెక్స్ లానీర్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో అనుపమా ఉపాధ్యాయ 21-11, 21-11తో రాచెల్ డరాగ్ (ఐర్లాండ్)పై నెగ్గి రెండో రౌండ్‌లో ప్రవేశించింది.

ఢిల్లీ టూర్‌లో బాబు బిజీ.. బిజీ


కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు వర్మ, పెమ్మసాని, టీడీపీ ఎంపీలు


16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియాతో సీఎం చంద్రబాబు


పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి పుష్పగుచ్ఛం ఇస్తూ..


కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను సత్కరిస్తూ..


వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌తో..


కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తూ..

జనసేనాని సూర్యారాధన

▸▸ ప్రజాక్షేమం కోరుతూ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వారాహి ఏకాదశ దిన దీక్షలో ఉన్న ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. ఈ దీక్షలో భాగంగా సూర్యారాధన చేశారు. సమాజ క్షేమాన్ని, దేశ సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన ఆదిత్యుడిని ఆరాధించారు. దీక్షాబద్ధులై ఆదిత్య యంత్రం ఎదుట ఆసీనులైన పవన్ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సూర్య భగవానుడికి పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మశ్రీ కోసిగంటి సుధీర్ శర్మ, హరనాథ శర్మ, వేణుగోపాల శర్మ ఈ ఆరాధన విశిష్టతను పవన్‌కు వివరించారు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన జనసేన నేత పి.హరిప్రసాద్.. గురువారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో పవన్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జగన్ నిర్లక్ష్యంతో ఆగిన గుడ్లు

▸▸ ఎగ్, చిక్కీల కాంట్రాక్టర్లకు 178 కోట్ల బకాయిలు

▸▸ బకాయిలు చెల్లిస్తాం.. సరఫరాకు సహకరించండి: మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం సరఫరా దారులకు భారీగా బకాయిలు పేరుకుపోయాయి. ఎగ్స్ సరఫరా చేసే కాంట్రాక్టర్లకు రూ.112 కోట్లు, చిక్కీల కాంట్రాక్టర్లకు రూ.66 కోట్లు గత ప్రభుత్వం బకాయి పెట్టింది. దీంతో తాజాగా కాంట్రాక్టర్లు కొన్ని ప్రాంతాల్లో గుడ్ల సరఫరాను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ గురువారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీగా బకాయిలు ఉండటం వల్లే సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయని అధికారులు మంత్రికి వివరించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ స్థాయిలో బకాయిలు ఎందుకు ఉన్నాయని అధికారులను లోకేశ్ ప్రశ్నించారు. గతేడాది డిసెంబరు నుంచి గుడ్ల కాంట్రాక్టర్లకు, ఆగస్టు నుంచి చిక్కీల కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారని అధికారులు వివరించారు. పిల్లలకు ఎక్కడా గుడ్లు, చిక్కీల పంపిణీ ఆగకూడదని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. త్వరలోనే బకాయిలు విడుదల చేస్తామని, సరఫరాకు సహకరించాలని కాంట్రాక్టర్లను కోరారు. అలాగే ఉన్నత విద్య పరిధిలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు రూ.3,480 కోట్లు గత ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ఇటీవల సమీక్షలో అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుత కాంట్రాక్టర్లను గత ప్రభుత్వమే ఎంపిక చేసింది. టెండర్లు లేకుండా నేరుగా కాంట్రాక్టులు కట్టబెట్టింది. చిక్కీల కాంట్రాక్టర్లకు రెండేళ్లుగా టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిపై కాంట్రాక్టును పొడిగిస్తూ వచ్చింది. అప్పటి విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చక్రం తిప్పి టెండర్లు లేకుండా చేశారు. టెండర్లకు వెళ్తే రేటు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ పాత కాంట్రాక్టర్లకు పాత రేటుపై కాంట్రాక్టు పొడిగించారు. మధ్యాహ్న భోజన పథకం అధికారులు, పాఠశాల విద్యాశాఖ అధికారులు దీనిపై ప్రశ్నించకుండా అప్పటి ప్రభుత్వానికి సహకరించారు. కాంట్రాక్టర్లకు బొత్సతో ఉన్న సాన్నిహిత్యం వల్లే ఇప్పుడు సరఫరా ఆపేసినట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పరిశ్రమలతో కలిసి ప్రణాళిక

▸▸ యువతకు ఉపాధి అవకాశాల పెంపుపై లోకేశ్ సమీక్ష

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలతో కలిసి పనిచేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధిపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను స్థానికంగా ఉన్న దేశీయ, విదేశీ పరిశ్రమలతో అనుసంధానం చేసి, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అమరావతిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సెంటర్, మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పేందుకు సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలను పెంచేందుకు విభాగాల వారీగా ప్రణాళికలు ఇవ్వాలన్నారు. విదేశాల్లో ఉపాధి కల్పనపై కేరళ రాష్ట్ర విధానాలను అధ్యయనం చేయాలన్నారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

▸▸ అబుదాబి సంస్థ ఎంఎఫ్-2 ప్రతినిధులతో మంత్రి సత్యకుమార్ భేటీ

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని అబుదాబికి చెందిన ఎంఎఫ్-2 సంస్థ ప్రతినిధులకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీలో ఆ సంస్థ ప్రతినిధులతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. ఎంఎఫ్-2 సంస్థకు జీనోమిక్స్, పర్యావరణ మెడ్‌టెక్, బయోటెక్ విభాగాల్లో అపారమైన అనుభవముంది. ఏపీలో బల్క్ డ్రగ్ పార్క్ మొదటి స్థానంలో ఉన్న విషయాన్ని, అలాగే సుమారు 170 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఏపీ మెడ్‌టెక్ జోన్, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మూడు ఎకనమిక్ జోన్లలో పెట్టుబడులు పెట్టేందుకు మెండుగా ఉన్న అవకాశాలను ఎంఎఫ్-2 సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని, సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తామని, అవసరమైన రాయితీల్ని కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. ఎకనమిక్ కారిడార్లు, మెడ్‌టెక్ జోన్‌లలో ఎంఎఫ్-2 ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటన చేశాక, పలు దఫాలుగా చర్చించిన తర్వాత ఆ సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

రైతులకు 1000 కోట్లు విడుదల

▸▸ ఎండీయూ వాహనాలపై సరైన నిర్ణయం: మంత్రి నాదెండ్ల

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించకుండా వదిలేసిన పాత బకాయిలను కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. గత వ్యవసాయ సీజన్‌లో సేకరించిన ధాన్యానికి రూ.1,659 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. అందులో తొలి విడతగా రూ.1,000 కోట్లను కొత్త ప్రభుత్వం విడుదల చేసింది. ముందుగా ఏ రైతుల నుంచి ధాన్యం సేకరించారో ఆ క్రమంలోనే (ఫస్ట్ కమ్ ఫస్ట్) బకాయిలు చెల్లిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది రైతులకు బకాయిలు చెల్లిస్తున్నామని వివరించారు. మిగిలిన రూ.659 కోట్ల బకాయిలను కూడా త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. విజయవాడలోని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం రైతులకు కూడా సకాలంలో సొమ్ములు చెల్లించకుండా రూ.1,659 కోట్ల వరకు బకాయిలు పెట్టింది. మరోవైపు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లోకి వైసీపీ నేతలు చొరబడి ఏకంగా రూ.36,300 కోట్లమేర అప్పుల్లోకి నెట్టేశారు. ఈ విషయాలన్నింటినీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన పెద్దమనసుతో రూ.1,000 కోట్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని చెప్పారు" అని మంత్రి వివరించారు. కాకినాడ పోర్టును అడ్డాగా చేసుకుని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం చేసిన దోపిడీ మామూలు వ్యవహారం కాదని, కాకినాడ పోర్టు నుంచే భారీ నెట్‌వర్క్‌తో బియ్యం మాఫియాను విస్తరింపజేశారని అన్నారు. పేదల పొట్టగొట్టి దోపిడీకి పాల్పడినవారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని అన్నారు. 2027 వరకు కాంట్రాక్ట్ కుదుర్చుకున్న ఎండీయూ వాహనాల వల్ల సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌పై వేల కోట్ల భారం పడుతోందని, దీనిపై భాగస్వామ్య పక్షాలతో చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ఆదుకోండి..!

(మొదటి పేజీ తరువాయి)

విభజిత రాష్ట్రం ఇప్పటికీ అనుభవిస్తోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. పులిమీద పుట్రలాగా గత ఐదేళ్లలో జగన్ దుర్మార్గమైన, దుష్టపాలనలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని, రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే ఎక్కువ విఘాతం ఆయన పాలన వల్లే జరిగిందని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వానికి వ్యూహాత్మక దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలంటూ లేకపోవడం.. దుందుడుకు విధానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా దిగజారిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వనరుల లోటు తీవ్రంగా ఉందని వివరించారు. 'జీతాలు, పింఛన్లు, అప్పుల చెల్లింపు వంటి ఖర్చులు తప్పవు. ఇవి రాష్ట్ర రెవెన్యూ వసూళ్లను మించిపోయాయి. దీనివల్ల ఉత్పాదక మూలధన పెట్టుబడులకు నిధులే లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. భవిష్యత్ ఎక్సైజ్ ఆదాయాలను, ప్రభుత్వ భవనాలను కూడా తాకట్టు పెట్టి విచ్చలవిడిగా అప్పులు తెచ్చారు. నిధులను పెద్ద ఎత్తున మళ్లించారు. దీంతో వనరులకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఆర్థికంగా చేయూతనివ్వడం తప్ప గత్యంతరం లేదు. అప్పుడే ఈ సవాళ్లను ఎదుర్కోగలం' అని పేర్కొన్నారు.

అన్ని విధాలుగా సాయం: మోదీ

చంద్రబాబు వినతులకు ప్రధాని సానుకూలంగా స్పందించారు. ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడతామని.. రాజధాని అమరావతి సహా రాష్ట్ర పునర్నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. ప్రధానితో సమావేశం పూర్తి సంతృప్తి ఇచ్చిందన్నారు. మోదీ నాయకత్వంలో రాష్ట్రం పవర్ హౌస్‌గా ఆవిర్భవిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానితో నిర్మాణాత్మకంగా సమావేశం జరిగిందని, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించానని తెలిపారు.

పీయూష్ గోయల్‌తో భేటీ అంశాలు..

- పరిశ్రమలకు నీరు, విద్యుత్, రైల్వే, రహదారుల కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు గ్రాంట్ల రూపంలో ఆర్థిక సాయం అందించాలి.
- కేంద్రం ఆధీనంలోని ఓడరేవు ఆధారిత ఉప్పు భూములను రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం రిజిస్టర్డ్ విలువకే అప్పగించాలి.

వికసిత్ ఆంధ్రకు కట్టుబడిఉన్నాం: అమిత్‌షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ఆరుగురు కేంద్ర మంత్రులతో కూడా సీఎం సమావేశమయ్యారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి వారంతా సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అమిత్ షా, చంద్రబాబు దాదాపు అర గంట సేపు కీలక సమాలోచనలు జరిపారు. దేశం, రాష్ట్రాభివృద్ధికి సంబంధించి అనేక అంశాలను ముఖ్యమంత్రితో చర్చించానని హోం మంత్రి ట్వీట్ చేశారు.

రాజధాని నిర్మాణానికి సహకరించండి..

రాజధాని అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు సహకరించాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను చంద్రబాబు కోరారు. ఏపీకి సంబంధించి పలువురు జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి సీఎంతో విస్తృతంగా చర్చించానని కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఏపీ తన శక్తి సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకునేందుకు సంసిద్ధంగా ఉందని.. రాష్ట్రాన్ని సుసంపన్నమైన, అభివృద్ధి బాటలో తీసుకెళ్లగలమనే విశ్వాసం తనకుందని చంద్రబాబు తెలిపారు. వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తో జరిపిన భేటీలో సహకార సమాఖ్య స్ఫూర్తితో చర్చలు జరిగాయన్నారు. కేంద్ర వ్యవసాయ శివరాజ్ సింగ్ చౌహాన్, పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పురీతో కూడా ఆయన సమావేశమయ్యారు. ఉదయం పీయూష్ గోయల్‌తో అల్పాహార విందు సమావేశంతో తన షెడ్యూల్‌ను ప్రారంభించిన చంద్రబాబు.. సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశాలు నిర్వహించారు. రాత్రికి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మాజీ అధికారులకు విందు ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.



గడ్కరీతో చర్చించినవి ఇవీ..

- 2018లో రాజధాని ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. దీని పనులు త్వరితగతిన చేపట్టాలి. ఈ ప్రాజెక్టు అమరావతిపై అత్యంత ప్రభావం చూపుతుంది.
- హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు జాతీయ రహదారిని 6 లేదా 8 లైన్లుగా విస్తరించాలి.
- హైదరాబాద్ నుంచి అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను అభివృద్ధి చేయాలి.
- విజయవాడకు తూర్పున బైపాస్ నిర్మాణాన్ని చేపట్టాలి. ఇది సిటీలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుంది. ప్రస్తుతం డీపీఆర్‌ను ఎన్‌హెచ్ఏఐ సిద్ధం చేస్తోంది. త్వరితగతిన డీపీఆర్‌ను ఆమోదించాలి.
- నాలుగు లేన్ల కుప్పం-హోసూరు-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాన్ని చేపట్టాలి.
- మూలపేట(భావనపాడు) నుంచి విశాఖపట్నం వరకు 4 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ హైవేను నిర్మించాలి.

నేడు నిర్మలా సీతారామన్‌తో భేటీ

చంద్రబాబు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమవుతారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆరోగ్య మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా, సామాజిక న్యాయ, సాధికారిక మంత్రి రాందాస్ అథవాలేతో పాటు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, జపాన్ రాయబారి సుజుకి హిరోషీలను కూడా కలుస్తారు. సాయంత్రం హైదరాబాద్ వెళ్తారు. శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం తర్వాత అమరావతికి బయల్దేరతారు.

అమిత్‌షాతో సీఎం చర్చించిన అంశాలు..

- గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి భూమి కోసం రూ.385 కోట్లు విడుదల చేయాలి. నిర్వహణ కోసం రూ.27.54 కోట్లు ఇవ్వాలి.
- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ఆస్తుల విభజన జరగాలి. షెడ్యూలు-10లోని సంస్థలు విభజించాలి. ఆ చట్టంలోని సెక్షన్ 47, 75 ప్రకారం రాష్ట్ర సంస్థల విభజన చేపట్టాలి.
- ఏపీ జెన్‌కో, తెలంగాణ డిస్కంల మధ్య ఆర్థిక సమస్యలు పరిష్కారించాలి.
- రాష్ట్ర ఐపీఎస్ కేడర్ సమీక్ష త్వరగా నిర్వహించాలి. రాష్ట్రానికి ఐపీఎస్‌ల పెంపు అంశం 2015 నుంచి పెండింగ్‌లో ఉంది. వారి సంఖ్యను 79 నుంచి 117కు పెంచే అవకాశం ఉంది.

ఖట్టర్‌తో మాట్లాడిన అంశాలు..

- కర్నూలు నుంచి విశాఖకు హెచ్‌వీడీసీ ఐఎస్‌టీఎస్ లైను అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి. నిబంధనలను సడలించాలి.
- విశాఖపట్నం-కాకినాడను గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ప్రమోట్ చేయాలి.

పెట్రోలియం మంత్రి పురీతో చర్చల అంశాలు..

- విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో బీపీసీఎల్ రిఫైనరీని ఏర్పాటు చేయాలి.
- పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటును వచ్చే బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించాలి.

వ్యవసాయ మంత్రి చౌహాన్‌తో భేటీ అంశాలు..

- రాష్ట్రానికి సమీకృత ఆక్వాపార్క్‌ను మంజూరు చేయాలి.
- ఉద్యాన పంటలను పండించే రైతులకు సబ్సిడీ పెంచాలి
- 2023-24 ఏడాదిలో ఆర్‌కేవీవై పథకం కింద రాష్ట్రానికి ఇవ్వాల్సిన కేంద్రం వాటా రూ.125.52 కోట్లు ఇవ్వాలి.
- రాష్ట్రంలో ఎంఐడీహెచ్ కార్యక్రమాలను అమలు చేయడానికి కేంద్రం వాటా రూ.165 కోట్లు, రాష్ట్ర మ్యాచింగ్ షేర్ రూ.110 కోట్లు కూడా కేటాయించాలి.
- ఎన్ఎంఓపీ పథకం కింద కేంద్రం వాటా రూ.11.29 కోట్లను విడుదల చేయాలి..

కలిశెట్టీ.. వెల్‌డన్!

గడ్కరీతో భేటీ అనంతరం బయటకు వచ్చిన సీఎం చంద్రబాబు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని మెచ్చుకున్నారు. నూతన లోక్‌సభ ప్రారంభ దినాన కలిశెట్టి సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లడాన్ని ప్రశంసించారు. వెల్‌డన్ అంటూ భుజం తట్టారు. టీడీపీ పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎవరూ పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లలేదని ఆయనతో అన్నారు.

అవును.. పిన్నెల్లి ఈవీఎం పగలగొట్టాడు!

▸▸ పోలింగ్ బూత్‌లో అన్యాయం జరుగుతోందని చెప్పడానికే: జగన్

▸▸ మంచోడు కాబట్టే 4 సార్లు గెలిచాడు

▸▸ అలాంటి వ్యక్తిని జైల్లో పెట్టారు

▸▸ రెడ్‌బుక్స్‌తో అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు

▸▸ రేపు మీ వాళ్లకూ అదే జరుగుతుంది

▸▸ చంద్రబాబుకు మాజీ సీఎం హెచ్చరిక

▸▸ నెల్లూరు జైలులో పిన్నెల్లితో ములాఖత్

▸▸ ఐదేళ్ల తర్వాత మీడియా ముందుకు


పిన్నెల్లిని చూసేందుకు జైలులోకి వెళుతున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

నెల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'పాల్వాయిగేటు వంటి సెన్సిటివ్ పోలింగ్ బూత్‌లో ఒకేఒక హోంగార్డును పెట్టి నడుపుతా ఉన్నారు. అటువంటి పరిస్థితుల్లో అన్యాయం జరుగుతా ఉందని చెప్పడం కోసం పిన్నెల్లి పోలింగ్ బూత్ లోకి వెళ్లి ఈవీఎం పగలగొట్టే కార్యక్రమం చేశారు. నిజంగానే రామకృష్ణారెడ్డి కనుక రిగ్గింగ్ చేసుకుంటా ఉంటే.. నిజంగా అక్కడ ఎమ్మెల్యే పరిస్థితి బాగానే ఉండిఉంటే ఎందుకు ఈవీఎం బద్దలు కొడతాడు' అని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈవీఎం కేసులో ఆయనకు బెయిల్ వచ్చిందని.. అయితే ఈ ఘటన జరిగిన పది రోజుల తర్వాత రామకృష్ణారెడ్డి ఆ బూత్‌లో హత్యాయత్నం చేసినట్లు కేసు నమోదు చేశారని.. నిజంగానే అటువంటిది జరిగి ఉంటే సిట్ తన రిపోర్టులో చెప్పాలి కదా అని వ్యాఖ్యానించారు. పిన్నెల్లి మంచోడు కాబట్టే వరుసగా 4సార్లు గెలిచారన్నారు. అటువంటి వ్యక్తిని తప్పుడు కేసుల్లో జైల్లో పెట్టారని ఆరోపించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ గురువారం ములాఖత్‌లో కలిశారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకున్న ఆయన.. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబులతో కలిసి జైలుకు వెళ్లారు. పిన్నెల్లితో 20 నిమిషాలు మాట్లాడారు. అనంతరం జగన్ జైలు వెలుపల మీడియాతో మాట్లాడారు. కారంపూడిలో మే 14న ఓ ఎస్సీ వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు పిన్నెల్లి బయల్దేరితే ఊరిబయటే అడ్డగించారని, హత్యాయత్నం కేసు పెట్టిన సీఐ నారాయణస్వామి అసలు పిన్నెల్లికి తారసపడలేదని చెప్పారు. ఆ సమయంలో కారంపూడి టౌన్‌లో గొడవ జరుగుతోందని, అక్కడ రెండు వర్గాలు రాళ్లు విసురుకున్న ఘటనలో సీఐకి చిన్న రాయి ఏదో తగిలి ఉండవచ్చని అన్నారు. కానీ ఆ రోజు సీఐ మెడికో లీగల్ కేసు పెట్టలేదని, మే 23న హత్యాయత్నం కేసు పెట్టారని తెలిపారు. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన సిట్ ఈ ఘటనను కూడా తన రిపోర్టులో పేర్కొనలేదన్నారు. 'వైసీపీ ప్రజల్లో వ్యతిరేకత వల్ల ఓడిపోలేదు. మంచి చేసి ఓడిపోయాం. చంద్రబాబు మోసపూరిత హామీలతో ఓడిపోయాం' అని జగన్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు, లోకేశ్, ఎమ్మెల్యేలు, మండల, గ్రామ స్థాయి టీడీపీ నాయకులు రెడ్‌బుక్స్ పెట్టుకుని అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. 'ఎల్లకాలం రోజులు ఒకేలా ఉండవు. చంద్రబాబును ప్రజలు క్షమించరాని పరిస్థితులు వస్తాయి. మీరు వేసే విత్తనమే రేపటి రోజున పండుతుంది. రేపటి రోజు గ్రామాల్లో మీ నాయకులకు ఇదే జరుగుతుంది. చంద్రబాబును హెచ్చరిస్తున్నా..' అని అన్నారు. కాగా.. జగన్ మీడియా ముందుకురావడం ఐదేళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అయితే ఆయన చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు. మీడియా ప్రతినిధులు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెనుదిరిగారు. ఆయన వెంట మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ కూడా జైలు వద్దకు వచ్చారు.

ఆధార్ ఇవ్వడానికి జగన్ నో?

వాస్తవానికి పిన్నెల్లితో జగన్ ములాఖత్‌పై ఉదయం కాసేపు సస్పెన్స్ నెలకొంది. జైలు మాన్యువల్ ప్రకారం ములాఖత్ అయ్యే వ్యక్తి తన ఆధార్ కార్డును సమర్పించాలి. అయితే జగన్ ఆధార్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయలేదని, సాధారణ ములాఖత్ కాకుండా ప్రత్యేక గదిలో ఏర్పాటు చేయాలని షరతు పెట్టినట్లు ప్రచారం జరిగింది. జైలు అధికారులు అంగీకరించకపోవడంతో చివరకు ఆధార్ సమర్పించినట్లు తెలిసింది. అలానే ప్రత్యేక గదిలో కాకుండా అందరిలాగే ములాఖత్‌కు అధికారులు అనుమతులిచ్చారు.

ఏం మాట్లాడుతున్నారు.. జగన్!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటారు'.. అని వైసీపీ నేతలు, లాయర్లు వాదిస్తుండగా జగన్ మాత్రం, 'అవును. ఈవీఎంను పిన్నెల్లే పగలగొట్టారు' అని ధ్రువీకరించారు. "అన్యాయం జరుగుతాఉందని చెప్పడం కోసం, అన్యాయం జరుగుతున్న వారి పక్షాన నిలబడి ఉన్నానని చెప్పడం కోసం లోపలికిపోయి ఈవీఎం పగలగొట్టే కార్యక్రమం జరిగింది. అక్కడ ఎమ్మెల్యే పరిస్థితి బాగుంటే ఎందుకు పగలగొడతాడు. అక్కడ పరిస్థితి బాగలేదనే కదా... అన్యాయం జరుగుతోందని తెలిసే కదా ఈవీఎం పగలగొట్టాడు" అని పిన్నెల్లిని ఫిక్స్ చేశారు. నెల్లూరు కారాగారం ముందు జగన్ నీతులు, సూక్తులూ వల్లెవేశారు. 'ముఖ్యమంత్రిగా నేను ఏమైనా చేయొచ్చు. మేం అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని అరాచకాలకైనా పాల్పడవచ్చు. మీరు మాత్రం పద్ధతిగా ఉండాల్సిందే" అన్నట్లుగా చంద్రబాబుకు హితోక్తులు చెప్పారు. "అధికారం శాశ్వతం కాదు. పాపాలు పండుతాయి. చెడు సంప్రదాయాలు నెలకొల్పవద్దు!' అని జగన్ సూక్తిముక్తావళి వినిపించారు. ఇదే విషయాన్ని తాను అధికారంలో ఉండగా జగన్ గుర్తుపెట్టుకుని ఉంటే... ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదే కాదని వైసీపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. 'ప్రజావేదిక' కూల్చివేతతో మొదలైన జగన్ కక్ష సాధింపు పాలన చంద్రబాబును అరెస్టు చేయించే దాకా వెళ్లింది. క్షేత్రస్థాయిలో వైసీపీ నేతలు ఎన్ని అరాచకాలకు పాల్పడుతున్నా జగన్ ఏ ఒక్కరోజూ స్పందించలేదు. 'ఇది తగదు. అధికారం శాశ్వతం కాదు. ప్రజలు అన్నీ లెక్క పెట్టుకుంటారు' అని ఇప్పుడు చెప్పిన మాటలు గత ఐదేళ్లలో ఒక్కరోజూ చెప్పలేదు. టీడీపీ కార్యాలయంపై దాడి చేసినా, చంద్రబాబు నివాసంపై దాడికి తెగబడినా, పట్టాభి నివాసంలోకి దూరి విధ్వంసం సృష్టించినా, పల్నాడులో బీసీ నేత చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతు కోసి చంపినా... జగన్ స్పందించలేదు. పైగా... దాడులు చేసిన వారికి ప్రోత్సాహకాలు, పదవులూ ఇచ్చారు. ఇక.. టీడీపీ శ్రేణులపై దాడులు చేసి, వారిపైనే ఎదురు కేసులు పెట్టడం ఐదేళ్లలో నిత్యకృత్యంగా మారింది. ఇప్పుడేమో... 'వాళ్లే దాడులు చేస్తున్నారు. వాళ్లే కేసులు పెడుతున్నారు' అని జగన్ వింతగా వాపోతున్నారు.

మీరు ఇలా చేశారా?

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తమ నాయకుడి భవనం కూలగొట్టించారని జగన్ ఆక్రోశించారు. ఇదే ఘటనలో కొలికపూడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనను చంద్రబాబు పిలిచి మందలించారు. 'ఏదైనా చట్టప్రకారమే చేయాలి' అని తెలిపారు. ఇక.. ఒక మంత్రి భార్య ఎస్ఐపై దురుసుగా మాట్లాడిన ఘటనపై చంద్రబాబు అప్పటికప్పుడు స్పందించారు. మంత్రితో మాట్లాడి... ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. ఐదేళ్లలో జగన్ ఇలా ఏ ఒక్క ఘటనపైనైనా స్పందించారా? అరాచకాలకు పాల్పడుతున్న తమ శ్రేణులను మందలించారా? ఐదేళ్లలో తాను చేసింది మరిచిపోయి.. ఇప్పుడు వాపోతే జనం నమ్ముతారా? నవ్వుతారా?

పిన్నెల్లి పరామర్శకు రూ.25 లక్షలు: అనిత

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలుకెళ్తే ఆయన్ను పరామర్శించేందుకు పులివెందుల ఎమ్మెల్యే జగన్ రూ.25 లక్షలు ఖర్చు పెట్టి హెలీకాప్టర్‌లో వెళ్లారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం సచివాలయంలో ఆమె మాట్లాడారు. పిన్నెల్లికి అన్ని ములాఖత్‌లు ముగిశాయని, ఆ విషయం తెలిసీ ఇవ్వకుంటే గొడవ చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు జగన్ ప్రయత్నించారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి గతేడాది రాజమహేంద్రవరంలో ఎన్నో ఆంక్షలు పెట్టిన జగన్‌ను.. మానవతా దృక్పథంతో అనుమతించామని చెప్పారు. జైలు బయటికి వచ్చాక ఏదేదో మాట్లాడుతున్న వైసీపీ అధ్యక్షుడికి జైళ్ల శాఖ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని సమాధానం చెబుతామన్నారు. ఇదే అంశంపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పులివెందుల ఎమ్మెల్యే జగన్ రాబోయే రోజుల్లో పరామర్శలకే పరిమితం అవుతారంటూ ఎద్దేవా చేశారు. జగన్ మళ్లీ జైలుకు పోయే సమయం దగ్గరపడిందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న ఎక్స్‌లో... పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ వెనకేసుకు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

పోలవరం కోర్ నిర్మాణాలు పటిష్ఠమే

▸▸ డయాఫ్రం వాల్‌కు మరమ్మతు చేయొచ్చు!

▸▸ అంతర్జాతీయ నిపుణుల సూచన

▸▸ కొత్త వాల్ నిర్మాణానికే జలసంఘం మొగ్గు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు 'కోర్' నిర్మాణాలన్నీ పటిష్ఠంగానే ఉన్నాయని.. సాంకేతికంగా అన్నీ సక్రమమేనని అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ప్రాజెక్టు నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిస్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ ప్రాజెక్టు ప్రాంతంలో నాలుగు రోజుల పాటు పర్యటించి.. దెబ్బతిన్న కట్టడాలను అధ్యయనం చేసి.. ప్రాజెక్టు అధికారులు, కేంద్ర జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రాకు తమ అభిప్రాయాలు వెల్లడించారు. డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతినలేదని, దాన్ని మరమ్మతు చేయవచ్చని.. ఆ తర్వాత దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను నిర్మించవచ్చని చెప్పారు. ఇక కాఫర్ డ్యాంలలో సీపేజీ నివారణకు మరిన్ని పరీక్షలు చేపట్టాలన్నారు. కాఫర్ డ్యాం దిగువన లోతుకు నదీగర్భ ఇసుక ఉన్నందున.. కొద్దిపాటి సాంకేతిక చర్యలతో సహజసిద్ధంగానే సీపేజీ తగ్గించేందుకు అవకాశం ఉందని తెలిపారు. వైబ్రో కంపాక్షన్ విధానంలో సీపేజీని అడ్డుకోవచ్చన్నారు. ఈ రెండు అంశాలపై తాము వారం, రెండు వారాల్లో ప్రాథమిక నివేదికను అందజేస్తామని స్పష్టం చేశారు. నివేదిక వచ్చేలోగా కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ డిజైన్లను సిద్ధం చేసుకుంటే సమయం కలిసి వస్తుందని కేంద్ర జల సంఘం అభిప్రాయపడుతోంది. ఒకవేళ సీపేజీ అధికంగా ఉంటే.. పంపింగ్ ద్వారా నీటిని తోడేసే ప్రణాళికా సిద్ధం చేసుకోవచ్చన్నారు. మరోవైపు.. జలసంఘం చైర్మన్ వోహ్రా కొత్త డయాఫ్రం వాల్‌ను సమాంతరంగా నిర్మించడమే మేలని బుధవారం నిపుణులతో చర్చల సందర్భంగా అభిప్రాయపడ్డారు. అయితే నిపుణులు ఎలాం టి అభిప్రాయమూ వెల్లడించలేదని పోలవరం చీఫ్ ఇంజనీర్ ఒకరు వెల్లడించారు. జలసంఘం మాత్రం కొత్త వాల్ దిశగానే అడుగులు వేస్తోందని చెప్పారు.



గంజాయి నియంత్రణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన హోంమంత్రి అనిత, సంధ్యారాణి

గంజాయి ఆచూకీ చెపితే రివార్డ్

» 10 రోజుల్లో అందుబాటులోకి టోల్ ఫ్రీ: హోం మంత్రి అనిత

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'గంజాయి ఆచూకీ చెప్పి పట్టించిన వారికి ప్రభుత్వం తరపున రివార్డ్ అందిస్తాం. అందుకు అవసరమైన టోల్ ఫ్రీ నంబరును 10 రోజుల్లో ఏర్పాటు చేసి ప్రకటిస్తాం' అని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఆమె నేతృత్వంలో విద్య, వైద్యం, గిరిజన సంక్షేమం, ఎక్సైజ్ మంత్రులతో ఏర్పాటయిన మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం ఏపీ సచివాలయంలో గురువారం జరిగింది. ఆ శాఖల అధికారులతో చర్చించింది. తీసుకున్న కీలక నిర్ణయాలను హోం మంత్రి అనిత మీడియాకు వివరించారు. 'రాష్ట్రం గడిచిన ఐదేళ్లలో గంజాయి రాజధానిగా మారింది. పాఠశాల విద్యార్థుల పుస్తకాల సంచిలో గంజాయి ప్యాకెట్లు లభించడం తల్లిదండ్రులను కలవరానికి గురి చేసింది. రాష్ట్రమంతా విస్తరిస్తోన్న ఈ మహమ్మారిని ప్రజల సహకారంతో పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం గట్టిగా పనిచేస్తుంది. గంజాయి మొక్కను పునాదుల నుంచి పీకేస్తాం. గిరిజనుల్ని ప్రలోభ పెడుతోన్న బడా వ్యాపారులకు ఉచ్చు బిగిస్తాం. మత్తు బారిన పడుతోన్న బాలలు, యువతకు ఉపశమనం కల్పిస్తాం. గంజాయి సాగు, సరఫరా కట్టడికి యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ (ఏటీఎన్ఎస్) ఏర్పాటు చేస్తున్నాం. సెబ్ ఏర్పాటు చేసిన వైసీపీ ప్రభుత్వం రెండేళ్లపాటు ఎలాంటి అధికారాలూ ఇవ్వకుండా చేతులు కట్టేసింది. అరకు, పాడేరు ప్రాంతాల్లోని 11 మండలాల్లో సుమారు ఐదు వేల హెక్టార్లలో గంజాయి సాగవుతున్నట్లు అంచనా. విశాఖపట్నం జైల్లో 11 నెలలుగా 80 శాతం గిరిజన యువకులు, బాలలు గంజాయి కేసుల్లో మగ్గిపోతున్నారు. జైళ్లలోనే మరిన్ని డీ అడిక్షన్ సెంటర్లు పెడతాం. గిరిజనులను కాఫీ, మిరియాలు, అల్లం, పసుపు లాంటి వాణిజ్య పంటల సాగువైపు మళ్లించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం. పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని సరిహద్దుల్లో చెక్ పోస్టులు, కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కట్టడి చేస్తాం' అని అనిత ప్రకటించారు. హెచ్ఆర్‌డీ మంత్రి నారా లోకేశ్, మంత్రులు సత్య కుమార్, కొల్లు రవీంద్ర గుమ్మడి సంధ్యారాణి పలు సూచనలు చేశారు. డీజీపీ ద్వారకా తిరుమల రావు, సెబ్ కమిషనర్ రవి ప్రకాశ్ ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు.

టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణ

» నెల్లూరు, కడపలో బాధ్యులపై చర్యలు: మంత్రి నారాయణ



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ చేయిస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. తణుకులో రూ.36 కోట్ల విలువైన బాండ్లను జారీ చేయాల్సి ఉండగా రూ.700 కోట్లకు పైగా జారీ చేసినట్టు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. నెల్లూరు, కడపలే అవుట్లలో అవకతవకలపై విచారణా కమిటీ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తమ హయాంలో మంజూరు చేసిన దాదాపు 9 లక్షల టిడ్కో గృహాల నిర్మాణాలను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిందన్నారు. ఈ పథకాలన్నింటినీ పునఃప్రారంభించేందుకు త్వరలో తగు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

మాతృభూమికి మేలు చేయండి: మంత్రి కొండపల్లి

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'విదేశాలకు వెళ్తున్న టీచర్లు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గొప్ప స్థాయికి వెళ్లాలి. మాతృభూమికి మేలు చేయాలి' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. గురువారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది విదేశాలకు ఉద్యోగాలకు వెళ్తున్న 120 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇంత మందికి శిక్షణ ఇచ్చి విదేశాలకు వెళ్లేందుకు సహకరించిన ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్‌ను కొనియాడారు. భువనేశ్వర్‌లో లాగానే వరల్డ్ స్కిల్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. టీడీపీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది విదేశాలకు వెళ్తున్న 21 మంది ఐటీఐ, 31 మంది హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు, 68 మంది టీచర్లకు మంత్రి కొండపల్లి శ్రీనివాసుల చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్, ఇండియన్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ అధ్యక్షులు జిలానీ, ఏపీఎన్ఆర్‌టీ సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

ముంబయికి ఇండి'గో'

» 16న విజయవాడ నుంచి రెండో సర్వీస్... ఆఫర్ ధర 4,098

విజయవాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక రాజధాని ముంబయికి విమానాలు క్యూ కడుతున్నాయి. తాజాగా ఇండిగో సంస్థ విజయవాడ నుంచి ముంబయికి సర్వీసును ప్రారంభించాలని నిర్ణయించింది. ఆగస్టు 16 నుంచి సర్వీసు షెడ్యూల్‌ను ప్రకటించింది. కొద్ది రోజుల కిందట ఎయిర్ ఇండియా ముంబయికి డైలీ ఫ్లైట్‌ను ప్రారంభించింది. ఇది విజయవంతంగా నడుస్తోంది. సగటున 90 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది. వారాంతాలలో అయితే నూరు శాతం ఓఆర్ సాధిస్తోంది. ప్రయాణికుల నుంచి ఉన్న డిమాండ్ దృష్ట్యా ఇండిగో కూడా ముంబాయికి విమాన సర్వీసు నడపాలని నిర్ణయించింది. ప్రతి రోజూ రాత్రి 9 గంటలకు ఈ విమానం బయలుదేరుతుంది. రాత్రి 11 గంటలకు ముంబయికి చేరుకుంటుంది. ప్రారంభోత్సవ ఆఫర్ ధరగా రూ.4,098 గా నిర్ణయించింది. ఎయిర్ ఇండియా సర్వీసును ప్రారంభిస్తూ రూ.5,600గా తన ధరను ప్రకటించింది. విమానయాన సంస్థల మధ్య పోటీతో ఇప్పుడు ముంబయికి తక్కువ ధరకు ప్రయాణించే అవకాశం ఏర్పడింది.

ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల ఫలితాలు విడుదల

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల భర్తీకి గతంలో జారీచేసిన పలు నోటిఫికేషన్లకు సంబంధించిన ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఆరోగ్య శాఖలో శాంపిల్ టేకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఆసక్తి కలిగిన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. కేంద్ర విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపింది. ఈనెల 16 నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం రోజు (సెప్టెంబరు 5)న అవార్డులను ప్రదానం చేస్తారని వివరించింది.

అందలం దిగని అక్రమార్కులు

గత ప్రభుత్వంలో చేసిన పాపాలకు పాతర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతికి ఆస్కారమున్న ప్రతిచోటా కోట్లకు కోట్లు దోచేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో.. నాటి అక్రమాలు, అవినీతి, అరాచకాలు బయటపడకుండా వైసీపీ పెద్దల వీరభక్త అధికారులు నిజాలకు నిప్పుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. చాలా శాఖల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులను మార్చకపోవడమే ఈ పరిస్థితికి కారణం. తాజాగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో ఓ పెద్ద మనిషి కీలకమైన ఫైళ్లను బయటకు తీసుకెళ్లి తగులబెట్టించే ప్రయత్నం చేశారు. ఇంత జరుగుతున్నా కొత్త ప్రభుత్వం జగన్ వీరభక్త అధికారులపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆధారాలన్నీ చెదిరిపోయేదాకా అక్రమాలపై విచారణకు ఆదేశించరా? బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోరా?

ఎన్నికల ఫలితాల రోజే...

జగన్ అక్రమాలకు వంతపాడిన అధికారుల్లో నాటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి ఒకరు. మద్యం పాలసీల పేరిట జే బ్రాండ్ మద్యం తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారు. రెగ్యులర్ మద్యం బ్రాండ్లను రాష్ట్రంలో లేకుండా చేసి జగన్‌కు కప్పం కట్టే అనుకూల బ్రాండ్లు మాత్రమే వ్యాపారం చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాల సరళిని చూసి అప్పటికప్పుడు జాగ్రత్తపడ్డారు. తన కార్యాలయంలోని కీలకమైన ఫైళ్లను రెండు దఫాలుగా వాహనాల్లో తరలించారన్న ఆరోపణలు వచ్చాయి. ఇదే విషయంపై ఆయనపై పోలీసులకు ఫిర్యాదులు కూడా అందాయి. అయినా కొత్త ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. ఫిజికల్ ఫైళ్లను తరలించినా, ఆన్‌లైన్‌లో ఫైళ్లు ఉంటాయి. ఆన్‌లైన్‌లోని నోట్‌ఫైళ్లను కూడా తొలగించే అవకాశం ఉందని జాగ్రత్తపడి జగన్ భక్త అధికారుల ఈ-ఆఫీసు లాగిన్‌ను బ్లాక్ చేయలేదు. దీంతో మద్యం వ్యవహారాలకు సంబంధించిన కీలకమైన నోట్‌ఫైల్స్‌ను ఈ-ఆఫీసు సర్వర్ నుంచి తొలగించినట్లు ఆ తర్వాత గుర్తించారు. ప్రభుత్వం నింపాదిగా స్పందించి వాసుదేవరెడ్డి నివాసంలో సీఐడీ సోదాలు చేయించింది. కానీ అప్పటికే కీలక ఫైళ్లు మాయమయ్యాయి. ఎక్సైజ్ శాఖలో ఏయే ఫైళ్లు ఉన్నాయి? ఏవేవి మాయమయ్యాయి? వాసుదేవరెడ్డి చేసిన ఘనకార్యాలు ఏవిటి? వంటివాటిని నిగ్గుతేల్చేందుకు ఇతమిద్ధమైన విచారణకు ప్రభుత్వం ఆదేశించలేదు. సీఐడీ స్వీయ విచారణ తప్ప శాఖాపరమైన విచారణేదీ జరగడం లేదు. దీంతో అక్రమార్కులు కీలకమైన ఆధారాలను తొలగించే పనిలో ఉన్నారు.

గనుల్లో ఇష్టారాజ్యం

జగన్ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల్లో భారీ అవినీతి జరిగింది. గనుల శాఖలో ఇసుక అమ్మకం టెండర్లతో పాటు బొగ్గు తవ్వకం, వేలం టెండర్లు, బీచ్‌శాండ్, క్వార్ట్జ్, మైనర్ మినరల్స్ లీజులు, వేలం పాటలు, వాటి రెన్యువల్‌కు ఇచ్చే లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)లు, అధిక ధరలకు సర్వేరాళ్ల కొనుగోలు, సర్వేరాళ్ల ఎంగ్రేవింగ్ యూనిట్ల వ్యవహారాల్లో వేల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. జూన్ 5న గనుల శాఖ ఉన్నతాధికారి తాటిగడపలోని ఏపీఎండీసీ, ఇబ్రహీంపట్నంలోని గనుల డైరెక్టరేట్ పరిధిలోని అత్యంత కీలకమైన ఫైళ్లను తన సహాయకుడి ద్వారా రెండు వాహనాల్లో బయటకు తరలించి తగలబెట్టించారనే ఫిర్యాదులున్నాయి. రెండు బస్తాల నిండా ఫైళ్లు తీసుకెళ్లి అగ్గిలో కాల్చడం సహా ఉద్యోగులు సైతం చూశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత దర్జాగా 180 లీజుల రెన్యువల్, మరో 120 లీజులకు కొత్తగా అనుమతులు ఇస్తూ ఎల్ఓఐలు జారీ చేశారు. వాటికి సంబంధించిన నోట్‌ఫైల్స్‌ను తొలగించారు. ఎన్నికల ఫలితాలు రావడానికి ముందు జేపీ వెంచర్స్‌కు 120 కోట్ల బ్యాంక్ గ్యారెంటీలు చెల్లించారు. వాటికి సంబంధించిన నోట్‌ఫైల్స్‌ను మాయం చేశారని తాజాగా గుర్తించారు.

గుట్టంతా పీసీబీలోనే...

పీసీబీ ఛైర్మన్‌గా మాజీ సీఎస్ సమీర్‌శర్మ పనిచేశారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడు. గత ఐదేళ్లు పీసీబీ అడ్డగోలుగా వ్యవహరించింది. ఇసుక రీచ్‌లు, బెరైటీస్, క్వార్ట్జ్, బీచ్‌శాండ్ సహా మైనర్ మినరల్స్ తవ్వకాలకు కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీటీఈ), కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్ (సీటీఓ)లు అదే ఇవ్వాలి. పర్యావరణ అనుమతులు, సీటీఈ, సీటీఓలు లేకున్నా ఇసుక తవ్వకాలు జరిగాయి. కలెక్టర్లు, పీసీబీ అధికారులు అనేక దఫాలుగా సమీర్‌శర్మకు లేఖలు రాశారు. కేంద్రం నుంచి కూడా అనేక రిమైండర్లు, సూచనలతో కూడిన ఉత్తర్వులు వచ్చాయి. అయినా చర్యలు తీసుకోలేదు. రుషికొండపై జగన్ సర్కారు నిర్మించిన ప్యాలెస్‌కు సంబంధించి హైకోర్టు, సుప్రీం కోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసులు నడిచాయి. అడ్డగోలు అక్రమ నిర్మాణాలకు పీసీబీ వంతపాడింది. రాష్ట్రంలోని పలు పరిశ్రమలపై అనేక ఫిర్యాదులు వచ్చినా పీసీబీ పట్టించుకోలేదు. కానీ గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుటుంబానికి చెందిన అమరరాజా బ్యాటరీస్‌పై వచ్చిన ఫిర్యాదులపై ఆగమేఘాల మీద స్పందించి పీసీబీ అధికారులు దాడులు చేశారు. ఆ సంస్థను వేధించడమే లక్ష్యంగా పని చేశారు. పీసీబీలో కీలకమైన ఫైళ్లు ఉన్నాయి. జగన్ పభుత్వాన్ని ఇరకాటంలో పడేసే కీలకమైన ఫైళ్లు, నివే దికలు, హార్డ్ డిస్క్‌లను గుట్టుగా తరలించి తగుల బెట్టించారని సమీర్‌శర్మపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అక్రమాలపై విచారణ ఏదీ?

జగన్ సర్కారులో ఆయా శాఖల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ టీడీపీ ఆరోపణలు చేసింది. అధికారంలోకి వచ్చాక అవి కనిపెట్టేందుకు విచారణకు ఆదేశిస్తూ ఒక్క ఉత్తర్వు కూడా ఇవ్వలేదు. జగన్ అక్రమాలకు వంతపాడిన అధికారులను కాపాడేలా కీలక పోస్టింగ్‌లు ఇచ్చారంటూ టీడీపీ కార్యకర్తలే సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక సీఐడీ అధికారులు కీలకమైన అమరావతి రాజధాని, ఐఆర్ఆర్ కేసు ఫైళ్లను తగలబెట్టించారు. టీడీపీ వచ్చాక విచారణకు ఆదేశించకపోవడంపై ఆ పార్టీ వర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

నిజానికి నిప్పు పెట్టిందెవరు?

» ఫైళ్ల దహనం కేసులో విచారణ వేగవంతం
» పోలీసుల అదుపులో ముగ్గురు.. మచిలీపట్నం తరలింపు
» ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీపై విచారణ చేస్తామన్న పవన్
» ప్రకటన వచ్చిన గంటల్లోనే ఘటన

అమరావతి(ఆంధ్రజ్యోతి), మచిలీపట్నం, జూలై 4: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఫైళ్ల దహనం కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఫైళ్లను కృష్ణా జిల్లా యనమలకుదురు-పెదపులిపాక గ్రామాల మధ్య కృష్ణా కరకట్టపై బుధవారం రాత్రి సంబంధిత శాఖ సిబ్బంది తగలబెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పీసీబీ కార్యాలయం ఓఎస్‌డీ రామారావు, కారు డ్రైవర్ నాగరాజు, అటెండర్ ఒకరిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణకు ప్రత్యేకంగా నియమించిన పోలీసు అధికారులు మచిలీపట్నంలో వారి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. తగలబెట్టిన ఫైళ్లు ఏ రకానికి చెందినవి? కీలక పత్రాలా? కాదా? ఎవరు తగలబెట్టమని సూచించారు? తదితర అంశాలపై వారిని ప్రశ్నించినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వారు చెప్పిన వివరాలను, సంఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్న పత్రాలను సంబంధిత విభాగం నిపుణులతో పరిశీలన చేయించి తుది నివేదికను ప్రభుత్వానికి పంపుతామని పోలీస్ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి కరకట్టపై మంటలను ఆర్పి స్వాధీనం చేసుకున్న పత్రాలను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్థానికులు పోలీసులకు అప్పగించారు. వీటిపై వైసీపీ ప్రభుత్వంలో గనుల మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ పేర్లు, ఫొటోలు ఉన్నాయి. ఈ అంశంపైనా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన రొయ్యల ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతులు, ఆ కంపెనీ ద్వారా వెదజల్లుతున్న కాలుష్యంపై విచారణ చేయిస్తామని ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే పీసీబీ కార్యాలయంలోని కీలక ఫైళ్లు దహనం చేసే ప్రయత్నం జరగడంతో ఇందులో ఏదో మతలబు దాగి ఉందని అనుమనించి ఆదిశగానూ పోలీసులు విచారణ చేస్తున్నట్టు సమాచారం.

ఫైళ్ల దహనంపై డిప్యూటీ సీఎం ఆరా

పీసీబీలో ఫైళ్లు, నివేదికలు దహనం చేయడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఘటన వెనుక ఎవరెవరున్నారని అధికారులను ప్రశ్నించారు. పూర్తి వివరాలతో తక్షణమే నివేదిక ఇవ్వాలని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీసీబీ కార్యాలయాల్లో ఫైళ్లు ఏ మేరకు భద్రంగా ఉన్నాయి? ఫైళ్ల భద్రతకు అనుసరిస్తున్న విధానాలేమిటి? వంటి వివరాలను తెలియజేయాలన్నారు.

ఫైళ్ల దహనం ఘటనలో బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలో గురువారం తెలిపారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేయాలని ప్రభుత్వం పోలీసులను ఆదేశించిందన్నారు.



లంపకలోవలో ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ

ద్వారంపూడి రొయ్యల కంపెనీకి నోటీసులు

» రెండు యూనిట్లలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు
» 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలంటూ పీసీబీ నోటీసులు

కాకినాడ (ఆంధ్రజ్యోతి), కాకినాడ సిటీ, జూలై 4: కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అరాచకాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. ద్వారంపూడి సోదరుడు వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ పేరుతో నిర్వహిస్తున్న రెండు రొయ్యల ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేపట్టిన జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు (పీసీబీ) అధికారులు పలు నిబంధనల ఉల్లంఘించినట్టు గుర్తించారు. వీటికి సమాధానం చెప్పాలని కోరుతూ రెండు యూనిట్లకూ గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 2న కాకినాడ కలెక్టరేట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆక్వా కాలుష్యంపై చర్యలు ఏం తీసుకున్నారని అధికారులను నిలదీశారు. వీరభద్ర ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీలో కాలుష్యంపై తనకు అనేక ఫిర్యాదులొస్తున్నాయని చెప్పారు. ఈ కంపెనీలో తక్షణం తనిఖీలు చేపట్టి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ ఆధ్వర్యంలో అధికారులు గురజనాపల్లి, ప్రత్తిపాడు మండలం లంపకలోవ యూనిట్లలో తనిఖీలు చేపట్టారు. గురజనాపల్లి రొయ్యల ఫ్యాక్టరీలో కంపెనీ విస్తరించిన ప్రదేశానికి లోబడి ప్రాసెసింగ్ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉన్నా అంతకుమించి ఎక్కువ సామర్థ్యంతో నడుస్తోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో నిబంధనల ఉల్లంఘన కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలంటూ పీసీబీ నోటీసులు జారీచేసింది.

73 కోట్లు దోచేశారు: కొండబాబు

కాకినాడ యాంకరేజ్ పోర్టు కెనాల్‌లో పూడిక తొలగింపు, మౌలిక సదుపాయాల కల్పన కోసం వైసీపీ ప్రభుత్వంలో మేరిటైమ్ బోర్డు ద్వారా మంజూరు చేసిన రూ.73 కోట్లను మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి దోచేశారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టును గురువారం ఆయన పోర్టు అధికారులు, బార్జ్ ఓనర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ద్వారంపూడి స్వార్థ ప్రయోజనం కోసం, అక్రమ వ్యాపారాల కోసం కాకినాడ పోర్టును అడ్డాగా చేసుకుని దోచుకున్నారని, ఆయన అక్రమాల ఫలితంగా కాకినాడ పోర్టుకు భారీ నష్టం వాటిల్లుతోందని అన్నారు. అనంతరం ద్వారంపూడి అనుచరుడు, షాన్‌మెరైన్ కంపెనీ అధినేత ఆలీషా లీజుకు తీసుకున్న యాంకరేజ్ పోర్టులోని స్థలాన్ని పరిశీలించారు. 3,100 చదరపు అడుగుల స్థలం లీజుకు తీసుకుని అదనంగా 6 వేల చదరపు అడుగులకుపైగా స్థలాన్ని ఆక్రమించి షిప్ నిర్మాణ పనులు చేసుకుంటున్నారని తెలిపారు. ఆక్రమిత స్థలానికి ఎటువంటి అద్దె చెల్లించడం లేదన్నారు.

ద్వారంపూడిపై కేసు

» అక్రమ కట్టడం కూల్చివేతలో విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 4: కాకినాడలోని గొడారిగుంటలో అక్రమ కట్టడం కూల్చివేత సమయంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సహా అతడి అనుచరులు 25 మందిపై కేసు నమోదైంది. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ టీపీఎస్ చాందిని కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు క్రైం నంబరు 210/24 కింద సెక్షన్ 132 బీఎన్ఎస్ (కొత్త చట్టం) ప్రకారం కేసు నమోదు చేశారు. ఏ 1గా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఏ 2గా బళ్లా సూరిబాబుతోపాటు మరో 23 మందిపై కేసు నమోదైంది.

ఇసుక కాంట్రాక్టులు రద్దు?

» ప్రాథమికంగా ప్రభుత్వ నిర్ణయం.. త్వరలో ఉత్తర్వులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇసుక తవ్వకాల్లో భారీగా అక్రమాలకు పాల్పడినట్లుగా తేలడంతో ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన కాంట్రాక్టులను రద్దుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జగన్ హయాంలో ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలకు 2023 డిసెంబరులో ఇసుక కాంట్రాక్టులు ఇచ్చిన సంగతి తెలిసిందే. 18 జిల్లాల్లో ప్రతిమ ఇన్‌ఫ్రా, 8 జిల్లాల్లో జీసీకేసీ రెండేళ్లపాటు ఇసుక తవ్వకాలు చేపట్టేలా రూ.1,530 కోట్లకు కాంట్రాక్టు ఇచ్చారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు ఆపాలని జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ), హైకోర్టు, సుప్రీంకోర్టు పలుమార్లు ఆదేశించినా, హెచ్చరికలు జారీ చేసినా ఆ రెండు కంపెనీలు పెడచెవినపెట్టాయి. పర్యావరణ, పీసీబీ అనుమతులు లేకుండా భారీ యంత్రాలను ఉపయోగించి ఇసుకను తవ్వేస్తున్నట్టు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ శాస్త్రవేత్తల బృందం అటు ఎన్జీటీకి, ఇటు సుప్రీంకోర్టుకు రెండు దఫాలుగా నివేదికలు ఇచ్చాయి. దీంతో ఆ రెండు కంపెనీల తీరుపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహంగా ఉంది. అక్రమ తవ్వకాల వల్ల కృష్ణా, గోదావరి నదీ ప్రవాహాల దశ, దిశలు మారిపోయాయి. ఒప్పందాలను ఉల్లంఘించి పర్యావరణ విధ్వంసానికి పాల్పడినందుకు రెండేళ్ల ఇసుక కాంట్రాక్టును రద్దుచేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ పాయింట్లలో ఎంత మేరకు ఇసుక ఉందో గుర్తించేపనిలో గనులశాఖ నిమగ్నమైంది. మరో రెండు రోజుల్లో ఈ లెక్క తేలనుంది. ఆ వెంటనే ఇసుక కాంట్రాక్టును ఎందుకు రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ రెండు కంపెనీలకు ఏపీఎండీసీ ద్వారా నోటీసులు ఇప్పించాలనుకుంటోంది. అక్రమాలకు పాల్పడినా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా ఒప్పందం, కాంట్రాక్టు రద్దుచేసుకునే వెసులుబాటు ఉంది. ఈ రెండింటినీ జగన్ సర్కారు రహస్యంగానే ఉంచింది. ఇప్పుడు ఈ రహస్య ఒప్పందాలనే తెరమీదకు తీసుకొచ్చి ఆ రెండు కంపెనీల కాంట్రాక్టుపై వేటువేయబోతున్నారు. తక్షణమే బకాయిలు చెల్లించాలంటూ ఏపీఎండీసీ నుంచి ఆ రెండు కంపెనీలకు నోటీసులు ఇవ్వబోతున్నారు. ఉచితంగా ఇసుక ఇవ్వాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దాని అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, గనుల శాఖ డీడీలతో సంయుక్తంగా ఓ సంయుక్త ఖాతాను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. అలాగే, ప్రత్యేకంగా మరో ఇసుక ఖాతాను జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలని గనుల శాఖ అధికారులు కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది. ఇసుకను ఉచితంగా ఇవ్వడం అంటే.. ఒక టన్ను ఇసుకపై ప్రభుత్వానికి వచ్చే ఫీజు రూ.275ను మినహాయిస్తారు. ఇక స్థానిక సంస్థలకు ఇచ్చే రూ.88 వాటికి చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సీనరేజీ కాంట్రాక్టు లేని ఏడు జిల్లాల్లో ఖనిజాల రవాణాకు ఆన్‌లైన్ పర్మిట్లు ఇవ్వాలని గనుల శాఖ నిర్ణయించింది. కృష్ణా, పశ్చిమగోదావరి, విశాఖ, కర్నూలు, నెల్లూరుజిల్లాల్లో సోమవారం నుంచి ఖనిజాల రవాణాకు ఆన్‌లైన్ పర్మిట్లు ఇవ్వనున్నారు. దీనివల్ల ప్రతి జిల్లా నుంచి సగటున నెలకు రూ.5కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

సీనరేజీ కాంట్రాక్టు కూడా రద్దు?

ఖనిజాల తవ్వకాలు, రవాణా సందర్భంగా లీజుదారుల నుంచి సీనరేజీ వసూలు బాధ్యతను జగన్ సర్కారు అస్మదీయ ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టింది. ఆ కంపెనీలు గత ఆరు నెలలుగా సీనరేజీ కింద వసూలు చేసిన సొమ్మును సర్కారుకు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో సీనరేజీ కాంట్రాక్టును కూడా రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

గ్రూప్-1లో గోల్‌మాల్?

(మొదటి పేజీ తరువాయి)

వెల్లువెత్తుతున్నాయి. 2022లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో 75 మార్కులకు ఇంటర్వ్యూలు జరగ్గా ఒక అభ్యర్థికి ఏకంగా 74.5 (99.33%) మార్కులు వచ్చాయి. ఆ అభ్యర్థి గతంలో గౌతం సవాంగ్ డీజీపీగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో టెక్నికల్ విభాగంలో ఎస్ఐగా పనిచేశారు. 2022లో గ్రూప్-1 జరిగినప్పుడు సవాంగ్ ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్నారు. మరో అభ్యర్థి 74 మార్కులు సాధించారు. ఆయన మాజీ సీఎం జగన్‌కు కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డి బంధువు'.. వీరిద్దరే కాదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం టాపర్లలో దాదాపు తొమ్మిది మందికి 74 మార్కులు వచ్చాయి. ఏపీపీఎస్సీ చరిత్రలోనే ఇన్ని మార్కులు రావడం చాలా అరుదు. అంతా పారదర్శకంగా జరిగితే మార్పులను ఎందుకు బహిర్గతం చేయలేదనే సందేహాలొస్తున్నాయి. అసలు ఇంటర్వ్యూలంటేనే అక్రమాలని సీఎంగా ఉన్నప్పుడు జగన్ ప్రకటించారు. ఆయన ఆదేశాలతో 2021 జూన్‌లో గ్రూప్-1 ఇంటర్వ్యూలు రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మళ్లీ ఏమైందో, ఎవరు ఆదేశించారో కానీ 2022లో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చేముందు ఇంటర్వ్యూ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టారు. వెంటనే గ్రూప్-1 పోస్టులకు పరీక్షలు జరిగాయి. ఆ ఇంటర్వ్యూల్లో కొందరికి కనీవినీ ఎరుగని స్థాయిలో మార్కులొచ్చాయి.

రహస్యం ఎందుకు?

ప్రతిష్ఠాత్మకమైన యూపీఎస్సీనే అభ్యర్థుల మార్కులను వెల్లడిస్తోంది. కానీ వైసీపీ పాలనలో మార్కులు వ్యక్తిగతంగా ఆ అభ్యర్థులకు తప్ప మూడో కంటికి తెలియవు. 2016లో జరిగిన గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించిన మార్కులను అప్పటి కమిషన్ బహిర్గతం చేసింది. 2018లో ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ పోస్టులను భర్తీచేసిన వైసీపీ ప్రభుత్వం ఆ మార్కులనూ దాచిపెట్టింది. ఆ తర్వాత 2022 నోటిఫికేషన్ మార్కులనూ గోప్యంగానే ఉంచింది. 2022 గ్రూప్-1 ఇంటర్వ్యూలో గరిష్ఠ మార్కులు ఎన్నో సమాచారం ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' కోరగా... ఏపీపీఎస్సీ కార్యదర్శి స్పందించలేదు. అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పనిచేసిన హెచ్.అరుణ్‌కుమార్ కూడా ఇదే గోప్యతను కొనసాగించారు. ఫలితాలు ప్రకటించిన రోజున మార్కులు మీడియాకు ఇవ్వాలని అప్పటి ఛైర్మన్ సవాంగ్ ఆదేశించినా, అరుణ్‌కుమార్ మాత్రం ససేమిరా అనేశారు.

బోర్డుల్లో పారదర్శకత ఎంత?

111 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-1 నోటిఫికేషన్ జారీ చేశారు. వారిలో మెయిన్స్ నుంచి 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇంటర్వ్యూల కోసం మూడు బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ బోర్డుల్లో పారదర్శకత ఎంత అనేది అనుమానమే. 2021లో ఇంటర్వ్యూలను రద్దు చేసినప్పుడు జగన్ ప్రభుత్వం దాన్ని చరిత్రాత్మక నిర్ణయంగా ప్రకటించుకుంది. ఇకపై పారదర్శకంగా గ్రూప్1 ఉద్యోగాల భర్తీ జరుగుతుందని ప్రచారం చేసుకుంది. కానీ కొద్దికాలంలోనే ఆ నిర్ణయాన్ని కాలగర్భంలో కలిపేస్తూ, ఇంటర్వ్యూ విధానాన్ని తిరిగి తెచ్చింది. ఇది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని, దానిపై కామెంట్ చేయలేనని అప్పట్లో సవాంగ్ తెలిపారు. దాని వెనుక ఎవరో ఉన్నారని ఆయన చెప్పకనే చెప్పారు. ఆ తర్వాత జరిగిన ఉద్యోగాల భర్తీలో తిరిగి ఇంటర్వ్యూలు ఎందుకు తెచ్చారో బయటపడింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

దుర్గమ్మకు కానుకగా బంగారు చైన్, మంగళసూత్రాలు

వన్‌టౌన్, జూలై 4: నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన వీ వంశీకృష్ణ, కుటుంబ సభ్యులు ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు కానుకగా 120 గ్రాముల బంగారు చైన్, మంగళసూత్రాలను సమర్పించారు. గురువారం ఆలయానికి విచ్చేసిన వంశీకృష్ణ, కుటుంబ సభ్యులు ఈవో రామారావు ద్వారా వాటిని దేవస్థానానికి అందజేశారు. దుర్గమ్మ దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.



అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

ధర్మపథం వేదికపై గురువారం జగ్గంపేటకు చెందిన సీతారత్నం లలిత కళా నృత్య నికేతన్ ముళ్లపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలోని కళాకారుల బృందం కూచిపూడి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఇచ్చింది. మొత్తం 17 కీర్తనలకు చక్కని అభినయంతో అభినందనలను అందుకున్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రంభా ప్రసాద్, ముకుంద్

6 నుంచి రాష్ట్ర వాల్ హ్యాండ్‌బాల్ పోటీలు

● అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రంభా ప్రసాద్

విజయవాడ స్పోర్ట్సు, జూలై 4: అమెరికా, యూరప్ దేశాల్లో అద్భుతమైన క్రీడగా భాసిల్లుతున్న వాల్ హ్యాండ్‌బాల్‌ను రాష్ట్రంలోని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్టు వాల్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రంభా ప్రసాద్ తెలిపారు. ఐజీఎంసీ స్టేడియంలో గురువారం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ముకుంద్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26 నుంచి 28వ వరకు జరిగే జాతీయ పోటీలకు జట్టును సన్నద్ధం చేసేందుకు తొలి అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి) వాల్ హ్యాండ్‌బాల్ పోటీలను నందిగామలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో ఈ నెల 6, 7న సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాలబాలికల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లో పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. టోర్నీల్లో మొత్తం 250 మంది క్రీడాకారులు బరిలో దిగుతున్నట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కె.కృష్ణారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.



సైక్లోథాన్ రన్ ప్రారంభిస్తున్న చక్రధారి దాస్

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

● ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరంలో సైక్లోథాన్

లబ్బీపేట, జూలై 4: మత్తుపదార్థాల వాడకం జీవితాలపై ప్రభావం చూపుతుందని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధరిదాస్ అన్నారు. యునైట్ అగెనెస్టెన్ అనే అంశంతో మత్తుపదార్థాలల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలపై అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోత్సహించడంలో భాగంగా ఇస్కాన్ విజయవాడ, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఆథారిటీ సంయుక్తంగా గురువారం సైక్లోథాన్‌ను నిర్వహించారు. బందర్ రోడ్డులోని స్టేడియం వద్ద ఈట్‌స్ట్రీట్ నుంచి ప్రారంభమైన ఈ సైక్లోథాన్ ఏలూరు రోడ్డు, కంట్రోల్ రూమ్, బస్టాండ్ మీదుగా జగన్నాథ్ మందిరం వరకు సుమారు 11 కిలోమీటర్లు సాగింది. ఇస్కాన్ అధ్యక్షుడు చక్రధారిదాస్ ప్రారంభించిన ఈ రన్‌లో సైక్లిస్టులు, విద్యార్థులు, డాక్టర్లు పాల్గొన్నారు. అలాగే ఈనెల 6న కూడా వాక్‌థాన్ నిర్వహిస్తున్నామని, ఉదయం 7.30 గంటల నుంచి ఈట్‌స్ట్రీట్ నుంచే ప్రారంభమవుతుందన్నారు. ఇస్కాన్ విజయవాడ టీమ్ సభ్యులు బలరాం గోవిందదాస్, మాధవ సేవా దాస్, వజ్రం దాస్ ప్రభు పాల్గొన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ధర్నా



వన్‌టౌన్, జూలై 4: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ నేతలు కులమతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. రాహుల్ మాటలను ప్రజలలోకి తప్పుగా తీసుకువెళుతున్నందున నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ మీసాల రాజేశ్వరరావు, పొనుగుపాటి నాంచరయ్య, జనరల్ సెక్రటరీ మేడ సురేష్, అడ్మిన్ జనరల్ సెక్రటరీ ఎస్ఎన్ రాజా, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి క్రైస్తవుల సమస్యలు



ధర్నాచౌక్, జూలై 4: రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ నెల 10న సీఎం చంద్రబాబును కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్తామని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షుడు జాన్‌మస్క్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు బి.నవీన్‌కుమార్, కార్యదర్శి డేవిడ్ మార్క్, కోశాధికారి శేఖర్‌బాబు, సభ్యులు అమృతరావ్, సుందర్‌పాల్, పీటర్ పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ధర్నాచౌక్, జూలై 4: ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న అన్ని పేటల్లో జెండా ఆవిష్కరణలు, ఆత్మగౌరవ కవాతు నిర్వహించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఏలీషా మాదిగ పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. తొలుత దివ్యాంగుల ఫించన్ నుంచి రూ. 6వేలకు పెంచినందుకు సీఎం చంద్రబాబు, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి నేతలు పాలాభిషేకం చేశారు. లింగాల నరసింహులు, సుజాత నాయుడు, మామిడి రాంబాబు, ఇసుకపల్లి చంటి, టోని, వెల్పుల సురేష్ పాల్గొన్నారు.

7న జిల్లా అండర్-19 చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో సక్సెస్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7న అండర్-19 బాలబాలికలకు వేర్వేరుగా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ బాషా, మందుల రాజీవ్ తెలిపారు. మొదటి 4స్థానాల్లో నిలిచిన వారిని 18,19న నంద్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులు శనివారం సాయంత్రంలోగా 9246181858 నెంబర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

మాయమయ్యాయా..? మాయం చేశారా..!

సూరంపల్లి అగ్రిగోల్డ్ ఫుడ్స్ అండ్ ఫార్మ్స్ ప్లాంట్‌లో యంత్ర సామగ్రి మాయం

- రుణాలు ఎగ్గొట్టినందుకు ప్లాంట్‌ను జప్తు చేసిన యూనియన్ బ్యాంకు
- జప్తులో ఉన్న ప్లాంట్ నుంచి యంత్రాలు మాయం
- పలుమార్లు అగ్రిగోల్డ్‌కు చెందిన వారు ప్లాంట్‌కు వచ్చారన్న సెక్యూరిటీ
- అగ్రిగోల్డ్ సిబ్బంది, బ్యాంకు అధికారులు, సెక్యూరిటీ సిబ్బందిపై అనుమానాలు



ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం: సూరంపల్లి పారిశ్రామికవాడలోని అగ్రిగోల్డ్ ఫుడ్స్ అండ్ ఫార్మ్స్‌లో రూ.25 కోట్ల విలువైన యంత్ర సామగ్రి మాయమవటం సంచలనం సృష్టిస్తోంది. బ్యాంకు సీజ్‌లో ఉన్న ప్లాంట్ నుంచి యంత్ర సామగ్రి మాయమవటం వెనుక ఎవరి హస్తం ఉందన్నది మిస్టరీగా మారింది. యంత్ర సామగ్రి ఎలా మాయమైంది? ఈ మాయం వెనుక ఎవరున్నారు అనే ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. వేసిన తాళం వేసినట్టు ఉండగానే ఎలా మాయమవుతాయన్నది అంతుచిక్కని రహస్యంగా మారింది. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగానే జరిగిందని తెలుస్తోంది. ఈ ఫ్యాక్టరీకి ఎవరెవరు వచ్చారన్నది మిస్టరీగా మారింది. పారిశ్రామికవాడ సీసీ ఫుటేజీ పరిశీలిస్తే దొంగలు దొరికే అవకాశం ఉందని సమాచారం. దీనిపై ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోవటంతో పోలీసుకేసు నమోదు కాలేదు. అగ్రిగోల్డ్ యజమానులు ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదు. ప్లాంట్ యూనియన్ బ్యాంక్ ఆధీనంలో ఉండటం వల్ల వారే ఫిర్యాదు చేయాలన్న రీతిలో అప్పట్లో పోలీసులు వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అందుకే కేసు నమోదు కాలేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే సెక్యూరిటీ వర్గాలు మాత్రం తాము తాళం తెరవలేదని పలుమార్లు అగ్రిగోల్డ్‌కు చెందినవారే వచ్చి తాళాలు తెరవమని ఒత్తిళ్లు తెచ్చారని కానీ వాళ్లని అనుమతించలేదని, బ్యాంకు అధికారులకు చెబితే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివ్వవద్దని చెప్పారన్నారు. వీరు తప్ప ఆ ప్రాంగణానికి ఎవరూ రాలేదని సెక్యూరిటీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై పలు అనుమానాలను వస్తున్నాయి. అగ్రిగోల్డ్ యాజమాన్యం నుంచి బ్యాంకుకు స్వాధీనమైన తర్వాత ఆ ప్లాంట్‌పై యాజమాన్యం ఎందుకు ఆసక్తి చూపిస్తోందన్నది చర్చనీయాంశం. ప్లాంట్‌పై హక్కు కోల్పోయిన యాజమాన్యం సామగ్రి పోయిందని చెప్పడం అనుమానాలను కలిగిస్తోంది. దీనిపై బ్యాంకు సరిగా స్పందించకపోవటం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. యంత్ర సామగ్రి పోయిందని తెలిస్తే అంతర్గత విచారణ చేయాలి. మరి ఎలాంటి విచారణ చేయకపోవడంపై బ్యాంకుకు చెందిన వారెవరైనా మాయం చేశారా అన్నది మిస్టరీగా ఉంది. వేసిన తాళం వేసినట్టు ఉండి భారీ సామగ్రిని మాయం చేయటం తేలిక కాదు. సెక్యూరిటీకి సంబంధం లేకుండా ఈ తరలింపు జరుగుతుందా అన్నది చర్చనీయాంశమే. తక్షణం ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది.





తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు, సీతారామరాజును సన్మానిస్తున్న మాజీ ఎంపీ గోకరాజు

అల్లూరి స్ఫూర్తితో ముందుకెళ్లాలి

● మంత్రులు నిమ్మల, కొండపల్లి, సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్, జూలై 4: నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు మంత్రులు పేర్కొన్నారు. నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్‌తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అల్లూరి చిత్రపటానికి ఘన నివాళులు సమర్పించిన అనంతరం అతిథులు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు సేవలను కొనియాడారు. వైసీపీ పాలనలో క్షత్రియులు వివక్షతకు గురయ్యారని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటాలు మన్యంలో ప్రజలను చైతన్య పరచాయని, ఆయన కీర్తి అజరామరమని కొనియాడారు. ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, విష్ణు కుమార్ రాజు, దాట్ల సుబ్బరాజు, బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీలు మాధవ్, పాకలపాటి రఘువర్మ, టీడీపీ సీనియర్ నేత టీడీ జనార్దన్, ఏపీ క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్షుడు సీహెచ్ వెంకటపతి రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నేత కే పట్టాభి పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ రాజు, బుద్దరాజు శివాజీ ఆధ్వర్యంలో జరిగింది.



అల్లూరి సీతారామరాజు వేషధారణతో అలరించిన చిన్నారి

అల్లూరి పోరాటమే స్ఫూర్తి: బొండా

సత్యనారాయణపురం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటపటిమ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యంలో జీఎస్‌రాజు రోడ్డులోని గోకరాజు గంగరాజు కల్యాణమండపంలో గురువారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ సమాజానికి అల్లూరి అందించిన స్ఫూర్తితో నేటితరం ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం ప్రముఖ కళాకారుడు వల్లూరు శ్రీహరిరావు, విద్యావేత్త ఘంటా పుష్పలత, సంఘసేవకులు మంతెన సీతారామరాజును సన్మానించారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అల్లూరిసీతారామరాజు ఏకపాత్రాభినయం అందరినీ ఆకట్టుకుంది. మాజీ డిప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరాజు, ప్రసాదరాజు, కోశాధికారి డీజేపీఎన్ రాజు, స్మారక గ్రంథాలయం అధ్యక్షకార్యదర్శులు కె.సుబ్బరాజు, పి.వి.సుబ్బరాజు, కోశాధికారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చిత్తరంజన్ శాఖ గ్రంథాలయంలో..

అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖాగ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యాసంస్థల బంద్ ఉద్రిక్తం.. నేతల అరెస్ట్

మొగల్రాజపురం, జూలై 4: నీట్ నెట్ పరీక్షల పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు గురువారం చేసిన విద్యాసంస్థల బంద్ ఉద్రిక్తంగా మారింది. పీబీ సిద్ధార్థ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యుఐ, పీడీఎస్‌వో విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్లకార్డులు చేతపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వి.జాన్సన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ పేపర్ లీకేజితో 5లక్షల మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. సీయూఈటీ, నీట్ వంటి కేంద్రీయ పరీక్షల విద్యను ప్రైవేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంచి పోషించడాన్ని ఖండించారు. వన్ నేషన్.. వన్ ఎగ్జామ్ పేరుతో విద్యార్థుల భవిష్యత్‌ను పాడు చేస్తోందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్రాల పరిధిలో నీట్ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జాతీయ నేతలు ఎం.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్, భాస్కర్ మాట్లాడుతూ పేపర్ లీకేజీలో బీహార్‌లో 13మందిని అరెస్టు చేసి చేతులు దులుపుకోవడం మినహా కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ కుంభకోణానికి కారణమైన అసలైన వారిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. వెంటనే ఆయన మంత్రి పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. మాచవరం పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నాను విరమించమని కోరినా విద్యార్థి నేతలు ససేమిరా అనడంతో వారిని బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, నేతల మధ్య కాసేపు తోపులాట, పెనుగులాట జరిగింది. అదుపులోకి తీసుకున్న వారిని మాచవరం పోలీసు స్టేషన్‌ను తరలించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణ్, ఐసా జిల్లా కార్యదర్శి మహేష్, శివనాయక్, ఎస్ఎఫ్ఐ సిటీ కార్యదర్శి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఇతర సంఘాల నేతలు పాల్గొన్నారు.



పీబీ సిద్ధార్థ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

రూ.లక్షల్లో పన్నుల స్వాహా

● కాటూరు గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ సస్పెన్షన్

కాటూరు (ఉయ్యూరు), జూలై 4: ఏళ్ల తరబడి ఇంటి పన్ను, కుళాయి పన్నులు లక్షల్లో వసూలుచేసి ప్రభుత్వ ఖాతాకు జమచేకుండా బిల్ కలెక్టర్ స్వాహాచేసిన సంఘటన కాటూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ముదునూరు గ్రామపంచాయతిలో డిప్యుటేషన్‌పై బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తున్న నల్లూరి నరేంద్ర కొన్నేళ్లగా కాటూరు గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో ప్రజల నుంచి 2017- 2018 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-2024 ఆర్థిక సంవత్సరం వరకు రూ.18 లక్షల 19వేల 757 వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమచేయకుండా స్వాహా చేశాడు. ఈ విషయం ఇటీవల వెలుగులోకి రావడంతో గ్రామ సెక్రటరీ జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాడు. దీంతో బిల్లు కలెక్టర్ నరేంద్రను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలిచ్చినట్టు ఎండీవో లక్ష్మీదేవి గురువారం తెలిపారు.

వేలం సొత్తు నొక్కేసిన జూనియర్ అసిస్టెంట్

గ్రామ పంచాయతీ పరిధిలో 2020లో ఊర చెరువుకు వేలంపాట పాడిన వ్యక్తి నుంచి వసూలు చేసిన రూ.11.50 లక్షలు జూనియర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఖాతాకు జమచేయకుండా స్వాహా చేసినట్టు తెలిసింది. కాటూరులో ఇన్‌చార్జ్ ఈవోగా పనిచేసి ప్రస్తుతం పెదఓగిరాలలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న ఐనంపూడి సందీప్ కాటూరులో రెండేళ్ల క్రితం ఇన్‌చార్జ్ ఈవోగా చేస్తున్న సమయంలో వసూలు చేసిన చేపల చెరువు లీజు డబ్బులు ప్రభుత్వ ఖాతాకు జమచేకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు కాటూరు సెక్రటరీ లక్ష్మణరావు తెలిపారు. దీనికి సంబంధించి డబ్బులు చెల్లించిండీ, లేనిది తెలపాలని లీజుదారుడికి నోటీసు ఇచ్చినట్టు తెలిపారు.



గద్దె రామ్మోహన్‌ను సత్కరిస్తున్న 10వ డివిజన్ కాలనీ వాసులు

జరిగినవి ఎన్నికలు కావు.. ప్రజాయుద్ధం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జూలై 4: దేశంలో ఏ రాష్ట్రంలో ఏనాడూ జరగని విధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, ప్రజలు తిరస్కరిస్తే ఎలా ఉంటుందో ఓటు ద్వారా చూపించారని, ఇవి ఎన్నికలు కావని ప్రజాయుద్ధమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం సాయంత్రం పటమట ఫన్‌టైమ్స్ క్లబ్‌లో కార్పొరేటర్ దేవినేని అపర్ణ ఆధ్వర్యంలో 10వ డివిజన్ కాలనీవాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గద్దె రామ్మోహన్ హాజరై మాట్లాడారు. చంద్రబాబు నాడు అసెంబ్లీలో వైసీపీ వికృత చేష్టలు చూసి తాను ముఖ్యమంత్రిగానే శాసనసభకు వస్తానని శపథం చేశారన్నారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. 1994లో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కకుండా ఎన్టీఆర్ విజయం సాధించారని గుర్తు చేశారు. మళ్లీ 2024లో చంద్రబాబు రికార్డులను తిరగరాస్తూ ఘన విజయాన్ని సాధించామని, కూటమిని బలపర్చేందుకు పవన్ కల్యాణ్ త్యాగం, శ్రమ మర్చిపోలేనిదన్నారు. బొర్రా గాంధీ, కిలారు శివాజీ, సతీష్, అట్లూరి మోహన్‌కుమార్, మన్నే జయప్రకాష్, పలగాని జగన్మోహన్‌రావు, స్వరూపరాణి, బొబ్బా ఉమ, మన్నే శోభ పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జీకే వీధి సీఐ బి.అప్పలనాయుడు, ఎస్ఐ కె.అప్పలసూరి

759 కిలోల గంజాయి స్వాధీనం

- అల్లూరి జిల్లాలో ఐదుగురి అరెస్టు
- నిందితుల్లో బాలుడు.. పరారీలో ప్రధాన సూత్రధారి

చింతపల్లి, జూలై 4: ఒడిశా నుంచి తమిళనాడు ప్రాంతానికి తరలిస్తున్న 759 కిలోల గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని, వారిలో ఒక బాలుడు ఉన్నాడన్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను అదనపు ఎస్పీ వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బోడపాదూరు తాలూకా బరడబంద గ్రామానికి చెందిన లింగు ఖిలా అలియాస్ బాబూరావు 759 కిలోల గంజాయిని జీకే వీధి మీదుగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపైకి చేర్చి, అక్కడ నుంచి తమిళనాడు తరలించేందుకు సిద్ధమయ్యాడు. బుధవారం రాత్రి రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారంతో జీకే వీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అప్పలనాయుడు, ఎస్ఐ కె.అప్పలసూరి వాహనాల తనిఖీ చేపట్టారు. గంజాయి తరలిస్తున్న రెండు వాహనాలు అక్కడకు చేరుకోగానే చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా బాలుబద్దర్, పాంగి గోవర్ధన్, కొర్ర లైకోన్, కిల్లో శంకరరావుతో పాటు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి వాహనాలు, 759 కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, 16,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు సూత్రధారి అయిన లింగు ఖిలా పరారీలో ఉన్నాడని అదనపు ఎస్పీ తెలిపారు. అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం గంజాయితో పట్టుబడిన నిందితుల ఆస్తులు జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ.2.46 కోట్ల విలువైన నకిలీ సిగరెట్లు సీజ్



సెంట్రల్ జీఎస్టీ అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ సిగరెట్లు

గుంటూరు/విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రూ.2.46 కోట్ల విలువైన నకిలీ సిగరెట్ల గుట్టును సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ పరిధిలోని విజయవాడ యూనిట్ అధికారులు రట్టు చేశారు. నిర్దిష్ట సమాచారం మేరకు సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా గన్నవరం డీటీడీసీ హబ్‌లో విజయవాడ యూనిట్ అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో గోల్డ్ స్ట్రైప్ టుబాకో ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిన గోల్డ్ స్ట్రైప్, గోల్డ్ విమల్ బ్రాండ్ల పేరుతో స్వదేశీ సిగరెట్లుగా నిర్ధారించినట్టు తెలిపారు. 49.20 లక్షల సిగరెట్ స్టిక్‌లను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.2.46 కోట్లు ఉంటుందని నరసింహారెడ్డి పేర్కొన్నారు. విజయవాడ యూనిట్ అధికారులు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. గుంటూరు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాదిలో సుమారు రూ.2.73 కోట్ల విలువైన 7.05 లక్షల అక్రమ సిగరెట్ స్టిక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

విశాఖ వైసీపీలో రచ్చ రచ్చ!

- అమర్నాథ్‌పై నేతల గుర్రు
- ఆయన వల్లే ఓడిపోయామన్న ఓ వర్గం
- ఆయనకే జిల్లా పగ్గాలివ్వాలన్న మరో వర్గం
- వలంటీర్ల వల్లే పరాజయమన్న మాజీ మంత్రి
- ప్రభుత్వ ఉద్యోగుల్లా పోజు కొట్టి పార్టీని మోసం చేశారని ధ్వజం
- రసాభాసగా ముగిసిన భేటీ..

విశాఖపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల విభేదాలు రచ్చకెక్కాయి. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా వారంతా చీలిపోయారు. ఈ నెల 8న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పార్టీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై గురువారమిక్కడ వైసీపీ కార్యాలయంలో అమర్నాథ్ సమావేశం నిర్వహించారు. వలంటీర్ల వ్యవస్థ వల్లే పార్టీ ఓటమి పాలైందని, కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా కారణమేనని ఆయన ఈ సందర్భంగా అన్నారు. వలంటీర్లు వైసీపీ తరపున ఎన్నికల్లో కరపత్రాలు కూడా పంచలేదని.. అదేమని అడిగితే తమ ఉద్యోగాలు పోతాయంటూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పోజు కొట్టి పార్టీని మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇంతవరకూ జరిగిపోయింది వదిలేసి, ఇకపై అందరం పార్టీ బలోపేతానికి కృషిచేద్దామని పిలుపునిచ్చారు. విశాఖ దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ మాట్లాడుతూ.. కొంతమంది కార్యకర్తలు సోషల్ మీడియాలో నేరుగా జగన్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారని, ఆయన్ను ప్రశ్నించే స్థాయికి మనం ఎదిగిపోయామా అని ప్రశ్నించారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిజమైన కార్యకర్తలను పట్టించుకోకుండా, అంతా తామే అన్నట్లు వ్యవహరించారని.. అదే కొంపముంచిందని పార్టీ యువజన విభాగం నాయకుడు తుళ్లి చంద్రశేఖర్‌తోపాటు మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ లేచి జిల్లాలో పార్టీ తిరిగి బలోపేతం కావాలంటే అమర్నాథ్‌కే పగ్గాలు అప్పగించాలని అనడంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. జిల్లాలో పార్టీ ఓటమికి ఆయనే కారణమని కొందరు ఆరోపించారు. ఎవరు చెబితే పార్టీ నుంచి తనను సస్పెండ్ చేశారని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ మాజీ మంత్రిని నిలదీశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి రోజూ పోలీసులు తనను ఉదయం స్టేషన్‌కు తీసుకెళ్లి సాయంత్రానికి తిరిగి పంపిస్తున్నారని.. పార్టీ నుంచి ఒక్కరు కూడా భరోసాగా లేరని మండిపడ్డారు. ఇకపై అలాంటి పరిస్థితి వస్తే తనకు ఫోన్ చేయాలని, తాను వచ్చి మద్దతుగా నిలుస్తానని అమర్నాథ్ అన్నారు. గాజువాక మహిళా కార్యకర్త ఒకరు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చాక తమపై ఎక్కడ దాడులు చేస్తారోనని భయంగా ఉందని, సమస్య వస్తే ఆదుకుంటామనే భరోసా పార్టీ నేతల నుంచి లభించడం లేదని వాపోయారు. ఈ క్రమంలో సమావేశం అరుపులు కేకలతో రసాభాసగా మారడంతో అమర్నాథ్ అర్ధాంతరంగా లేచి.. ముఖ్య నేతలను పక్క గదిలోకి తీసుకెళ్లి చర్చించారు. కాగా.. ఈ భేటీకి పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆడారి ఆనంద్, చొక్కాకుల వెంకటరావు వంటి ముఖ్యనాయకులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా జీవీఎంసీ పరిధిలో వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు ఉండగా 15 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వారంతా పార్టీ మారిపోతారేమోనని నేతలు చర్చించుకోవడం కనిపించింది.

వైసీపీ నేతలు పాపాల నుంచి తప్పించుకోలేరు: జవహర్

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డం పెట్టుకుని, చేసిన దోపిడీలు బయటకు రాకుండా, ఎన్ని ఫైళ్లు దగ్ధం చేసినా.. వైసీపీ నేతల పాపాల చిట్టా టీడీపీ వద్ద ఉందని మాజీ మంత్రి కేఎస్ జవహర్ స్పష్టం చేశారు. కాగితాలు కాల్చినంత మాత్రాన పాపాలు ఎక్కడికీ పోవని, అన్ని సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని, జగన్‌రెడ్డి అనుంగులు చేసిన పాపాల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'జగన్‌రెడ్డి, వైసీపీ నేతల దోపిడీకి కాదేదీ అనర్హం. దోచుకుని, దొరకకుండా ఉండటానికి ఫైళ్లు దగ్ధం చేస్తున్నారు. కానీ దొంగ ఏదోక రోజు దొరకాల్సిందే. వైసీపీ దొంగలతో పాటు కొందరు అధికారులు కూడా భాగస్వామ్యం కావడం సిగ్గుచేటు' అని విమర్శించారు.

పారిశ్రామికాభివృద్ధికి చాంబర్స్ రోడ్‌మ్యాప్

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే సూచనలతో రూపొందించిన రోడ్ మ్యాప్‌ను పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) గురువారం ప్రభుత్వానికి అందజేసింది. చాంబర్స్ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి రోడ్ మ్యాప్‌ను సమర్పించింది.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

1. విటమిన్‌ను కనుగొన్నది ఎఫ్.జి.హాప్కిన్. అయితే విటమిన్ అని పేరు ప్రతిపాదించిన ఫంక్ ఏ దేశస్థుడు
   1. అమెరికా 2. బ్రిటన్ 3. జపాన్ 4. చైనా
2. పార్కర్ సోలార్ ప్రోబ్‌ను నాసా ఎవరి గౌరవార్థం పేరు పెట్టి సూర్యగోళ అధ్యయనానికి పంపిస్తోంది?
   1. యూజీన్ పార్కర్, ప్రఖ్యాత ఆస్ట్రోఫిజియిస్ట్ 2. ఎస్. చంద్రశేఖర్ 3. గ్రెగర్ మెండల్ 4. చార్లెస్ డార్విన్
3. నాగార్జున సాగర్ - శ్రీశైలం సంరక్షణ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో ఉంది?
   1. గుంటూరు 2. కర్నూలు 3. నల్లగొండ 4. 1, 2
4. నేల సహాయం లేకుండా మొక్కలు పెంచే విధానాన్ని అధ్యయనం చేసే శాస్త్రం?
   1. క్రయోజనిక్స్ 2. హైడ్రో ఫోనిక్స్ 3. జెనిటిక్స్ 4. ఫాసెటిక్స్
5. ఒలింపిక్ క్రీడల్లో పతకాన్ని గెలుచుకున్న మొదటి మహిళ?
   1. ఫోరెన్స్ గ్రిఫిత్ జాయనర్ 2. మెర్లిన్ బట్టి 3. మెరియన్ జోన్స్ 4. చార్లోటీ కూపర్
6. జన్యువును కృత్రిమంగా ప్రయోగశాలలో సంశ్లేషణ చేసినందుకు నోబెల్ బహుమతి పొందిన భారతీయ శాస్త్రవేత్త?
   1. హరగోవింద్ ఖురాన 2. అబ్దుల్ కలాం 3. ఎల్లాప్రగడ సుబ్బారావు 4. గ్రెగర్ మెండల్
7. మధుమేహ వ్యాధి చికిత్సలో వాడే ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న వారు?
   1. హిదేకి యుకోవా 2. ఎడ్వర్డ్ జన్నర్ 3. సర్ ఫ్రెడ్రిక్ గ్రాంట్ బెంటింగ్ 4. సర్ జేమ్స్ యంగ్ సింప్సన్
8. 1948లో భాష ఆధారంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చేయడానికి ఏర్పాటైన కమిషన్?
   1. థార్ కమిషన్ 2. షా కమిషన్ 3. ఫజల్ అలీ కమిషన్ 4. కోస్లా కమిషన్
9. పురిటి నొప్పులతో ఎలక్ట్రిక్ సైకిల్‌పై ఆస్పత్రికి వెళ్లిన జూలీ అన్నే జెంటర్ ఏ దేశానికి చెందిన ఎంపీ?
   1. జర్మన్ 2. అమెరికా 3. డెన్మార్క్ 4. న్యూజిలాండ్
10. పోలవరం ప్రాజెక్టుకు గల మరొక పేరు?
    1. రాజీవ్ సాగర్ 2. ఇందిరా సాగర్ 3. లాల్ బహదూర్ శాస్త్రి ప్రాజెక్టు 4. నెహ్రూ సాగర్
11. శీతల దేశాల్లో థర్మామీటర్లలో పాదరసానికి బదులు దేనిని వాడతారు?
    1. సారాయి 2. హైపో 3. నీరు 4. ఆల్కహాల్

డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు

12. కింద పేర్కొన్న వారిలో ఎవరిని ఆంధ్ర భీష్మగా పిలుస్తారు?
    1. న్యాపతి సుబ్బారావు 2. గాజుల లక్ష్మీనరసు శెట్టి 3. నావిళ్ల వెంకటేశ్వర రావు శాస్త్రి 4. భోగరాజు పట్టాభి సీతారామయ్య
13. జెమినీ వైరస్ ఏ పంటకు సంబంధించింది?
    1. చెరుకు పంట 2. వేరుశనగ 3. మిర్చి పంట 4. కొబ్బరి
14. సమానమైన పీడనానికి చెందిన రేఖలు?
    1. ఐసోబార్స్ 2. ఐసోహెల్స్ 3. హైసోహైట్స్ 4. ఐసోనిప్



15. ప్రపంచంలో ఎలక్ట్రిక్ కోడ్ అమలులో ఉన్న మొదటి దేశం?
    1. భారత్ 2. చైనా 3. అమెరికా 4. స్వీడన్
16. ఇటీవల కేంద్ర కేబినెట్ గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సంబంధించి ఏ దేశంతో ఒప్పందానికి ఆమోదం తెలిపింది?
    1. కెన్యా 2. మారిషస్ 3. అమెరికా 4. నైజీరియా
17. 'యెట్, ఐయామ్ నాట్ డిఫీటెడ్' పుస్తక రచయిత?
    1. జుంపాలాహరి 2. జ్యోతి రెడ్డి 3. అమిత్ వర్మ 4. ఎస్.వి. శేషగిరిరావు
18. తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి అధునాతన రూఫ్ సస్పెండెడ్ అల్ట్రా మోడర్న్ డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని విరాళంగా ఇచ్చింది?
    1. డీ మార్ట్ - ఆంధ్రప్రదేశ్ 2. రిలయన్స్ ట్రెండ్స్ అండ్ డిజిటల్స్ 3. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 4. చెన్నై షాపింగ్ మాల్
19. కామన్‌వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ మీటింగ్: ఏప్రిల్ 2018 ఎక్కడ నిర్వహించారు?
    1. లండన్ 2. బ్రిస్బేన్ 3. జోహన్నస్‌బర్గ్ 4. డబ్లిన్
20. బాలికపై అత్యాచారం ఘటనలో పోక్సో కోర్టు ఒక్కరోజులోనే విచారణ పూర్తి చేసి, నిందితునికి శిక్ష విధించిన సంఘటన ఏ రాష్ట్రంలో చోటు చేసుకున్నది?
    1. తమిళనాడు 2. కేరళ 3. బీహార్ 4. కర్ణాటక

పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్

21. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం టీచర్ల మొత్తం సంఖ్యలో ఖాళీలు ఎంత శాతానికి వించరాదు?
    1. 10 2. 15 3. 20 4. 30
22. ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఉపాధ్యాయునికి ఇచ్చే టీచర్స్ గ్రాంట్ ఎంత?
    1. 500 2. 1000 3. 1500 4. 2000
23. కె.జి.బి.వి. పాఠశాలలు ఎవరి కొరకు ఏర్పాటు చేశారు?
    1. 6, 7, 8 తరగతులు చదువుతూ బడిమానేసిన పిల్లలు 2. 5వ తరగతి చదివి బడి మానేసిన పిల్లలు 3. 9, 10 చదువుతూ బడి మానేసిన పిల్లలు 4. పైవన్నీ
24. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా ఎవరు ఉంటారు?
    1. గ్రామ సర్పంచ్ 2. గ్రామ వైస్ సర్పంచ్ 3. గ్రామ ప్రత్యేకాధికారి 4. పాఠశాల ప్రధానోపాధ్యాయులు
25. మత, భాషా సంబంధ మైనార్టీలు విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించుకునే స్వేచ్ఛను కల్పిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్?
    1. 26 2. 27 3. 30 4. 28
26. 6-14 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించే ప్రయత్నంలో ఏ వ్యక్తికి విద్యకు సంబంధించిన హక్కును హరించకూడదని చెప్పే ఆర్టికల్?
    1. 24 2. 23 3. 21 4. 45
27. నిరంతర విద్యా కేంద్రాన్ని ఎంత మంది జనాభాకు ఒకటి నియమిస్తారు?
    1. 1000 2. 1500 3. 2000 4. 3000
28. కేంద్ర ప్రభుత్వం డీపీఈపీ పథకాన్ని ప్రారంభించిన తేదీ?
    1. 11-8-1995 2. 8-11-1994 3. 6-8-1992 4. 7-11-1996
29. ఎస్ఎస్ఏ కార్యక్రమం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ప్రణాళికలో కేటాయించిన నిష్పత్తి, తొమ్మిది, పది, పదకొండో పంచవర్ష ప్రణాళికల్లో వరుసగా..
    1. 85:15, 25:25, 50:50 2. 80:20, 70:30, 50:50 3. 80:20, 75:25, 60: 40 4. 85:15, 70:30, 60:40
30. ప్రస్తుతం మన రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక విద్య ఏ వయసు వారికి ఇస్తున్నారు.
    1. 3-5 2. 4-6 3. 2-5 4. 4-7
31. మానసిక వైకల్యం గల పిల్లల ప్రవర్తనను అభివృద్ధి పరిచే పద్ధతి?
    1. ఆకృతీకరణ 2. గొలుసు విధానం 3. ప్రేరణ 4. పైవన్నీ
32. ఏ రకమైన వినికిడి లోపాన్ని ఔషధాలు, శస్త్ర చికిత్సల ద్వారా తగ్గించవచ్చు.
    1. వ్యతిరిక్త, వినికిడి లోపం 2. అపరివర్తన వినికిడి లోపం 3. అన్యావర్త వినికిడి లోపం 4. ఏదీకాదు
33. నవోదయ పాఠశాలలను ప్రతి జిల్లాలో స్థాపించాలని సూచించిన కమిటీ?
    1. జనార్దన్‌రెడ్డి కమిటీ 2. కొఠారి కమిషన్ 3. ఎన్ఈపీ-1986 4. యశ్‌పాల్ కమిటీ
34. N.C.F ను విస్తరించండి.
    1. National Continious Frame 2. National Curriculam Frame 3. National Council for Education 4. National Conference For Education
35. CABE స్థాపించిన సంవత్సరం?
    1. 1920 2. 1921 3. 1924 4. 1926

(మిగతా ప్రశ్నలు, సమాధానాలు ఈ-పేపర్‌లో చూడవచ్చు)

సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 2 5) 4 6) 1 7) 3 8) 1 9) 4 10) 2 11) 4 12) 1 13) 3 14) 1 15) 4 16) 2 17) 2 18) 1 19) 1 20) 3 21)1 22) 1 23) 1 24) 4 25) 3 26) 3 27)1 28) 2 29) 1 30) 1 31) 4 32) 2 33) 3 34) 2 35) 2

పై ప్రశ్నలను హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

దిక్సూచి DIKSUCHI

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్)- బీఎస్సీ నర్సింగ్, బీపీటీ(ఫిజియోథెరపీ), బీఎస్సీ ఏహెచ్ఎస్ (పారామెడికల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

టీటీడీ స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 100 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పది సీట్లు కేటాయించారు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.41,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) గుర్తింపు ఉంది.

బీపీటీ: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు, ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటాయి. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదు సీట్లు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.41,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్(ఐఏపీ) గుర్తింపు ఉంది.

బీఎస్సీ(పారామెడికల్): ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు, ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.29,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఏపీ పారామెడికల్ బోర్డు గుర్తింపు ఉంది.

- **స్పెషలైజేషన్‌లు-సీట్లు:** అనెస్తీషియా టెక్నాలజీ 12, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 20, రేడియోగ్రఫీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ 9, కార్డియాక్ పల్మనరీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2, ఈసీజీ అండ్ కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ 8, డయాలసిస్ టెక్నాలజీ 12, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ టెక్నాలజీ 4, న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ 4, రేడియోథెరపీ టెక్నాలజీ 5, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ 2

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంబంధిత విభాగంలో ఇంటర్ ఒకేషనల్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన వారు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు సంబంధిత బ్రిడ్జ్ కోర్సు ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ/హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. ఏపీ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి.

- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి కనీసం 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠంగా 35 ఏళ్లు మించకూడదు. 25 ఏళ్లు నిండిన అభ్యర్థులందరూ డిక్లరేషన్ ఫారం సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22 ● **వెబ్‌సైట్:** svimstpt.ap.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HzFxAAQలో చదవండి.

చట్టనిబంధనల మేరకు నడుచుకోండి

» వైసీపీ కార్యాలయాల వ్యవహారంపై అధికారులకు హైకోర్టు ఆదేశం

» 2 వారాల్లో అధికారులకు వివరణ ఇవ్వండి.. పిటిషనర్లకు కోర్టు సూచన



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీ కార్యాలయ భవనాల కూల్చివేత వ్యవహారంలో చట్ట నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను ఎందుకు కూల్చివేయకూడదో చెప్పాలంటూ అధికారులు జారీ చేసిన నోటీసులపై వివరణ ఇచ్చేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. తమ వాదనలకు బలం చేకూర్చే దస్త్రాలను, ఆధారాలు, అదనపు వివరణలను రెండు వారాల్లో అధికారుల ముందు ఉంచాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. అనంతరం ప్రతీ భవనానికి సంబంధించి పిటిషనర్లు సమర్పించిన వివరణలను పరిశీలించి, విచారణ జరపాలని పేర్కొంది. చట్టనిబంధనల్లో పేర్కొన్న విధంగా అవసరమైన ప్రతీ దశలోనూ పిటిషనర్లు తమ వాదనలు చెప్పుకొనేందుకు అవకాశం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేసింది. విచారణ పెండింగ్‌లో ఉండగా భవనాల విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. నిర్మాణాలు ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా, స్థానికులకు ప్రమాదకరంగా ఉన్నప్పుడు మాత్రమే కూల్చివేత ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేసింది. విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉంటే తప్ప కూల్చివేత అధికారాన్ని వినియోగించవద్దంది. వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం తీర్పు ఇచ్చారు.

భద్రత పునరుద్ధరణకు ఆదేశించండి

» హైకోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి అంబటి

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): తనకి ఉన్న 4 ప్లస్ 4 భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను జూలై 10కి వాయిదా వేశారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎస్ చక్రవర్తి గురువారం ఆదేశాలిచ్చారు.

ఏపీ నుంచి రిలీవ్ చేయండి: తెలంగాణ ఉద్యోగులు

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి తమను రిలీవ్ చేయాలని తెలంగాణ నేటివ్ ఎంప్లాయిస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేసినట్లు అసోసియేషన్ నేతలు గురువారం చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ నేటివ్ ఉద్యోగులను ఏపీకి కేటాయించారు. వారిలో కొందరు తిరిగి తెలంగాణకు వెళ్లిపోయారు. మిగిలిన వారిని కూడా పంపాలని వారు తాజాగా కోరారు. పదేళ్లయినా తమను స్వరాష్ట్రానికి పంపకపోవడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ సీఎంలు 6న భేటీ కానున్న నేపథ్యంలో తమ సమస్యపై చర్చిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

తమిళనాడులో తెలుగును బతికించండి

» చంద్రబాబుకు తెలుగు యువశక్తి విజ్ఞప్తి

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో తెలుగు భాషను బతికించడానికి కృషి చేయాలని తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో నివాసం ఉంటూ, తెలుగు మాధ్యమంలో చదువుకునే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి, ఇక్కడి తెలుగు వారికి తెలుగులో విద్య బోధించేలా వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చినట్టు జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

తెలుగు, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీల విభజన తేలేది సీఎంల సమావేశం తర్వాతనే!

హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాల మధ్య విభజన అంశాలపై శనివారం జరగనున్న ముఖ్యమంత్రుల సమావేశం తర్వాతనే తెలుగు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏవోయూ)లకు సంబంధించిన పలు అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సీఎంల భేటీ అనంతరమే వీటిలో ప్రవేశాలకు నోటిఫికేషన్లు జారీకానున్నాయి. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున.. ఈ విశ్వవిద్యాలయాలు ఆయా రాష్ట్రాల వారీగా కార్యకలాపాలను కొనసాగించాల్సి ఉంటుంది. కానీ, ఏపీ పూర్తి స్థాయి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రవేశాలు, ఇతర కార్యకలాపాలపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న సీఎంల సమావేశంలో తెలుగు, బీఆర్ఏవోయూల విభజన కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. కార్యకలాపాలు వేర్వేరుగా కొనసాగించడంపై విశ్వవిద్యాలయాల అధికారులు గతంలోనే ఏపీకి లేఖ రాశారు. వారు మాత్రం ఈ ఏడాదికి మినహాయింపును కోరారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ఎలాంటి నిర్ణయమూ వెలువడలేదు.

బొత్స వద్దన్నారు.. అధికారులు సరేనన్నారు..!

» బొత్స ఒత్తిడితో విద్యాకానుక టెండర్లకు మంగళం

» నామినేషన్ కాంట్రాక్టు వెనుక సూత్రధారి ఆయనే

» తొలుత టెండర్ల కోసం సర్కారుకు సమగ్ర శిక్ష ఫైలు

» మాజీ మంత్రి ఒత్తిడితో నేరుగా ఇచ్చేలా జీవో

» తర్వాత షార్ట్ టెండర్లు పిలవాలని నిర్ణయం

» దానినీ అడ్డుకున్న అప్పటి విద్యాశాఖ మంత్రి

» ఫలితంగా ఇప్పుడు అరకొరగా కిట్ల సరఫరా

» సకాలంలో స్కూళ్లకు చేరని విద్యాకానుక కిట్లు

» విచారణ లేకుండా ఓ అధికారి ప్రయత్నాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

విద్యా కానుకను కావాల్సిన వారికి కట్టబెట్టడం వెనుక విద్యా శాఖ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హస్తం ఉందన్న విషయం వెలుగులోకి వస్తోంది. ఆయన ఒత్తిడితోనే అప్పట్లో అధికారులు టెండర్లకు మంగళం పాడేశారు. తొలుత టెండర్లు పిలవకుండా బలవంతంగా జీవో ఇప్పించిన ఆయన ఆ తర్వాత షార్ట్ టెండర్లకు వెళ్దామని అధికారులు సూచించినా ఒప్పుకోలేదు. టెండర్లు లేకుండా నేరుగా కాంట్రాక్టు ఇచ్చేవరకూ ఆయన అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. చివరికి ఆయన కోరుకున్నట్టుగా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టు కట్టబెట్టారు. అయితే ఆ ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది. బడులు తెరిచి నెల కావస్తున్నా ఎక్కడా విద్యార్థులకు పూర్తిస్థాయి స్టూడెంట్ కిట్లు అందించలేదు. కాంట్రాక్టర్లే మొత్తం వస్తువులను రాష్ట్రానికి పంపలేదు. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందన్న ధీమాతో కాంట్రాక్టర్లు ఈ నిర్లక్ష్య ధోరణి అవలంబించారు. సకాలంలో వస్తువులు ఉత్పత్తి చేయలేదు. దీంతో.. ప్రభుత్వం మారినా ఇప్పుడు చేసేదేం లేకుండా పోయింది. స్టూడెంట్ కిట్ల పంపిణీలో తీవ్ర జాప్యానికి నామినేషన్‌పై కాంట్రాక్టు ఇవ్వడమేనని స్పష్టమవుతోంది.

అప్పట్లో ఇదీ జరిగింది

విద్యా కానుక కోసం ఏటా సమగ్రశిక్ష విభాగం టెండర్లు పిలుస్తుంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యాకానుక కోసం గతేడాది సెప్టెంబరులో టెండర్ల ఫైలును సమగ్రశిక్ష కార్యాలయం ప్రభుత్వానికి పంపింది. అయితే ఈసారి టెండర్లు అక్కర్లేదని అప్పటి మంత్రి బొత్స అధికారులపై ఒత్తిడి చేశారు. దీంతో ఎలాంటి నిర్ణయం లేకుండానే దాదాపు నాలుగు నెలలపాటు టెండర్ల ఫైలును పక్కన పెట్టారు. చివరికి జనవరిలో టెండర్లు లేకుండా కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి కాంట్రాక్టు ఇచ్చేయాలని అప్పటి పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లతో అధికారులు చర్చలు జరిపారు. పాత బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున మళ్లీ కాంట్రాక్టు తీసుకోలేమని తొలుత కాంట్రాక్టర్లు వెనకడుగు వేశారు. దీంతో ఈ తలనొప్పిని అధిగమించేందుకు షార్ట్ టెండర్లు పిలిచి ఎంపిక చేద్దామని ప్రవీణ్ ప్రకాశ్ నిర్ణయించారు. దానివల్ల తమకు కావాల్సిన కాంట్రాక్టర్లు ఉండరు కాబట్టి బొత్స దాన్ని కూడా అడ్డుకున్నారు. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే కారణం చూపిస్తూ రెండు విడతలుగా రూ.300 కోట్లు చొప్పున రూ.600 కోట్లు పాత బకాయిలు ఇచ్చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దలు 5 నుంచి 7శాతం కమీషన్లు నొక్కేశారు. దాదాపు రూ.40 కోట్లు ముడుపులు ఇచ్చామన్న ధైర్యంతో కాంట్రాక్టర్లు ఇప్పుడు కిట్ల సరఫరాను ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటివరకూ మండల కేంద్రాలకు కూడా పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్లు సరఫరా కాలేదు. పిక్టోరియల్ డిక్షనరీ, నోట్ పుస్తకాలు, బెల్టులు మాత్రమే వెళ్లాయి. పాఠ్య పుస్తకాలు 96 శాతం, బ్యాగులు 94 శాతం, బూట్లు 96 శాతం, యూనిఫాంలు 63 శాతం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 52శాతం చేరాయి. వీటిలో కూడా సగమే పాఠశాలలకు వెళ్లాయి. 28.88లక్షల మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ జరిగిందని పాఠశాల విద్యాశాఖ చెబుతున్నా ఎక్కడా పూర్తిస్థాయిలో అందలేదు. విద్యార్థులకు ఒకట్రెండు వస్తువులు మాత్రమే పంపిణీ చేశారు. యూనిఫాంలు అతి కొద్ది మందికే అందాయి. కిట్‌లో విగిలిన వస్తువులు రాకపోవడంతో పాఠశాలలో తొలుత పాఠ్య పుస్తకాల పంపిణీకి ప్రాధాన్యత ఇస్తున్నారు.

> విద్యా కానుక కిట్ల కోసం సమగ్రశిక్ష విభాగం ఏటా టెండర్లు పిలుస్తుంది. 2024-25 విద్యా సంవత్సరానికి కూడా గతేడాది సెప్టెంబరులోనే టెండర్ల ఫైలును ప్రభుత్వానికి పంపింది. కానీ, అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స ఈసారి టెండర్లు అక్కర్లేదన్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు కావాల్సిన వారికి నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు కట్టబెట్టేలా చూశారు. ఆయన నిర్వాకం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఇప్పుడు విద్యార్థులకు శాపంగా మారింది. బడులు తెరిచి నెల కావస్తున్నా ఇంతవరకు విద్యాకానుక కిట్లు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందలేదు.

విచారణ అవసరం లేదంటూ...

విద్యా కానుక కాంట్రాక్టుల విషయంలో విచారణకు ఆదేశించకుండా ఉండేందుకు ఓ ఉన్నతాధికారి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాల విద్యాశాఖలో మొత్తం ముగ్గురు ఉన్నతాధికారులు కీలకంగా వ్యవహరించారు. వారిలో ఒకరు టీచర్ల పట్ల నియంతృత్వ ధోరణి ప్రదర్శించారు. మరో అధికారి అక్రమాలు జరుగుతున్నా మౌనంగా ఉండిపోయారు. వీరిద్దరూ కమీషన్ల వ్యవహారంలో ఎక్కడా జోక్యం చేసుకోలేదు. మరో అధికారి మాత్రం అన్నీ తానై చక్రం తిప్పారు. ఆయనే ఇప్పుడు విద్యా కానుకపై విచారణ జరగకుండా చూసే ప్రయత్నం చేస్తున్నారు. అప్పట్లో మంత్రితో అంటకాగిన ఆ అధికారి ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కూడా కీలకంగా వ్యవహరించేందుకు తాపత్రయపడుతున్నారు. గత ప్రభుత్వంలో అన్నీ అక్రమాలేనని టీడీపీ గగ్గోలు పెడుతుంటే ఆ ఉన్నతాధికారి మాత్రం ఆ ఆరోపణలన్నీ అవాస్తవమని, అంతా సక్రమంగానే జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కాగా టెండర్లు లేకుండా కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి కాంట్రాక్టులు కట్టబెట్టాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించినప్పుడు... సరిగ్గా పాత కాంట్రాక్టర్లు 19 మందినే తీసుకొచ్చి అప్పనంగా కాంట్రాక్టులు ఎందుకు ఇచ్చారనే దానిపై ఆయనే సమాధానం చెప్పాలి.

పాఠ్య పుస్తకాల్లోనూ కమీషన్లు

ఎప్పుడూలేని విధంగా పాఠ్య పుస్తకాల్లోనూ బొత్స కార్యాలయం కమీషన్లు వసూలు చేసింది. పాత బిల్లుల విడుదలకు ప్రింటింగ్ ఏజెన్సీల నుంచి 2.5 శాతం కమీషన్లు తీసుకున్నారు. అలా ఇస్తేనే బిల్లులు విడుదల చేస్తామని మెలిక పెట్టడంతో ఆ మేరకు ఇచ్చి నగదు తీసుకున్నారు. ఇక 2024-25 విద్యా సంవత్సరంలో లోకల్ ప్రింటర్లను కాంట్రాక్టుకు దూరం చేశారు. 5 నుంచి 10శాతం కమీషన్ డిమాండ్ చేయడంతో తమ వల్ల కాదని లోకల్ ప్రింటర్లు తప్పుకొన్నారు. ఆ మేరకు అంగీకరించిన వారికి కాంట్రాక్టు దక్కింది. చరిత్రలో తొలిసారిగా పాఠ్యపుస్తకాల ప్రింటర్ల నుంచి ముడుపులు తీసుకున్నది బొత్స కార్యాలయమేనని ప్రింటర్లు చెబుతున్నారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

» సీలింగ్ ఫ్యాన్‌కు ఏర్పాటు చేయని హెచ్చరికల పరికరం

కోటా, జూలై 4: కోచింగ్ కేంద్రాలకు నిలయమైన రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. జేఈఈకి శిక్షణ తీసుకుంటున్న బిహార్‌లోని నలందా జిల్లాకు చెందిన సందీప్ కుమార్ కుర్మి (16) బుధవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. రెండేళ్లుగా ఇక్కడి మహావీర్ నగర్‌లోని పేయింగ్ గెస్ట్ (పీజీ) రూంలో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. చదువుల్లో మామూలు విద్యార్థి అని, తరచూ తరగతులకు గైర్హాజరవుతుంటాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆయన సోదరుడు కోటాలోనే మరో చోట ఉంటూ నీట్‌కు శిక్షణ తీసుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం తల్లీదండ్రులు మరణించడంతో మేనమామ వారిద్దర్నీ చదివిస్తున్నారు. కోటాలో జనవరి నుంచి ఇంతవరకు 13 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. ఆత్మహత్యల నివారణకు పీజీ రూంల్లోని ఫ్యాన్లకు హెచ్చరికల పరికరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ పరికరం స్ప్రింగ్‌లా ఉంటుంది. 20 కిలోల కన్నా ఎక్కువ బరువు వేలాడితే ఆ స్ప్రింగ్ సాగి సైరన్ మోగుతుంది.



వర్షాలతో వణుకుతున్న ఉత్తరాఖండ్

డెహ్రాడూన్, జూలై 4: ఎడతెరపి లేని వానలు ఉత్తరాఖండ్‌ను వణికిస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ రాష్ట్రంలోని ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అలకనంద, మందాకిని, భగీరథి నదులు ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటేసి ప్రవహిస్తుండగా.. గంగా, సరయు నదులు ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. గోమతి, కాళీ, గౌరీ, శారద నదుల్లో కూడా నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో రాష్ట్రంలో రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు.. ముందు జాగ్ర త్త చర్యల్లో భాగంగా దాదాపు 100 రహదారులను మూసివేశారు. అలకనంద నది ఉప్పొంగడంతో రుద్రప్రయాగ వద్ద నది పక్కన ఏర్పాటు చేసిన 10 అడుగుల శివుడి విగ్రహం నీట మునిగింది. చంపావత్, అల్మోరా, పిథోర్‌గఢ్, ఉధమ్‌సింగ్ నగర్, కుమావ్ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో మరో వారంరోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఉత్తరాఖండ్ వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల కారణంగా డెహ్రాడూన్, పౌరి, తెహ్రీ, హరిద్వార్‌లోనూ ఆరెంజ్ అలర్ట్ (సిద్ధంగా ఉండాలి) ప్రకటించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గంగా, అలకనంద, భగీరథి, శారద, మందాకిని, కోసి నదుల్లో నీటిమట్టం భారీగా పెరిగింది. గత 24 గంటల్లో అల్మోరాలోని చౌకుటియాలో అత్యధికంగా 72.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. లోతట్టు ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీ తీరప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మా ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చెయ్యండి

» ఎటపాక మండలంలోని పంచాయతీల తీర్మానం

హైదరాబాద్, కొత్తగూడెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకలగూడెం గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ ఆయా గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయి. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సచివాలయంలో గురువారం కలిసిన ఆ పంచాయతీల ప్రతినిధులు తీర్మాన ప్రతులను అందజేశారు. త్వరలో ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ అవుతున్న నేపథ్యంలో తాము ఈ తీర్మానం చేసినట్టు వారు మంత్రికి తెలిపారు. తమ గ్రామాలు తెలంగాణలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలో గురువారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న తమ్మినేని.. కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఏకపక్షంగా భద్రాచలాన్ని ముక్కలు చేసిందని ఆరోపించారు. అలాగే, ఏపీలో విలీనమైన పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలో ఉన్న భద్రాచలం దేవస్థానం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వీరభద్రం పేర్కొన్నారు.

ఏళ్లతరబడి పాతుకుపోయారు

» దేవదాయ శాఖ అంతర్గత బదిలీలపై విమర్శలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో జరుగుతున్న అంతర్గత బదిలీలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఏళ్ల తరబడి కీలక సెక్షన్లలో పాతుకుపోయిన వారికే మళ్లీ కీలక పోస్టింగ్‌లు ఇస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గురువారం పదిమంది కీలక ఉద్యోగుల సెక్షన్లు మారుస్తూ దేవదాయ శాఖ అంతర్గత బదిలీలు చేపట్టింది. దేవదాయ శాఖలో అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ చాలా కీలకం. ఇందులో టెంపుల్ ఎంప్లాయిస్ సర్వీస్ వ్యవహారాలతో పాటు దేవదాలయాల లీజులు, లైసెన్సుల సెక్షన్ చాలా కీలకం. ఈ రెండు సెక్షన్లల్లో కొన్నేళ్లుగా పాతుకుపోయిన వారినే అటూ ఇటూ మార్చేశారు. ఏళ్ల తరబడి అడ్మినిస్ట్రేషన్, భూముల ఎన్‌వోసీలకు సంబంధించిన సెక్షన్లలో ఉన్న గెజిటెడ్ సూపరింటెండెంట్లను దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మార్చడం లేదు. విమర్శలు వస్తున్నా వారినే కొనసాగిస్తున్నారు. దీని వల్ల ప్రధాన కార్యాలయంలో కొంత అవినీతి పెరిగిందనే విమర్శలు ఉన్నాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి సెక్షన్లు మారుస్తామన్న నిబంధనలు ఏమయ్యాయనే ప్రశ్నలు వినిపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఆలోచించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

మా కుమారుడి వివాహానికి రండి

» సోనియా గాంధీని ఆహ్వానించిన ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ, జూలై 4: ఈ నెల 12న జరిగే తన చిన్న కుమారుడి పెళ్లికి రావాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని టెన్ జన్‌పథ్‌లోని సోనియా నివాసానికి వెళ్లి ఆమెతో భేటీ అయ్యారు. అనంతరం పెళ్లి శుభలేఖను అందజేశారు. ముకేశ్ అంబానీ చిన్న కుమారుడికి, రాధికా మర్చెంట్‌కు ముంబైలోని బాంద్రా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో వివాహం జరగనుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 5 జూలై 2024
cinema@andhrajyothy.com



డబ్బింగ్ పనుల్లో విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌కు 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో తెరకెక్కుతోన్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో హనుమంతుడి భక్తుడిగా చిరంజీవి కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

గురువారం వస్తున్న శనివారం

నాని విభిన్న రకాల 'షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్‌జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29 గురువారం నాడు పాన్ ఇండియా లెవెల్లో విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్ అందరినీ ఆకట్టుకున్నాయి. గురువారం ఈ సినిమా నుంచి నాని పోషిస్తున్న క్యారెక్టర్ నుంచి మరో లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది వరకు రిలీజైన పోస్టర్స్‌లో యాంగ్రీ లుక్‌లో కనపడిన నాని.. ఈ పోస్టర్‌లో మాత్రం బైక్ నడుపుతూ చాలా కూల్ లుక్‌లో పక్కింటి అబ్బాయి తరహా పాత్రలో కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, డీఓపీ: మురళి.జి



జీబ్రా లుక్



టాలీవుడ్ హీరో సత్యదేవ్, కన్నడ కథానాయకుడు డాలీ ధనంజయ నటిస్తున్న మల్టీస్టారర్ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఎస్.ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేశ్ సుందరం నిర్మిస్తున్నారు. గురువారం సత్యదేవ్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'జీబ్రా' నుంచి ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. పోస్టర్‌లో సత్యదేవ్ సూట్‌లో, భుజంపై బ్యాగ్, చేతిలో పెన్నుతో స్టైలిష్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. నిర్మాతలు త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిక్కినాటో హీరోయిన్స్. సునీల్, సత్యరాజ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సత్య పొన్మార్. ఎడిటర్: అనిల్ క్రిష్

ప్రభాస్ చేతుల మీదుగా...



సుహాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'జనక అయితే గనక'. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకోగా.. గురువారం ప్రభాస్ చేతుల మీదుగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు' అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్య తరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ, సంగీత్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, డీఓపీ: సాయిశ్రీరామ్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అకుల్.

నటిగా మారుతున్న కంటెంట్ క్రియేటర్



యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్.. నటిగా టాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే చిత్రంలో ఆమె నటిస్తున్నారు. గురువారం ఆమె పుట్టినరోజు సందర్భంగా గీతా ఆర్ట్స్ సంస్థ నిహారికకు విషెస్ తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని ప్రకటించింది. 'అందాల తార నిహారిక ఎన్.ఎమ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు. ప్రేమతో మిమ్మల్ని టాలీవుడ్‌లోకి ఆహ్వానిస్తున్నాం. తెరపై మీ నటనను చూడడానికి ఆతృతగా ఎదురుచూస్తున్నాము" అని పేర్కొన్నారు. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు మిలియన్లలో ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా



తెలుగు రియాలిటీ షోలలో కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేసిన తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 3 ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ షోలో రాబోయే ఎపిసోడ్‌కు టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ప్రోమోను మేకర్స్ సోషల్ మీడియాలో విడుదల చేయగా వైరల్ అయింది. మన తెలుగు కంటెస్టెంట్స్‌కు మద్దతు ఇవ్వాలి, మీ జర్నీలో ఉండాలని ఈ షోకు వచ్చాను అని విజయ్ చెప్పారు.



మన జీవితాల్లో సినిమాలు ఒక అంతర్భాగం. సినిమాలను.. వాటిలో నటించే నటీనటులను.. తీసే దర్శకులను విమర్శిస్తూ ఉంటాం. ప్రశంసిస్తూ ఉంటాం. మన ఇంట్లో మనుషులుగా చూసుకుంటూనే ఉంటాం. అలాంటి సినీ పరిశ్రమ పదేళ్లగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉంది. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులదే! వీరిద్దరూ శుక్రవారం సమావేశమవుతున్న నేపథ్యంలో- దీర్ఘకాలంగా సినిమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటో ఒకసారి పరిశీలిద్దాం.

సమస్యలివి... పరిష్కారాలేవి?

నంది అవార్డులు ఏవీ?

ఒకప్పుడు నంది అవార్డుల ఉత్సవమంటే సినిమావాళ్లకు ఓ పండుగ! అవార్డుల ప్రదానోత్సవాలు కూడా అంత ఘనంగా జరిగేవి. నటులకు ప్రోత్సాహకంగా ఉండేది. రెండు రాష్ట్రాలు విడిపడిన తర్వాత నంది అవార్డుల ప్రస్తావనే లేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'సింహ' పేరుతో చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అవార్డుల కోసం ఎంట్రీలు కూడా స్వీకరించింది. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ పదేళ్ల నుంచి తెలంగాణలో అవార్డుల ఊసే లేదు.

ఆంధ్రాలో పరిస్థితీ అంతే

ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో మూడేళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి కమిటీలు వేసి, నంది అవార్డులు ప్రకటించింది. అంతకుముందు రెండేళ్లుగా కూడా నంది అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకేసారి వేడుక నిర్వహించి మొత్తం ఐదేళ్ల కాలానికి ఒకేసారి నంది అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారం కోల్పోయి, జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. ఆయన నంది అవార్డుల గురించి పట్టించుకోనే లేదు. ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చి.. గద్దర్ పేరిట సినిమాలకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఆ తర్వాత దీని గురించి ప్రాథమికంగా కూడా చర్చ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి కానీ, విడివిడిగా కానీ చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

పరిశ్రమగా గుర్తించాలి

సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. అలా చేయడం వల్ల అనేక రాయితీలు లభిస్తాయి. ఫలితంగా చిత్ర నిర్మాణ వ్యయం తగ్గుతుంది. థియేటర్లు నిర్వహించేవారికి వెసులుబాటు కలుగుతుంది. ఖర్చులు కలసి వస్తాయి. రాయితీల కారణంగా చిత్ర నిర్మాణాల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం పెరుగుతుంది.

టికెట్ ధరల తికమక

సినిమా టికెట్ ధరలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంది. చిత్ర నిర్మాణ వ్యయం అంచనాలకు మించి పెరిగిన నేపథ్యంలో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుకోవడానికి భారీ చిత్ర నిర్మాతలు విడుదలకు ముందు ప్రభుత్వాలను అభ్యర్థించడం ఇటీవలి కాలంలో ఓ అలవాటుగా మారింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- రూ. వంద కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు ధరలు పెంచుకోవటానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే కొన్ని సార్లు బడ్జెట్ ఎక్కువ అయినా నిర్మాతలు ఖర్చును తక్కువగా చూపిస్తారు. దీని వల్ల గత ఏడాది రెండు పెద్ద సినిమాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతే కాకుండా ఎంత కాలం సినిమా టికెట్ ధరలు పెంచుకోవచ్చనే విషయంపై కూడా అస్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కల్కి సినిమాకు 14 రోజులు ధర పెంచటానికి ఇచ్చిన జీఓపై కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. కొన్ని సినిమాలకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చినా , ఆంధ్రా ప్రభుత్వం మొండిచేయి చూపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలు కలిపి టిక్కెట్ల ధర విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తే బావుంటుందని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి. ఇదే విధంగా బుక్‌మై షో వంటి యాప్‌లకు ప్రేక్షకులు అదనంగా సర్వీస్ టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 250 రూపాయల టికెట్ ధరకు అదనంగా సుమారు 49 రూపాయలు బుక్‌మై షో కు చెల్లించాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రభుత్వమే టికెట్లు విక్రయించే విధంగా యాప్‌లను అభివృద్ధి చేస్తే బావుంటుందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఈ తరహా యాప్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు.



తెలుగు చలనచిత్ర పరిశ్రమ

చిన్న సినిమాలూ బతకాలి!


ప్రతి ఏడాది తెలుగులో సుమారు 100 సినిమాలు విడుదల అవుతుంటాయి. వాటిల్లో పది నుంచి పదిహేను మాత్రమే పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే చిన్న సినిమాలు బతకాలంటే వాటికి ప్రత్యేకంగా రాయితీలు ప్రభుత్వ పరంగా ప్రకటించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు కూడా జరిగాయి. కానీ వాటిల్లో పురోగతి లేదు. థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న చిన్న చిత్రాల నిర్మాతలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి ఐదో ఆటగా చిన్న సినిమాను ప్రదర్శించుకోవడానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ఈ విషయం మీద కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే రాష్ట్రం విడిపోక ముందు సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రాలకు పది లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేది. ఆ తరహా చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఇది ఉపయుక్తంగా ఉండేది. అటువంటి విధానాన్ని మళ్లీ చేపట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

డిజిటల్ చార్జీలు కంట్రోల్ చేయలేమా?

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లోనే క్యూబ్(డిజిటల్ ఫార్మాట్‌లో చిత్రాల ప్రదర్శన) చార్జీలు ఎక్కువ. గతంలో ప్రింట్ల విధానం ఉండేది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు డిజిటలైజ్ అయ్యాయి. దీని వల్ల ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా- ఒక షో వేస్తే క్యూబ్‌కు రూ. 6500 చెల్లించాల్సిందే. ముఖ్యంగా సింగిల్ థియేటర్ యజమానులు ఈ పద్ధతి వల్ల చాలా నష్టపోతున్నారు. డిజిటల్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే సింగిల్ థియేటర్లకు మేలు జరుగుతుంది. . లేకపోతే నష్టాలు భరించలేక ఎక్కువ థియేటర్లు కల్యాణ మండపాలుగానో.. షాపింగ్ మాల్స్‌గానో మారిపోయే అవకాశముంది.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమ అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) తెలిపింది. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, కే శివప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో చిత్ర పరిశ్రమ ప్రభుత్వానికి అండగా నిలిచింది, ఇకపైనా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపింది. డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడిలో నటీనటులు, దర్శక నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు తమవంతు సహకారాన్ని అందిస్తారు, దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలసి చర్చిస్తాం' అని టీఎఫ్‌సీసీ తెలిపింది.



'జాయింట్ నంది అవార్డ్స్'...

తెలుగు సినీ రంగానికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో పైరసీ సమస్య ఒకటి. మరొకటి టికెట్ రేట్లు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా తగ్గిస్తే.. పరిశ్రమకు మేలు జరుగుతుంది. తెలుగు సినీ రంగానికి తోడ్పడేలా ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులు కలిపి 'జాయింట్ నంది అవార్డ్స్' ప్రకటిస్తే బాగుంటుంది. ఒక సంవత్సరం హైదరాబాద్‌లో, ఇంకో సంవత్సరం అమరావతిలో ఆ వేడుకలను జరపాలి. ఇలా చేస్తే తెలుగు సినిమాకు.. తెలుగు వారికి మరింత ప్లస్ అవుతుంది.

- డి.సురేశ్‌బాబు, నిర్మాత

నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది



రాష్ట్రాలు రెండే కాని.. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లోనూ ఆడుతోంది. గత ప్రభుత్వాలతో పోల్చితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు సినీరంగ అభివృద్ధికి, తోడ్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులు కలసి మళ్లీ నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ నిర్ణయం తెలుగు ప్రజలకు ఆనందం కలిగిస్తుంది. రేపు ముఖ్యమంత్రులిద్దరూ కలసి చర్చలు జరిపే నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులకు ఏదో ఒక పేరుతో అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది.

- ఎస్.వీ.రామారావు, సినీ చరిత్రకారుడు

యాక్షన్ సీక్వెన్స్ చేశా

మాల్వీ మల్హోత్రా

'తిరగబడరా సామి' లాంటి మంచి ఎంటర్‌టైనర్‌తో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమాలో కథానాయికగా ప్రాధాన్యం ఉన్నపాత్ర చేశాను' అని మాల్వీ మల్హోత్రా చెప్పారు. రాజ్ తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. మల్కాపురం శివకుమార్ నిర్మాత. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మాల్వీ మల్హోత్రా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



- మాది హిమాచల్ ప్రదేశ్. బుల్లితెరపై నా కెరీర్ మొదలైంది. హిందీ, మలయాళ, తమిళ చిత్రాల్లో నటించాను. 'తిరగబడరా సామి' నా తొలి తెలుగు చిత్రం. ఇందులో కథ నా పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అలాగే నాకో యాక్షన్ సీక్వెన్స్ కూడా ఉంది. ఇలాంటి అవకాశం కెరీర్ ఆరంభంలోనే నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలు చూస్తుంటాను. ఇందులో నా పాత్ర కూడా ఆయనలా ఉన్నది ఉన్నట్లు మాట్లాడేస్తుంది.
- యాక్షన్, డ్రామా, రొమాన్స్, ఫన్... ఇలా చాలా ఎలిమెంట్స్ ఉన్నాయి. రాజ్ తరుణ్ పాత్ర ఆసక్తికరంగా ఉంటుంది. సైలెంట్‌గా మొదలై వైలెంట్‌గా మారుతుంది.
- రవికుమార్ గారు చాలా మంచి విజన్ ఉన్న డైరెక్టర్. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. నిర్మాత శివ గారు సెట్‌లో అందరినీ సొంత మనుషుల్లా చూసుకున్నారు.
- మణిరత్నం, రాజమౌళి సినిమాల్లో నటించాలనేది నా లక్ష్యం. మహేశ్‌బాబు, అడివిశేష్ అంటే ఇష్టం. నాని కళ్లతోనే అద్భుతమైన భావోద్వేగాలను పండిస్తారు.

వేడుకగా నటి వరలక్ష్మి వివాహ రిసెప్షన్

సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్, ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ల వివాహం రిసెప్షన్ బుధవారం రాత్రి చెన్నైలోని ఓ నక్షత్ర హోటల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు మంత్రి ఉదయనిధి, మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్, శశికళతో సహా పలువురు రాజకీయ నేతలు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటులు శివకుమార్, విజయకుమార్, నాజర్, నెపోలియన్, ప్రభుదేవా, ఆర్య, సిద్ధార్థ్, జీవా, అరవింద్ స్వామి, గౌతం కార్తీక్, మోహన్‌బాబు, సుదీప్, జాకీ ష్రాఫ్, తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్, సినీ నటి ఖుష్బూ, ఆండ్రియా, సుకన్య, దేవయాని, రమ్యకృష్ణ, రోజా, సుహాసిని, సీత, సంగీత దర్శకులు దేవ, శ్రీకాంత్ దేవా, తమన్, దర్శకులు భారతీరాజా, ఎస్ఏ చంద్రశేఖరన్, మణిరత్నం, కేఎస్ రవికుమార్, పి.వాసు, బాలా, సురేష్ కృష్ణ, ఆర్కే సెల్వమణి, చేరన్, ఐశ్వర్య రజనీకాంత్, ఎ.వెంకటేష్, ఏఎల్ విజయ్, అట్లీ, వసంత్‌బాలన్, నిర్మాతలు ఆర్‌బీ చౌదరి, ఏఎం రత్నం, ఐసరి కె.గణేష్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. వివాహానికి ముందు జరిగిన సంగీత్ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, నటి త్రిష పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు









ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 5 జూలై 2024

టీటీడీ స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్)- బీఎస్సీ నర్సింగ్, బీపీటీ(ఫిజియోథెరపీ), బీఎస్సీ ఏహెచ్‌ఎస్(పారామెడికల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 100 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పది సీట్లు కేటాయించారు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.41,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) గుర్తింపు ఉంది.

బీపీటీ: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు, ఆర్నెల్ల ఇంటర్న్‌షిప్ ఉంటాయి. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదు సీట్లు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.41,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్(ఐఏపీ) గుర్తింపు ఉంది.

బీఎస్సీ(పారామెడికల్): ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు, ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.29,000. ఈ ప్రోగ్రామ్‌నకు ఏపీ పారామెడికల్ బోర్డు గుర్తింపు ఉంది.

- **స్పెషలైజేషన్‌లు-సీట్లు:** అనెస్తీషియా టెక్నాలజీ 12, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 20, రేడియోగ్రఫీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ 9, కార్డియాక్ పల్మనరీ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2, ఈసీజీ అండ్ కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ 8, డయాలసిస్ టెక్నాలజీ 12, ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ టెక్నాలజీ 4, న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ 4, రేడియోథెరపీ టెక్నాలజీ 5, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ 2

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంబంధిత విభాగంలో ఇంటర్ ఒకేషనల్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు సంబంధిత బ్రిడ్జ్ కోర్సు ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ/హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. ఏపీ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి.


- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి కనీసం 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠంగా 35 ఏళ్లు మించకూడదు. 25 ఏళ్లు నిండిన అభ్యర్థులందరూ డిక్లరేషన్ ఫారం సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2596; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2077
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22
- **ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 30
- **అభ్యంతరాల స్వీకరణ:** ఆగస్టు 1 వరకు
- **ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 5
- **మొదటి కౌన్సెలింగ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 10
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్, కాలేజ్ ఫీజు చెల్లింపు:** ఆగస్టు 13, 14
- **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

టీజీ సెట్ 2024

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీజీ సెట్)- 2024 ఫీజు చెల్లింపు తేదీని ఉస్మానియా యూనివర్సిటీ పొడిగించింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు. పరీక్షను ఆగస్టులో నిర్వహించనున్నారు. 29 సబ్జెక్టుల్లో సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో పరీక్ష ఉంటుంది.



- తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీజీ సెట్)- 2024

సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు

పరీక్ష విధానం: పరీక్షను కంప్యూటర్ ఆధారిత(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు(100 మార్కులు), పేపర్-2లో 100 ప్రశ్నలు(200 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష రుసుము: ఓసీలకు రూ.2000; బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 8

పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 28, 29, 30, 31

వెబ్‌సైట్: http://telanganaset.org/index.html

మౌలానా ఆజాద్ వర్సిటీలో ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

వెబ్‌సైట్: https://manuu.edu.in

ఎంటెక్(సీఎస్ఈ) పార్ట్ టైమ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఉర్దూ/ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. హాస్టల్ సౌకర్యం లేదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.


అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఏఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ ప్రోగ్రామ్‌లు: ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ విభాగాల్లో ఏడాది వ్యవధి గల సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు; రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ప్రోగ్రామ్‌లు; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటికి హైదరాబాద్‌లోని సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సహకారం అందిస్తోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. మనూ మోడల్ స్కూల్స్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; మనూ పాలిటెక్నిక్‌లలో చదివినవారు; మనూ నుంచి డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 7



డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

1. విటమిన్‌ను కనుగొన్నది ఎఫ్.జి.హాప్కిన్. అయితే విటమిన్ అని పేరు ప్రతిపాదించిన ఫంక్ ఏ దేశస్థుడు
   1. అమెరికా 2. బ్రిటన్ 3. జపాన్ 4. చైనా
2. పార్కర్ సోలార్ ప్రోబ్‌ను నాసా ఎవరి గౌరవార్థం పేరు పెట్టి సూర్యగోళ అధ్యయనానికి పంపిస్తోంది?
   1. యూజీన్ పార్కర్, ప్రఖ్యాత ఆస్ట్రోఫిజియిస్ట్
   2. ఎస్. చంద్రశేఖర్ 3. గ్రెగర్ మెండల్
   4. చార్లెస్ డార్విన్
3. నాగార్జున సాగర్ - శ్రీశైలం సంరక్షణ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో ఉంది?
   1. గుంటూరు 2. కర్నూలు
   3. నల్లగొండ 4. 1, 2
4. నేల సహాయం లేకుండా మొక్కలు పెంచే విధానాన్ని అధ్యయనం చేసే శాస్త్రం?
   1. క్రయోజనిక్స్ 2. హైడ్రో ఫోనిక్స్
   3. జెనిటిక్స్ 4. ఫొనెటిక్స్
5. ఒలింపిక్ క్రీడల్లో పతకాన్ని గెలుచుకున్న మొదటి మహిళ?
   1. ఫ్లోరెన్స్ గ్రిఫిత్ జాయనర్ 2. మెర్లిన్ బట్టి
   3. మెరియన్ జోన్స్ 4. చార్లోటీ కూపర్
6. జన్యువును కృత్రిమంగా ప్రయోగశాలలో సంశ్లేషణ చేసినందుకు నోబెల్ బహుమతి పొందిన భారతీయ శాస్త్రవేత్త?
   1. హరగోవింద్ ఖురాన 2. అబ్దుల్ కలాం
   3. ఎల్లాప్రగడ సుబ్బారావు 4. గ్రెగర్ మెండల్
7. మధుమేహ వ్యాధి చికిత్సలో వాడే ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న వారు?
   1. హిదేకి యుకోవా 2. ఎడ్వర్డ్ జన్నర్
   3. సర్ ఫ్రెడ్రిక్ గ్రాంట్ బెంటింగ్
   4. సర్ జేమ్స్ యంగ్ సింప్సన్
8. 1948లో భాష ఆధారంగా రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చేయడానికి ఏర్పాటైన కమిషన్?
   1. థార్ కమిషన్ 2. షా కమిషన్
   3. ఫజల్ అలీ కమిషన్ 4. కోస్లా కమిషన్
9. పురిటి నొప్పులతో ఎలక్ట్రిక్ సైకిల్‌పై ఆస్పత్రికి వెళ్లిన జూలీ అన్నే జెంటర్ ఏ దేశానికి చెందిన ఎంపీ?
   1. జర్మన్ 2. అమెరికా
   3. డెన్మార్క్ 4. న్యూజిలాండ్
10. పోలవరం ప్రాజెక్టుకు గల మరొక పేరు?
    1. రాజీవ్ సాగర్ 2. ఇందిరా సాగర్
    3. లాల్ బహదూర్ శాస్త్రి ప్రాజెక్టు
    4. నెహ్రూ సాగర్
11. శీతల దేశాల్లో థర్మామీటర్లలో పాదరసానికి బదులు దేనిని వాడతారు?
    1. సారాయి 2. హైపో 3. నీరు 4. ఆల్కహాల్
12. కింద పేర్కొన్న వారిలో ఎవరిని ఆంధ్ర భీష్మగా పిలుస్తారు?
    1. న్యాపతి సుబ్బారావు
    2. గాజుల లక్ష్మీనరసు శెట్టి
    3. నావిళ్ల వెంకటేశ్వర రావు శాస్త్రి
    4. భోగరాజు పట్టాభి సీతారామయ్య
13. జెమినీ వైరస్ ఏ పంటకు సంబంధించింది?
    1. చెరుకు పంట 2. వేరుశనగ
    3. మిర్చి పంట 4. కొబ్బరి
14. సమానమైన పీడనానికి చెందిన రేఖలు?
    1. ఐసోబార్స్ 2. ఐసోహెల్స్
    3. హైసోహైట్స్ 4. ఐసోనిఫ్
15. ప్రపంచంలో ఎలక్ట్రిక్ కోడ్ అమలులో ఉన్న మొదటి దేశం?
    1. భారత్ 2. చైనా 3. అమెరికా 4. స్వీడన్
16. ఇటీవల కేంద్ర కేబినెట్ గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సంబంధించి ఏ దేశంతో ఒప్పందానికి ఆమోదం తెలిపింది?
    1. కెన్యా 2. మారిషస్
    3. అమెరికా 4. నైజీరియా
17. 'యెట్, ఐయామ్ నాట్ డిఫీటెడ్' పుస్తక రచయిత?
    1. ఝంపాలాహరి 2. జ్యోతి రెడ్డి
    3. అమిత్ వర్మ 4. ఎస్.వి. శేషగిరిరావు
18. తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి అధునాతన రూఫ్ సస్పెండెడ్ అల్ట్రా మోడర్న్ డిజిటల్ ఎక్స్‌రే యంత్రాన్ని విరాళంగా ఇచ్చింది?
    1. డీ మార్ట్ - ఆంధ్రప్రదేశ్
    2. రిలయన్స్ ట్రెండ్స్ అండ్ డిజిటల్స్
    3. సౌత్ ఇండియా షాపింగ్ మాల్
    4. చెన్నై షాపింగ్ మాల్
19. కామన్‌వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ మీటింగ్: ఏప్రిల్ 2018 ఎక్కడ నిర్వహించారు?
    1. లండన్ 2. బ్రిస్బేన్
    3. జోహన్నస్‌బర్గ్ 4. డబ్లిన్
20. బాలికపై అత్యాచారం ఘటనలో పోక్సో కోర్టు ఒక్కరోజులోనే విచారణ పూర్తి చేసి, నిందితునికి శిక్ష విధించిన సంఘటన ఏ రాష్ట్రంలో చోటు చేసుకున్నది?
    1. తమిళనాడు 2. కేరళ
    3. బిహార్ 4. కర్ణాటక

పర్స్‌పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్

21. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం టీచర్ల మొత్తం సంఖ్యలో ఖాళీలు ఎంత శాతానికి మించరాదు?
    1. 10 2. 15 3. 20 4. 30
22. ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఉపాధ్యాయునికి ఇచ్చే టీచర్స్ గ్రాంట్ ఎంత?
    1. 500 2. 1000 3. 1500 4. 2000
23. కె.జి.బి.వి. పాఠశాలలు ఎవరి కొరకు ఏర్పాటు చేశారు?
    1. 6, 7, 8 తరగతులు చదువుతూ బడిమానేసిన పిల్లలు
    2. 5వ తరగతి చదివి బడి మానేసిన పిల్లలు
    3. 9, 10 చదువుతూ బడి మానేసిన పిల్లలు
    4. పైవన్నీ
24. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా ఎవరు ఉంటారు?
    1. గ్రామ సర్పంచ్ 2. గ్రామ వైస్ సర్పంచ్
    3. గ్రామ ప్రత్యేకాధికారి
    4. పాఠశాల ప్రధానోపాధ్యాయులు
25. మత, భాషా సంబంధ మైనార్టీలు విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించుకునే స్వేచ్ఛను కల్పిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్?
    1. 26 2. 27 3. 30 4. 28
26. 6-14 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించే ప్రయత్నంలో ఏ వ్యక్తికి విద్యకు సంబంధించిన హక్కును హరించకూడదని చెప్పే ఆర్టికల్?
    1. 24 2. 23 3. 21 4. 45
27. నిరంతర విద్యా కేంద్రాన్ని ఎంత మంది జనాభాకు ఒకటి నియమిస్తారు?
    1. 1000 2. 1500 3. 2000 4. 3000
28. కేంద్ర ప్రభుత్వం డీపీఈపీ పథకాన్ని ప్రారంభించిన తేదీ?
    1. 11-8-1995 2. 8-11-1994
    3. 6-8-1992 4. 7-11-1996
29. ఎస్ఎస్ఏ కార్యక్రమం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ప్రణాళికలో కేటాయించిన నిష్పత్తి, తొమ్మిది, పది, పదకొండో పంచవర్ష ప్రణాళికల్లో వరుసగా..
    1. 85:15, 25:25, 50:50
    2. 80:20, 70:30, 50:50
    3. 80:20, 75:25, 60: 40
    4. 85:15, 70:30, 60:40
30. ప్రస్తుతం మన రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక విద్య ఏ వయసు వారికి ఇస్తున్నారు.
    1. 3-5 2. 4-6 3. 2-5 4. 4-7
31. మానసిక వైకల్యం గల పిల్లల ప్రవర్తనను అభివృద్ధి పరిచే పద్ధతి?
    1. ఆకృతీకరణ 2. గొలుసు విధానం
    3. ప్రేరణ 4. పైవన్నీ
32. ఏ రకమైన వినికిడి లోపాన్ని ఔషధాలు, శస్త్ర చికిత్సల ద్వారా తగ్గించవచ్చు.
    1. వ్యతిరిక్త, వినికిడి లోపం
    2. అపరివర్తన వినికిడి లోపం
    3. అన్యావర్త వినికిడి లోపం 4. ఏదీకాదు
33. నవోదయ పాఠశాలలను ప్రతి జిల్లాలో స్థాపించాలని సూచించిన కమిటీ?
    1. జనార్దన్‌రెడ్డి కమిటీ 2. కొఠారి కమిషన్
    3. ఎన్ఈపీ-1986 4. యశ్‌పాల్ కమిటీ
34. N.C.F ను విస్తరించండి.
    1. National Continious Frame
    2. National Curriculam Frame
    3. National Council for Education
    4. National Conference For Education
35. CABE స్థాపించిన సంవత్సరం?
    1. 1920 2. 1921 3. 1924 4. 1926
36. ప్రధానోపాధ్యాయుని లక్షణం కానిది?
    1. వృత్తి నైపుణ్యం 2. ఉత్తమ మూర్తిమత్వం
    3. పర్యవేక్షణ నైపుణ్యం 4. కఠిన నిర్ణయాలు
37. సమైక్యత ఉపగమం ప్రస్తావించిన శాస్త్రవేత్త?
    1. బైనింగ్ అండ్ బైనింగ్ 2. హెర్బర్ట్
    3. బ్లూమ్స్ 4. వెస్లీ
38. మధ్యాహ్న భోజన పథకం ఎవరి పర్యవేక్షణలో అమలు అవుతుంది?
    1. ఎంఈవో 2. హెచ్ఎం 3. 1, 2 4. ఎంఆర్‌వో
39. బీఈడీ, ఎంఈడీ కోర్సులు నిర్వహించే సంస్థ
    1. ఎస్ఆర్‌సీ 2. ఎన్‌సీఈఆర్‌టీ
    3. ఆర్ఐఈ 4. డీఐఈటీ
40. ఇంగ్లీష్, విదేశీ భాషల కేంద్ర సంస్థ గల నగరం?
    1. బెంగళూరు 2. ఇండోర్
    3. కలకత్తా 4. హైదరాబాద్

సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 2 5) 4 6) 1 7) 3 8) 1 9) 4 10) 2 11) 4 12) 1 13) 3 14) 1 15) 4 16) 2 17) 2 18) 1 19) 1 20) 3 21)1 22) 1 23) 1 24) 4 25) 3 26) 3 27)1 28) 2 29) 1 30) 1 31) 4 32) 2 33) 3 34) 2 35) 2 36) 4 37) 1 38) 3 39) 3 40) 4

పై ప్రశ్నలను హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన *శీలం దేవేందర్‌రెడ్డి* నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

లిటిల్ స్టార్స్



అంతరంగం

ఒక ముసలావిడ తల మీద పెద్ద మూట మోసుకుంటూ పొరుగూరికి నడుస్తున్నది.

ఆమెకా మూట చాలా బరువుగా తోచింది. అపుడే ఆమె పక్కనుండి గుర్రం మీద ఒక యువకుడు వెళుతూ కనిపించాడు. ముసలావిడ అతన్ని ఆపి, 'బాబూ ఈ మూట చాలా బరువుగా ఉంది. దీన్ని గుర్రం మీద తీసుకెళితే నేను తరువాత వచ్చి తీసుకుంటాను' అన్నది. అప్పటికే చాలా అసహనంగా ఉన్న ఆ యువకుడు 'నాకంత సమయం లేదమ్మా' అనేసి వెళ్లిపోయాడు. కాసేపు ప్రయాణం చేసిన తర్వాత అతను

' ఆ మూటలో ఏవైనా విలువైన వస్తువులు ఉండవచ్చు కదా, ఆ మూటను తీసుకుని, ఆమెకు ఇవ్వకుండా వెళ్లిపోతే మాత్రం నన్ను అడిగేదెవరు? మూట తీసుకున్నా బాగుండేది' అనుకున్నాడు. అలా అనుకోగానే అతను తిరిగి ముసలావిడ వద్దకు వచ్చి 'పెద్దమ్మా నీ మూటను నేను మోస్తా ఇటివ్వు' అని అడిగాడు. దానికి ముసలావిడ 'ఇపుడు నేను నిన్ను నమ్మలేను' అన్నది.

దానికి ఆ యువకుడు ఎందుకలా అంటున్నావు? ఇలా మాట్లాడమని నీకెవరు చెప్పారు? అన్నాడు అపుడు ముసలావిడ 'మూట కోసం తిరిగి వెనక్కి రమ్మని నీకు చెప్పిన వాడే నాకూ ఇవ్వవద్దని చెప్పాడు అన్నది.

'నీ మాటలను బట్టి నీ అంతరంగంలో ఆలోచన నాకు తెలిసిపోయిందిలే' అని మెల్లగా అని అక్కడినుండి నడక సాగించింది ముసలావిడ.

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి!






ఎవి ఎన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 350

	9		1	6				
			7		9	6		5
					3			8
5				9				
9	8	4		2		7	3	6
				3				4
2			9					
4		7	8		6			
				7	2		4	

సుడోకు - 349 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.